# నడుస్తున్న తెలంగాణ

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

సంపుటి: 9 సంచిక: 8 హైదరాబాద్ 102 ఆగస్టు 2019 పేజీలు : 52 వెల: 20/-

- దర్జాగా దురాక్రమణ
- ఎడ్యుకేషన్ ఈజ్ ది పవరఫుల్ వెపన్
- యురేనియం - ప్రాణాంతక పర్యవసానాలు
- నల్లమల మెడకు 'ఉరే'నియం
- యురేనియం తవ్వకాలు - పర్యావరణ విధ్వంసం



nadusthunna telangana

# నడుస్తున్న తెలంగాణ

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

ISSN 2349-2376

ఆగస్ట్ 2019

సంచిక : 8

సంపుటి : 9



గౌరవ సంపాదకులు

**ప్రొ॥ అడపా సత్యనారాయణ**

సలహామండలి

**అల్లం నారాయణ**

చైర్మన్-ప్రెస్ అకాడమి

**చిక్కుడు ప్రభాకర్**

అడ్వకేట్-న్యాయ సలహాదారు

ప్రధాన సంపాదకుడు

**డా॥చింతకింది కాశీం**

సంపాదకురాలు

**స్నేహలత ఎం.**

సంపాదకవర్గం

**డా॥ఎ.సిల్మానాయక్**, అసోసియేట్ ప్రొఫెసర్

**క్రాంతి**, జర్నలిస్టు

**శివరాత్రి సుధాకర్**, పరిశోధక విద్యార్థి

**ప్రతాప్ గోపగళ్ల**, పరిశోధక విద్యార్థి

డిటిపి, లే ఔట్ : స్నేహ

కవర్ డిజైన్ : క్రాంతి



రచనలు, చందాలు, విరాళాలు పంపవల్సిన చిరునామా

**స్నేహలత ఎం.,**

క్వార్టర్ నెం. R-9, O.U క్వార్టర్స్,

ఉస్మానియా యూనివర్శిటి, హైదరాబాద్-500 007.

ఇ.మెయిల్:nadusthunnatelangana@gmail.com

**ఫోన్ నెం.: 9290745490**



**నడుస్తున్న తెలంగాణ అకౌంట్ నెంబర్: 62254225854**

ఎస్‌బిహెచ్, రాంకోఠి బ్రాంచ్(20350), హైద్రాబాద్.

IFSC: SBIN0020350


## సంపాదకుని ఉత్తరం

గబ్బిలాలు తిరుగాడేవేళ
కుంకుమ పువ్వు మీద
దుఃఖం
మంచులా కరుగుతుంది

నీరెండ పొలుపులో
ఇనుప కంచె కొసకు
నెత్తురు
బొట్టు బొట్టులా కారుతుంది

సూర్యుడు
నడినెత్తిన కుదురులా
పొదిగిన వేళ
మంచు గడ్డల నుంచి
మీసం మొలిచిన శవం
బయటపడుతుంది

పిడికిట్లోని యాపిల్ పండు
రాయిలా మారటం తప్ప
ఈ దేశంలో నాకు
మిగిలిందేమున్నది!?

12 ఆగస్ట్ 2019


నూరు పూలు వికసించనీ, వేయి ఆలోచనలు సంఘర్షించనీ అన్నట్లు ప్రజానుకూలమైన భిన్న ఆలోచనలకు మా పత్రికలో చోటుంటుంది. కనుక ఈ పత్రికలో ముద్రించిన అభిప్రాయాలు రచయితలవే. సంపాదక వర్గానికి ఏకీభావం ఉండనవసరం లేదు.

# తెలంగాణ తొవ్వ


**సంపాదకీయం**

దర్జాగా దురాక్రమణ | **క్రాంతి** | 5

**నడుస్తున్న కాలం**

ఎడ్యుకేషన్ ఈజ్ ది పవర్‌ఫుల్ వెపన్ | **చింతకింది కాశీం** | 6

నల్లమల మెడకు 'ఉరే'నియం | **శివరాత్రి సుధాకర్** | 10

నల్లమల పరిరక్షణ–మన బాధ్యత | **అరవింద్** | 13

యురేనియం–ప్రాణాంతక పర్యవసనాలు | **గీతాంజలి** | 16

మరణం అంచున నల్లమల | **ఎనుపోతుల వెంకటేష్** | 23

యురేనియం తవ్వకాలు–పర్యావరణ విధ్వంసం | **రాజేందర్‌రెడ్డి** | 25

స్వాతంత్ర్యం–ప్రజా విమోచనం | **కోబాడ్ గాంధి** | 27

**జాతీయం**

జమిలి ఎన్నికలు–ఫెడరల్ వ్యవస్థకు విఘాతం | **ఎ.నర్సింహ్మారెడ్డి** | 38

**సాహిత్యం**

జెండా జగడం | **కథ** | **సమీర** | 44

**పుస్తక పరిచయం**

అతడు, రాయలసీమ సమాజం–సాహిత్యం | **ఇమ్మిడి మహేందర్** | 48


*నిర్బంధం పిడికిట్లో*
*నువ్ బంధించిన*
*గాలేది?*
*నియంతృత్వపు చేతుల్తో*
*నువ్ విరిచిన*
*కలమేదీ?*
*అదిగదిగో నిన్నధిగమించి*
*మళ్లిందా గాలే...*
*మళ్లీ ఆ కలమే...*

***- అలిశెట్టి ప్రభాకర్***



సంపాదకీయం

# దర్జాగా దురాక్రమణ

క్రాంతి

చట్ట సభల సాక్షిగా మరో చీకటి అధ్యాయం ఆరంభమైంది. దశాబ్దాల విద్రోహం జడలు విప్పి ధ్వంస రచనకు పూనుకుంది. లక్షలాది సైన్యాన్ని మోహరించి, ఎదపై తుపాకీని గురిపెట్టి దర్జాగా ఒక దురాక్రమణకు సిద్ధమైంది కేంద్రం. తమది కాని నేలను ఆక్రమించుకునేందుకు ప్రజల్ని, నాయకుల్ని నిర్బంధించి, ఇంటర్‌నెట్, ఫోన్, టెలివిజన్ లాంటి మాధ్యమాలను రద్దు చేసి జమ్మూ కశ్మీర్‌కి ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370, కశ్మీర్‌లో శాశ్వత నివాసుల్ని నిర్వచించే ఆర్టికల్ 35ఏ ను రద్దు చేసింది కేంద్ర ప్రభుత్వం. ఒక జాతి ఆకాంక్షలపై నిప్పులు కుమ్మరించింది.

బీజేపీ మొదటి నుంచీ.. కశ్మీర్‌పై పెత్తనం కోసం ప్రయత్నిస్తూనే ఉంది. పొత్తుల పేరుతో కశ్మీర్‌లో అధికారాన్ని నెరిపేందుకు యత్నించిన కేంద్రం అది కాస్తా బెడిసి కొట్టడంతో రాష్ట్రపతి పాలన విధించింది. ఇప్పుడు కశ్మీర్‌ను ఒక చెరసాలగా మార్చి బలవంతంగా కశ్మీర్ భూభాగంపై తమ అధికారాన్ని చెలాయించేందుకు యత్నిస్తోంది. అందులో భాగంగానే జమ్మూ కశ్మీర్‌కి ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేసింది. రాజ్యసభలో ఆర్టికల్ 370 రద్దు బిల్లును ప్రవేశపెట్టిన గంటల వ్యవధిలోనే రాష్ట్రపతి గెజిట్ విడుదల చేయడం, ఆ వెంటనే కశ్మీర్ సరిహద్దుల మార్పుపై నిర్ణయం తీసుకోవడం జరిగిపోయాయి. కశ్మీర్ ఇక భారత్‌లో భాగమంటూ కేంద్రం సగర్వంగా ప్రకటించుకుంది.

నిజానికి కశ్మీర్ భారత్‌లో ఎప్పుడూ భాగం కాదు. 1947 అధికార మార్పిడి నాటికి బ్రిటీష్ పాలనలో 570కి పైగా సంస్థానాలు ఉండేవి. 1947 నాటి భారత స్వాతంత్ర్య చట్టం ఆయా సంస్థానాధీశులకు ఇండియన్ యూనియన్‌లో చేరడం, లేదా పాకిస్తాన్‌తో కలవడం, లేదా స్వతంత్రంగా కొనసాగడమనే అవకాశాలను కల్పించింది. కానీ ఆయా సంస్థానాధీశులతో విడివిడిగా బేరాలాడుకుని భారత్‌లో కలుపుకుంటూ వచ్చారు. అందుకోసం... సామదానభేద దండోపాయాలు అవలంభించారు. అయినా... హైదరాబాద్, జునాగఢ్, కశ్మీర్ సంస్థానాధీశులు మాత్రం స్వతంత్ర దేశాలుగా కొనసాగాలనుకున్నారు. కానీ, ఇండియన్ యూనియన్ సేనలు హైదరాబాద్ సంస్థానంపై యుద్ధాన్ని ప్రకటించాయి. నిజాం రాజును లొంగదీసుకొని, హైదరాబాద్‌ను ఇండియన్ యూనియన్‌లో కలుపుకున్నాయి.

కశ్మీర్ పాలకుడు హరిసింగ్ ఒకవైపు స్వతంత్రంగా వుండాలనుకుంటూనే మరోవైపు పాకిస్థాన్‌తో మంతనాలు ఆరంభించాడు. దీంతో కశ్మీర్‌ను సొంతం చేసుకోవాలనుకున్న పాక్ కశ్మీర్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించింది. దీంతో రాజా హరిసింగ్ భారత్‌ని ఆశ్రయించాడు. భారత్‌తో కలిసి కొనసాగేందుకు సంసిద్ధతను వ్యక్తం చేశాడు. 1947 అక్టోబర్‌లో జమ్మూ కశ్మీర్ భారత్‌లో విలీనం తర్వాత షేక్ అబ్దుల్లా పాలనలోకి వచ్చింది. విలీనం సందర్భంగా చేసుకున్న ఒప్పందాల ఫలితంగా రాజ్యాంగంలో 370 ఆర్టికల్‌ను చేర్చారు. రక్షణ, విదేశీ వ్యవహారాలు, కమ్యూనికేషన్లు మినహా మిగతావన్నీ జమ్మూ-కశ్మీర్ అధికార పరిధిలోనే ఉంటాయనేది ఈ ఆర్టికల్ సారాంశం. తదనంతరం 1952 షేక్ అబ్దుల్లా, జవహర్‌లాల్ నెహ్రూ మధ్య కుదిరిన ఢిల్లీ ఒప్పందం ప్రకారం 35ఏ ఆర్టికల్‌ను రాజ్యాంగంలో చేర్చారు. కశ్మీర్ శాశ్వత నివాసులను నిర్వచించే అధికారం ఆ రాష్ట్ర శాసనసభకు ఈ ఆర్టికల్ ద్వారా లభిస్తోంది. ఈ ఆర్టికల్‌ను 1954 రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా, ఆ రాష్ట్ర ప్రభుత్వ సమ్మతితో భారత రాజ్యాంగంలో చేర్చారు.

రాజా హరిసింగ్ ఇండియన్ యూనియన్‌తో చేసుకున్న ఒప్పందంతో కశ్మీర్ ప్రజలకు ఎలాంటి సంబంధం లేదు. కశ్మీర్ ప్రజలు మొదటి నుంచీ స్వతంత్రంగా ఉండాలనే ఆకాంక్షను వ్యక్తం చేస్తూ వచ్చారు. కానీ, పాలకులు తీసుకున్న నిర్ణయాల వల్ల దశాబ్దాలుగా కశ్మీర్ ప్రజలు తీవ్ర అణచివేతను అనుభవిస్తున్నారు. కశ్మీర్‌పై తమ పెత్తనాన్ని నిలబెట్టుకునేందుకు భారత పాలకులు భారీగా సైన్యాన్ని మోహరించి అక్కడి ప్రజల ఆకాంక్షలను అణచివేసేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నారు.

ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం... నాడు చేసుకున్న ఒప్పందాలను ఉల్లంఘించి, కశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేసింది. ఆర్టికల్ 370, ఆర్టికల్ 35ఏ రద్దుతో జమ్మూ-కశ్మీరులో పర్యాటకం, హాస్పిటాలిటీ, రియల్ ఎస్టేట్ రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు ముందుకొస్తున్నారని పాలకులు ఆర్భాటంగా ప్రకటిస్తున్నారు. నిజానికి కశ్మీర్‌లో సహజ వనరులపై కన్నేసిన పాలక వర్గాలు, అక్కడ నెత్తురు పారించైనా వాటిని హస్తగతం చేసుకోవాలనుకుంటున్నాయి. అందుకోసం లక్షలాదిగా సైన్యాన్ని మోహరించి కశ్మీరీ ప్రజల స్వయం నిర్ణయాధికారాన్ని కాలరాస్తున్నాయి. భారత పాలకవర్గాల ఈ దురాక్రమణను నిరసించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కశ్మీరీ ప్రజలతో పాటు దేశవ్యాప్తంగా సాగే జాతి విముక్తి పోరాటాల వెంట నిలవాల్సిన అవసరం ఉంది.

***14 ఆగస్టు, 2019***

నడుస్తున్న కాలం

# ఎడ్యుకేషన్ ఈజ్ ది పవర్‌ఫుల్ వెపన్

చింతకింది కాశీం

సమాజాన్ని మార్చడానికి విద్య శక్తివంతమైన సాధనమని, అంబేద్కర్ విద్యారంగం గురించి రాస్తూ చెప్పాడు. సారాంశంలో ఇదే విషయాన్ని ఎందరో తత్వవేత్తలు చెప్పి ఉన్నారు. ఏ సమాజాన్నైనా మార్చాలంటే శక్తివంతమైన రాజకీయ సిద్ధాంతం ఉండాలి, దానిని ఆచరించే సమూహం ఉండాలి. అయితే ఇవి రెండూ సాధ్యం కావాలంటే విద్య తెలిసిన మనుషులుండాలి. సమాజంలోకి భావాలను చొప్పించాలంటే విద్యను మించిన సాధనం మరొకటి ఉండదు. మార్పుకు సంబంధించిన ప్రగతి భావాలను మనుషులలో వ్యాపింప చేయడానికి అనేక అవరోధాలు ఉంటున్నాయి. ప్రగతి నిరోధక యధాతథ భావాలను విద్య ద్వారా చెప్పడం చాలా సులభం. విద్య అనేది ఉపరితల దృగ్గోచరం. దానిని నిర్ణయించి నడిపే అంతస్సారం మాత్రం రాజ్య యంత్రాంగం. కనుక రాజ్య యంత్రాంగం ఎవరి చేతుల్లో ఉంటుందో భావజాల రంగం వారి చేతుల్లోనే ఉంటుంది. బానిస, భూస్వామ్య, పెట్టుబడిదారి సమాజాల భావజాలాన్ని విద్య విజయవంతంగా సమాజంలో వ్యాప్తి చేసింది. భారతదేశం లాంటి బ్రాహ్మణీయ భూస్వామ్య సమాజాలలో విద్య పాత్ర మరీ కీలకమైంది. వేల సంవత్సరాలుగా వర్ణవ్యవస్థ, కుల అంతరాలు కొనసాగడానికి వేదవిద్య ప్రధాన పాత్రను నిర్వహించింది. ఇప్పటికీ పాలకవర్గాలు ఈ భావజాలాన్నే కలిగి ఉంటున్నాయి. రాజ్య యంత్రాంగ స్వభావాన్ని విద్యార్థులలో చొప్పించి, కుల, అలౌకిక భావనలను వారిలో విస్తృతపర్చడంలో విద్య కీలకపాత్రను కలిగి ఉంటుంది.

ఇవ్వాళ మన ముందుకు వచ్చిన జాతీయ విద్యా విధానం-2019 ముసాయిదా దీనికి భిన్నంగా ఏమీ లేదు. భారతీయ విద్యారంగం ఇంకా వైదిక వాస్తవాలను వదిలించు కోలేకపోతున్నది. వలసానంతర భారతదేశంలో విద్యారంగం ఎలా ఉండాలనే అంశంపై భారత జాతీయ కాంగ్రెస్ 1906లోనే ఆలోచించింది. ఆ సంవత్సరంలోనే ఆజాద్, ఠాగోర్, గాంధీల నాయకత్వంలో జాతీయ విద్యా విధానాన్ని రూపొందించడానికి కాంగ్రెస్ ఒక తీర్మానం చేసింది. దేశ ప్రజలందరికి సమాన విద్యను అందించడం, విద్యలో నాణ్యత ఉండేలా చూడడం, మెకాలే విద్యను నిరాకరించడం, మన దేశంలోని భిన్న సంస్కృతులను ప్రతిబింబించే విద్య ఉండటం, ఈ దేశ అవసరాలు తీర్చేలా కర్రిక్యులమ్ రూపొందించటం మొదలైన విషయాలు ఆ తీర్మానంలో ఉన్నాయి. నిజానికి ఈ విషయాలే ఇప్పటికీ మన విద్యా విధానాలకు దిక్సూచిలా ఉన్నాయి.

కేంద్ర ప్రభుత్వం 1964లో మొదటిసారి మన విద్యారంగం గురించి, దాని భవిష్యత్ నిర్మాణం గురించి అధ్యయనం చేయడానికి ప్రొఫెసర్ రజనీ కొఠారీ అధ్యక్షతన ఒక కమీషన్‌ను నియమించింది. ఆయన ఆధ్వర్యంలో విద్యారంగంపై అధ్యయనం చేసిన కమీషన్ 1966లో నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నివేదిక ఆధారంగా 1968లో మొదటి భారతీయ విద్యా విధానం రూపొందించ బడింది. దీనిలో అనేక విషయాలు చర్చించారు. విద్యలో సంక్షేమ రాజ్యభావన ఉండాలని వాళ్లు భావించారు. నిజానికి ఇప్పటి వరకు మన దేశ నిర్దిష్ట పరిస్థితులకు అనువుగా రూపొందించిన ఏకైక విద్యావిధానం ఇదేనని చెప్పవచ్చు. ఇందులో కొఠారీ కృషిని విస్మరించలేము. అయితే ఈ విద్యావిధానంలోని చాలా అంశాలు అమలుకు నోచుకోలేదు. 1986లో రెండో జాతీయ విద్యావిధానం వచ్చింది. ఈ విద్యావిధానం దేశ మౌలిక అంశాలను పట్టించుకోకుండా మార్కెట్ ఆధారిత భావనలకు చట్టబద్ధత కల్పించింది. విద్యలోకి ప్రైవేట్ పెట్టుబడులను ఆహ్వానించి విద్యా వ్యాపారానికి తెరలేపింది. ఇక్కడి ప్రజల ప్రయోజనాల కంటే బహుళ జాతి కంపెనీల ప్రయోజనాలను నెరవేర్చే విధాన నిర్ణయం జరిగింది. దాని ఫలితంగానే ఇవ్వాళ మన విద్యారంగం సంక్షోభంలో పడింది.

ఈ సంక్షోభం నుంచి విద్యారంగాన్ని గట్టెక్కిస్తామని చెబుతూ నేటి కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానం-2019 డ్రాఫ్టును దేశ ప్రజల ముందుకు తెచ్చింది. ఇది మనదేశంలో ఇప్పటి వరకు వచ్చిన మూడో విద్యావిధాన పత్రం. ఈ డ్రాఫ్టులో చెప్పుకున్న విషయాలను పైపైన పరిశీలిస్తే మెరుగుల వలె అన్పిస్తాయి. కాని సూక్ష్మంగా 'బిట్‌వీన్ ద లైన్స్'ను అధ్యయనం చేస్తే 1986 విద్యా విధానానికి కొనసాగింపుగా వచ్చిన డ్రాఫ్టుగా అర్థమవుతుంది. నాటికంటే తిరోగమన భావాలను బలంగా




ప్రవేశపెట్టి గ్లోబల్ మార్కెట్ ప్రయోజనాలను ఈడేర్చేలా ఉంది. డ్రాఫ్ట్‌ను రూపొందించిన వ్యక్తులను బట్టి దాని ప్రగతిశీలతను మనం అంచనా వేయవచ్చు. పరిశీలన సౌలభ్యం కోసం నేను ఈ డ్రాఫ్ట్‌ను మూడు రకాలుగా విభజిస్తున్నాను. 1. నిర్మాణం, 2.నిర్వహణ, 3.కరిక్యులం

**1. నిర్మాణం**

ఈ డ్రాఫ్ట్‌కు ముందు టీఎస్ఆర్ సుబ్రహ్మణ్య కమిటీ వేసారు. ఆయన దాదాపు ఇవే అభిప్రాయాలను వ్యక్తం చేసాడు. అయితే ఫక్తు సంఘ్ పరివార్ అభిప్రాయాలను ఈ కమిటీ ప్రతిఫలించలేదని దీనిని సమీక్షిస్తూ ఇస్రో మాజీ చైర్మన్ కస్తూరి రంగన్‌తో మరో కమిటీ వేసారు. ఈ ముసాయిదా కమిటీ సభ్యులుగా ప్రొఫెసర్ ఎ.మంజుల్ బార్గవ(ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ-అమెరికా), ప్రొఫెసర్ సి.అనురాగ్ బెహర్(వైస్ ఛాన్స్‌లర్-అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ-బెంగుళూరు), డి.లీనా చంద్రన్ వాడియా(అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్-ముంబై) బి.కె.రామచంద్రన్(ఎన్ఐఈపీఏ-న్యూఢిల్లీ). ఈ డ్రాఫ్ట్‌ను రూపొందించిన ముసాయిదా కమిటీ సభ్యులలో ఒకరు విదేశీ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్, మరొకరు ప్రైవేట్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్, మరొకరు స్వచ్ఛంద సంస్థ సభ్యులు. వీరికి దేశ ప్రయోజనాల పట్ల ఎంత మాత్రం ఆసక్తి ఉంటుందో మనం అంచనా వేయవచ్చు. ప్రైవేట్, విదేశీ సంస్థల ప్రయోజనాలు తీర్చే విధంగా విద్యా విధాన పత్రాన్ని రూపొందించడానికే వీరి సర్వశక్తులు ఒడ్డారని అర్థం చేసుకోవచ్చు.

ఏ దేశంలోనైనా విద్యారంగం స్వయం ప్రతిపత్తి కలిగి ఉంటుంది. మేధో స్థాయిలో జరగవల్సిన అధ్యయనం, అధ్యాపనం, పరిశోధన రాజకీయ ప్రభావాలకు దూరంగా ఉండాలని మన విద్యావేత్తలు, రాజ్యాంగ నిపుణులు కొంత మేరకైనా ఆలోచించారు. అందుకే ఉన్నత విద్యను నిర్దేశించే యూజీసీకి, విశ్వవిద్యాలయాలకు స్వయంప్రతిపత్తిని కల్పించారు. ఇంకా అదే స్థాయిలో AICTE, PCI, NCTE లాంటి సంస్థలను కూడా నెలకొల్పారు. అయితే వీటన్నింటిని రద్దు చేస్తూ NHERA (నేషనల్ హైయ్యర్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ అథారిటీ)ని ఏర్పాటు చేయాలని నూతనవిద్యావిధానం ముసాయిదా ప్రతిపాదించింది. అంతమాత్రమే కాకుండా జాతీయ విద్యా కమీషన్‌ను ఏర్పాటు చేసి దానికి చైర్మన్‌గా ప్రధానమంత్రిని ఉంచాలని ఈ డ్రాఫ్ట్ చెప్పింది. ఒకవేళ ఇలా జరిగితే విద్యారంగానికి ఉండవల్సిన అటానమస్ దెబ్బతిని రాజకీయాలు విద్యారంగంలో జొరబడే ప్రమాదం ఉంది. అధికారంలో ఉన్న పార్టీల భావజాలమే విద్యలోకి ప్రవేశించి ప్రజాస్వామిక భావనలకు విఘాతం కలుగుతుంది. సమన్వయ లోపం ఏర్పడి పర్యవేక్షణకు ఆటంకాలు కలుగుతాయి. నీతి అయోగ్ వలె రాష్ట్రీయ శిక్ష అయోగ్ ఏర్పడి దానికి ప్రధాని అధ్యక్షుడిగా ఉండి వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు సభ్యులుగా ఉండట మంటే విద్యావేత్తలతో భర్తీ చేయవల్సిన చోట నేరుగా రాజకీయాలు ప్రవేశిస్తాయి. ఫలితంగా విద్యాలక్ష్యాలు దెబ్బతింటాయి.

ఈ డ్రాఫ్ట్‌ను కొన్ని వందల మంది సంఘ్ పరివార్ స్కాలర్స్ నాగపూర్ కేంద్రంగా రూపొందించి ముందుకు తీసుకొచ్చారనే విమర్శ కూడా మేధావి వర్గంలో ఉంది. ఇదే నిజమైతే మన దేశంలోని బహుళ సంస్కృతులకు, ఆలోచనలకు గొడ్డలిపెట్టుగా విద్యారంగం మారబోతుందనే సంకేతాలు అందుతున్నట్లే. ఈ డ్రాఫ్ట్ విజన్‌లో చెప్పిన విషయాన్ని గమనిస్తే కూడా దాని ప్రయాణమేమిటో మనకు అర్థమవుతుంది. 'భారత కేంద్రీకృత విద్యావ్యవస్థ' అని పేర్కొన్నారు. నిజానికి మన రాజ్యాంగం ప్రకారం విద్య అనేది ఉమ్మడి జాబితాలో ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉండే సమాఖ్య విధానానికి అనువుగా ఇది రూపొందించబడింది. కానీ 'కేంద్రీకృత విద్యావ్యవస్థ' అనే మాటనే సమాఖ్య స్ఫూర్తికి భిన్నమైనది. బలమైన కేంద్రం ఏర్పడాలనే సంఘ్ పరివార్ ఆలోచనకు అద్దం పట్టేలా ఉంది.

**2. నిర్వహణ**

మన విద్యా విధానాన్ని ఏ విధంగా నిర్వహించి అమలు చేయబోతున్నారనే విషయాన్ని పరిశీలిస్తే ఆశ్చర్యకరమైన విషయాలు గమనంలోకి వస్తున్నాయి. ప్రారంభం ఎంత గంభీరంగా ఉందనేది కాదు, ముగింపు ఎంత లాజిక్‌గా ఉండ బోతున్నదనేది ముఖ్యం. దాని నిర్మాణంలో ఇన్నిరకాల సమస్యలు ఉన్నప్పుడు నిర్వహణ పద్ధతిపై కూడా అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం అమలులో ఉన్న వృత్తి విద్య కోర్సులు, సాధారణ విద్యనందించే సంస్థలు, భాషా -సాహిత్యాలను నేర్పే విద్యాలయాలు, శాస్త్ర సాంకేతిక విద్యా సంస్థలు మొదలైన వాటిని రద్దుపర్చి ఒకే గొడుగు కిందికి అన్ని కోర్సులను అందించే ఏక నియంత్రణ సంస్థను ఉనికిలోకి తీసుకరానున్నట్లు డ్రాఫ్ట్‌లో పేర్కొన్నారు. ఇది విదేశాలలో అమలవుతున్నది. ఈ విధానాన్ని ఇక్కడ అమలు చేస్తే అనేకరకాల సమస్యలు తలెత్తుతాయి. తక్కువ జనాభా ఉండి, విస్తీర్ణంలో చిన్న దేశాలలో అక్షరాస్యత ఎక్కువగా ఉండి, విద్యా చైతన్యం ఉన్న దేశాలలో దీని సాధ్యాసాధ్యాలను పరిశీలించవచ్చు. కానీ భారతదేశం లాంటి విశాలమైన, బహుళ అస్తిత్వాలు గల, విద్యా చైతన్యం లేని చోట దీని అమలుకు అనేక అడ్డంకులు ఏర్పడుతాయి.

ఇప్పటికే దేశంలో ఉన్న 800 విశ్వవిద్యాలయాలను 40 వేల కళాశాలలను మూసివేసి 15 వందలకే పరిమితం చేయాలని ఈ డ్రాఫ్ట్‌లో ప్రస్తావించారు. అంటే 60 శాతం విద్యాలయాలను తగ్గించబోతున్నారని అర్థమవుతుంది. ఇప్పటికి మన దేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలలో ఉన్నత విద్యకు చేరుకున్న వారి సంఖ్య పదిశాతంకు మించలేదు. అంటే ఇప్పుడున్న విద్యాసంస్థలు సరిపోవటం లేదని అర్థమవుతుంది. ఉన్నవాటినే కుదిస్తే ఈ వర్గాలకు ఉన్నత విద్యను ఎలా అందిస్తారనే స్పష్టత డ్రాఫ్ట్‌లో లేదు. అంటే ఒకరకంగా ఉత్పత్తి కులాల ప్రజలను ఉన్నత విద్యకు దూరం చేసే ప్రయత్నమేదో దీని అంతరార్థంలో ఉందనే సందేహం చాలామందిలో ఉంది.

ప్రీ ప్రైమరీ విద్యను ఈ డ్రాఫ్ట్‌లో తప్పనిసరి చేసారు. మూడేళ్ల పిల్లలకు సంబంధించిన ఈ విద్య ఇప్పుడు పట్టణాలకే పరిమితమై ఉంది. ఇపుడు ఈ విద్యావ్యాపారం గ్రామాలకు కూడా ప్రవేశిస్తుంది. తల్లిదండ్రుల బలహీనతలను డబ్బుగా మార్చుకునే ప్రైవేట్ విద్యా వ్యాపారాలు రానున్న రోజులలో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ పాఠశాలలు ప్రారంభం కాబోతున్నాయని అర్థమవుతుంది. ఐఐటీ ఫౌండేషన్ కోర్సుల ప్రచారం భవిష్యత్‌లో నిరక్ష్యరాస్యులైన గ్రామీణులలో జరగబోతున్నది. 5+3+3+4 విద్యా విధానం అమలులో ఎలా ఉండబోతున్నదనేది ఆచరణలోకి ప్రవేశిస్తే తప్ప అర్థంకాదు. 1986లో వచ్చిన నూతన విద్యావిధానం ఫలితంగా విద్యా రంగంలోకి పెట్టుబడి ప్రవేశించి అనేక చెడు పరిణామాలను ఎదుర్కొంటున్నాము. దాని వలననే విద్యాలక్ష్యాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీని గురించిన ప్రస్తావనను అంతగా పట్టించు కోకుండా 2019 విద్యా ముసాయిదా ప్రైవేటీకరణకు దారులను మరింత సుగమం చేసింది. విద్య అందరికీ సమానంగా, నాణ్యతతో అందడంలో విద్యా లక్ష్యాలను అందరికీ సమానంగా చేరవేయడంలో ప్రైవేటీకరణ ఒక బలమైన ఆధారాంశమని ప్రకటించారు. కామన్ స్కూల్ విధానాన్ని విస్తరించడం వలన విద్యా లక్ష్యాలు నెరవేరుతాయి కానీ ప్రైవేటీకరిస్తే ఎలా సాధ్యమనే విషయాన్ని డ్రాఫ్ట్ నిర్మాతలు చెప్పాలి. ఇప్పటికే ప్రైవేట్‌లో విపరీతమైన ఫీజులు పెరిగిన కారణంగా తల్లిదండ్రులు తమ పిల్లలను మధ్యంతరంగా చదువులు మానిపిస్తున్నారు. ప్రభుత్వం విద్యను అందరికి అందుబాటులో ఉంచటం లేదు. ఇన్ని కారణాల వలన ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రజలు, అగ్రకులాలలోని పేదలు రోజురోజుకు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలు తమ ఫీజులను తామే నిర్ణయించుకునే అధికారాన్ని కూడా యాజమాన్యాలకు కట్టబెట్టాలని ఈ డ్రాఫ్ట్ చెప్పింది. ఇప్పటికే ఫీజుల విషయంలో నియంత్రణ లేదు. ఒకవేళ ఇదే అమలు జరిగితే దేశంలో అతిపెద్ద వ్యాపారం విద్యారంగమే అవుతుందేమో?!

ప్రైవేట్ విద్యా సంస్థలకు ఆటస్థలం, నిర్ణీత భవనాలు ఉండాలనే నిబంధనను సడలించాలని డ్రాఫ్ట్‌లో ఉంది. ఇప్పటికే అపార్ట్‌మెంట్స్‌లో స్కూల్స్, కాలేజెస్ నడుస్తున్నాయి. ఇక ఇది చట్టబద్ధమైతే బెడ్‌రూములు కూడా తరగతి గదులుగా మారిపోతాయి. ప్రభుత్వ విద్యాసంస్థలు ప్రజల భాగస్వామ్యంతో వనరులను సమకూర్చుకోవాలని ముసాయిదా నిపుణులు సూచిస్తున్నారు. భారతదేశం లాంటి సమాజంలో ఇది సాధ్యమేనా? కానప్పుడు ప్రభుత్వం ఈ ఆలోచనను ఎందుకు ముందుకు తెస్తున్నదంటే విద్యాసంస్థలకు నిధులను సమకూర్చే బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పుకునే ఆలోచననే దీని అసలు రహస్యం. విద్యను ఒక పెట్టుబడిగా గుర్తించాలనే 1986 నాటి విద్యావిధానానికి 2019 విద్యా విధానం ఏమాత్రం తీసిపోకపోగా దానిని మరింత చలన భరితం చేయడానికి ప్రతిపాదనలను ముందుకు తెచ్చింది. పదేళ్లలోపు విద్యారంగానికి 20 శాతం పెట్టుబడిని పెంచాలని డ్రాఫ్ట్‌లో ప్రస్తావించారు. ఇది ఎలా సాధ్యమనే వివరణ లేదు. గతంలో కూడా జీడీపీలో విద్యారంగంపై 6 శాతం కేటాయించాలని రాసుకున్నారు. ఇప్పటి వరకు అది అమలుకాలేదు. 2030 నాటికి 100 శాతం అక్షరాస్యత సాధిస్తామని చెప్పారు. డెబ్బై ఏళ్లలో సాధ్యం కాని విషయం పదేళ్లలో ఎలా సాధ్యపడుతుందో విజ్ఞులు ఆలోచించాలి.

ఉన్నత విద్యకు సంబంధించి ఈ డ్రాఫ్ట్‌లో చెప్పిన విషయాలు ప్రైవేట్, విదేశీ విశ్వవిద్యాలయాలకు అనుకూలంగా ఉన్నాయి. విశ్వవిద్యాలయాలను మూడు రకాలుగా వర్గీకరించారు. పరిశోధన, బోధన, బోధన కళాశాలలుగా వర్గీకరించారు. ఇది అశాస్త్రీయమైన విభజన. బోధన-పరిశోధనలను విడదీసి చూడకూడదు. అలా చేస్తే ఉన్నత విద్యలో నాణ్యమైన బోధన లోపిస్తుంది. విజ్ఞానాన్ని విద్యార్థులకు అందించాలనే లక్ష్యం దెబ్బతిని నిస్సారమైన బోధన జరిగే ప్రమాదం ఉంది. ప్రతీ అధ్యాపకుడు నిరంతరం అధ్యయనం, పరిశోధన, అధ్యాపనం చేయాలి. అప్పుడే విద్యార్థులలో సృజనాత్మకతను పెంచగలం. అనుబంధ కళాశాలలు ఉండ కూడదనే నిబంధన వలన రానున్న కాలంలో విద్యార్థులకు తరగతి గది బోధన శూన్యమై డిజిటల్ బోధనకు ప్రాధాన్యత పెరుగుతుంది. అప్పుడు విద్యార్థులకు ప్రత్యక్ష జ్ఞానం పొందే అవకాశం ఉండదు. విశ్వవిద్యాలయాలలో పరిశోధనల కోసం ప్రధానమంత్రి ఆధ్వర్యంలో నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్‌కు 20 వేల కోట్ల నిధిని ఏర్పాటు చేసి ప్రైవేట్, ప్రభుత్వ విద్యాసంస్థలకు సమాన ప్రాధాన్యతను ఇస్తామని చెప్పటమంటే ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేసి ప్రైవేట్ విద్యాలయాలను ప్రోత్సహించడ మేనని స్పష్టంగా అర్థమవుతుంది.

**3. కర్రిక్యులం**

విద్యార్థి జ్ఞానం పొందడానికి భాష ముఖ్య పాత్ర పోషిస్తుంది. ఈ ముసాయిదా ఆంగ్ల భాషకు ప్రాధాన్యతను తగ్గించాలనే భారతీయ భావనను వ్యక్తం చేసింది. ఇప్పుడిప్పుడే ఆంగ్ల భాషకు దగ్గరవుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల ప్రజలకు ఆంగ్ల భాష అందకుండా చేసే ప్రయత్నమేదో జరుగుతున్నట్లు అన్పిస్తుంది. పాళీ, ప్రాకృతం, పర్షియన్, సంస్కృతం భాషలకు లేని ప్రాధాన్యతను డ్రాఫ్ట్‌లో చెప్పారంటే బ్రాహ్మణీయ భావజాలాన్ని సిలబస్‌లోకి తీసుకొచ్చే ప్రయత్నమే ఉంది. సంఘ్ పరివార్‌కు అనువైన సిలబస్‌ను రూపొందించే రోడ్ మ్యాప్‌కు ఈ డ్రాఫ్ట్ పునాది వేసింది. ప్రాచీన భారతీయ భావనలకు ఇచ్చిన ప్రాధాన్యత మధ్యయుగ, ఆధునిక యుగాల చరిత్ర, సాహిత్యానికి లేదు. వర్ణ వ్యవస్థను పెంచి పోషించిన వేద కాల వైభవానికి అగ్రపీఠం వేసారు. రాజ్యాంగ విలువలను, ఆదర్శాలను పక్కన పెట్టి వైద్యశాస్త్రం, జోతిష్యాల మధ్య ఉండే సంభావ్యత గురించి చర్చలు చేస్తున్నారు. పురాణాలలో చెప్పిన అభూత కల్పనలకు శాస్త్ర ప్రతిపత్తిని ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు.

దేశంలో వ్యవసాయ, చేతివృత్తుల మీద ఆధారపడి జీవించే వారి శాతం ఇంకా గణనీయ సంఖ్యలోనే ఉంది. కానీ వీటికి సంబంధించిన సిలబస్‌ను రూపొందించే కృషిని మన విద్యా విధానంలో మొదటి నుంచి చేయటం లేదు. శాస్త్రీయ దృక్పథం విద్యలో ఉండాలనే పేరు మీద జ్యోతిష్య శాస్త్రాన్ని ముందుకు తెచ్చే ప్రమాదం ఉంది. ఉపాధ్యాయ శిక్షణ విద్యను నాలుగేళ్ల కోర్సుగా/ఇంటిగ్రేటెడ్ కోర్సుగా మార్చడంతోనే సరిపోదు. దానికి కావల్సిన శాస్త్రీయ సిలబస్ రూపొందించడం, బోధించడం జరగాలి. తరగతి గది నిర్మాణం పటిష్టంగా జరగాలంటే మౌలిక వసతుల కల్పన, నిబద్ధత కలిగిన బోధన, విద్యార్థులకు అనుకూలమైన కుటుంబ వాతావరణం ఉండాలి. వీటి సాధన ఈ విద్యా డ్రాఫ్ట్‌లో లేదు. ప్రజానుకూల నిర్మాణం, నిర్వహణ, కర్రిక్యులం రూపొందించకుండా మన విద్యలోకి ప్రజాస్వామిక భావనలు రావు. విద్య ప్రజాస్వామీకరించ బడాలంటే మొదట సమాజం ప్రజాస్వామిక లక్షణాన్ని పొందాలి. దానికోసం బుద్ధిజీవులు నిరంతర సంభాషణను మొదలుపెట్టాలి.

**12 ఆగస్ట్, 2019**
**ఆర్-9, ఓయు**

# నల్లమల మెడకు 'ఉరే'నియం

శివరాత్రి సుధాకర్

నల్లమల అడవి గుండెలపై అణు కుంపటి రగులుతోంది. అడవి బిడ్డల మెడకు బిగిసేందుకు యురేనియం ఉరి పొంచి ఉన్నది. అడవినీ, అటవీ సంపదనీ కొల్లగొట్టేందుకు సామ్రాజ్యవాద మల్టీనేషనల్ రాబందులు వాలుతున్నాయి. డిబీర్స్ వజ్రాల వేటగాళ్లు, యురేనియం తలారీ దళారీగాళ్లు, రాజకీయ రాబందులు కలిసి నల్లమలను వల్లకాడుగా మార్చేందుకు సిద్ధమైండ్రు. అక్కడి వన సంపదనూ, భూగర్భంలోని అపారమైన ఖనిజ నిక్షేపాలను తవ్వుకొని నల్లమలను బొందలగడ్డగా మార్చి ఏమార్చే పనిలో పాలక వర్గాలు పావులు కదుపుతున్నాయ్. దీంతో తరతరాలుగా అడవినే నమ్ముకుని బతుకుతున్న చెంచుల జీవితాల్లో చీకట్లు అలముకుంటున్నయి. అడవిని వదిలి అర క్షణమైనా బతకలేని మూలవాసీలు వాళ్లు. ఈ యురేనియం తవ్వకాలు జరిగితే నల్లమల జనమంతా ఊపిరాడక ప్రాణాలొదులుతరు. అడవి, చెట్లు, పుట్టలు, వాగులు, వంకలు, సెలయేళ్లు, సమస్త జీవరాసులు చరిత్ర పుటలల్ల కలిసిపోతయి.

ఎక్కడ ప్రకృతి పచ్చగ కన్పిస్తే అక్కడ మల్టీ నేషనల్ రాబందుల కన్ను పడ్తది. వాటి కన్నుపడినంత మేరా అగ్గి అంటుకున్నట్టే ఇక. ఇప్పుడు ఆ కన్ను నల్లమల అడవులపై పడింది. అందినంత మేరా దోచుకుని, అగ్గిపెట్టేందుకు సిద్ధమైంది. ఇప్పుడు ఆ మట్టికాళ్ల మహారాక్షసి కళ్లు అమ్రాబాద్ ప్రాంతంపై పడ్డయ్. అమ్రాబాద్ ప్రాంతం ఇప్పుడు ఆగమవుతున్నది. చెంచుల గుండెల నిండా దిగులే. వాళ్లు మరణపు అంచున నిలబడి ఆర్తనాదాలు చేస్తున్నరు. వాళ్ల గుండె గోసనెవరూ పట్టించుకుంటలేరు.

తవ్వకాలకు ప్రభుత్వం అన్ని అనుమతులూ ఇచ్చింది. ఇప్పుడు పచ్చని అడవుల్లోకి భారీ యంత్రాలు రాబోతున్నయి. బుల్డోజర్‌లు, స్టోన్ క్రషర్‌లతో పర్యావరణం ప్రాణం తీసేందుకు ప్లానేసిండ్రు. ఎక్స్‌ప్లోజివ్ బాంబుల మోతల్ల నల్లమల దద్ధరిల్లనున్నది. తవ్వకాలు మొదలైతే అక్కడ పక్షుల కిలకిలా రావాలుండవు. పాలపిట్టల పాటలుండవు. నెమళ్ల నాట్యముండదు. లేళ్లు, జింకలు, దుప్పులు, పులులు కనుమరుగయితయి. అడవి మల్లెల పరిమళాలుండవు. మోదుగు పూల మెరుపులుండవు. పచ్చని అడివంతా అగ్గిపాలయితది. పరవళ్లు తొక్కే కృష్ణమ్మ కాలుష్య కోరల్ల చిక్కి విలవిల్లాడుతది. విల్లంబులతో వేటాడే చెంచులు ఆనవాళ్లు లేకుండా పోతరు.

దేశాన్ని నిలువునా తాకట్టుపెట్టే రాజ్యం బహుళజాతి సంస్థల లాభాల కోసం దళారీగ మారింది. రాజ్యానికి ప్రజలతో, ప్రజల సంస్కృతి, చరిత్రలతో ఏమాత్రం పనిలేదు. దానికి



కావాల్సింది పెట్టుబడి. లాభాలు. తరతరాలుగా నల్లమలతో సహజీవనం చేస్తున్న చెంచుల బతుకుల్లో చీకట్లు నింపుతున్నది. నల్లమల అడవుల్లోంచి చెంచులను తరిమేందుకు టైగర్‌జోన్ పేరుజెప్పింద్రు. పులుల రక్షణ కోసం గొంతులేని అమాయక చెంచులను వాళ్ల భూముల నుంచి బేదఖల్ చేసింద్రు. టైగర్‌జోన్ కథ ఒడిశిందిప్పుడు.

ఆదివాసీల భూములపై ఇతరులెవరికీ హక్కు లేదన్న చట్టాలను రాజ్యం గంగల కలిపింది. ప్రజల హక్కుల్ని, ప్రాణాల్ని కాపాడాల్సిన న్యాయస్థానాలు ఇప్పుడు జనం ప్రాణాలతో చెలగాటమాడుతున్నయి. ఆదివాసీల కాళ్లకిందున్న ఖనిజ సంపదను దళారీలకు దోచిపెట్టేందుకు కుట్రలకు తెరలేపింది రాజ్యం. ఆదివాసీలంతా అడవుల్ని ఖాళీ చేయాల్సిందేనని సుప్రీం కోర్టు తీర్పిచ్చింది. అడవుల్ని దశలవారీగా ఆక్రమించేందుకు ఏసిన ఎత్తుగడ ఇది. రాజ్యం అభివృద్ధి పేరుతో అడవిని ఆక్రమించేందుకు రక్షణ సంబంధ కల్లబొల్లి మాటలు చెప్తున్నది. ఈ తవ్వకాలు మొదలైతే అంచెలంచెలుగా అడవుల్లోకి సైన్యాన్ని దించుతది. సైన్యం పహారాలో మల్టీ నేషనల్ కంపెనీలు నల్లమలను కబళిస్తయి. అక్కడ పెను విధ్వంసాన్ని సృష్టిస్తయి. వందల ఏండ్ల దాకా అక్కడ గడ్డిపోచ కూడా మొలవని దుస్థితి దాపురిస్తుంది.

నల్లమలలో సుమారు 83 చదరపు కిలోమీటర్ల అడవిని విధ్వంసం చేసేందుకు అధికారులు సిద్ధమైంద్రు. నాలుగు వేలకు పైగా బోర్లు వేసి యురేనియం ఖనిజాన్ని తవ్వేందుకు కేంద్ర అణు శక్తి సంస్థ అడుగులు వేస్తున్నది. వాస్తవానికి 1995 నుంచే నల్లమలలో యురేనియం కోసం అన్వేషణ మొదలైంది. యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యూసీఐఎల్) నల్లగొండ జిల్లా దేవరకొండ పరిధిలోని కృష్ణా పరీవాహక ప్రాంతమైన పెద్దగట్టు వద్ద అటవీ ప్రాంతంలో అన్వేషణ సాగించింది. ఈ ప్రాంతంలో 18వేల టన్నుల యురేనియం ఖనిజం ఉన్నట్లు గుర్తించింది. దేవరకొండ రిజర్వు ఫారెస్ట్ పరిధిలోని దేవరకొండ, చందంపేట, పెద్ద అడిశర్లపల్లి, నేరేడుగొమ్మ ప్రాంతాల్లో యూసీఐఎల్ అధికారులు నిక్షేపాలను గుర్తించింద్రు. 2000-2003 వరకు పలుచోట్ల తవ్వకాలు జరిపి యురేనియం నిక్షేపాలు ఉన్నట్లు కేంద్రానికి సమాచారం పంపింద్రు.

నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం శేరిపల్లి, ముదిగొండ పరిధిలో 200ఎకరాలు, చందంపేట మండలం చిత్రియాల, పెద్దమునిగల్ గుట్టల్లో 2500ఎకరాలు, పెద్ద అడిశర్లపల్లి మండలం నంబాపురం, పెద్దగట్టు పరిసర గ్రామాల్లో 210 ఎకరాల్లో యురేనియం నిక్షేపాలు ఉన్నట్లు అప్పట్లో కనుగొన్నరు. యురేనియం కోసం తవ్వకాలు చేపడితే పర్యావరణం దెబ్బతినడమే కాకుండా కృష్ణా జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరించింద్రు. దీంతో స్థానికులు ఆ తవ్వకాలను అడ్డుకున్నరు. 2003 ఆగస్టులో అప్పటి నల్లగొండ జిల్లా కలెక్టర్ ఆర్‌పీ సిసోడియా ప్రజాభిప్రాయ సేకరణ జరిపిండు. ఈ ప్రయత్నాలను ప్రజలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు ముక్త కంఠంతో వ్యతిరేకించింద్రు. 2005లో శేరిపల్లి వద్ద యురేనియం శుద్ధి కర్మాగారం ఏర్పాటుకు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింద్రు. ఇట్లాంటి ప్రజావ్యతిరేక చర్యల్ని మావోయిస్టు పార్టీ వ్యతిరేకించింది. అధికారులను హెచ్చరించింది. దీంతో వెనక్కి తగ్గింద్రు.

ఆ కాలంలోనే రాజ్యం నల్లమలలో నెత్తురు పారించింది. మావోయిస్టులే టార్గెట్‌గా నల్లమలను జల్లెడ పట్టింది. రాజ్య రక్తదాహానికి ఎందరో విప్లవకారులు అమరులైంద్రు. నల్లమలలో విప్లవోద్యమం వెనక్కి తగ్గింది. దీంతో రాజ్యానికీ, సామ్రాజ్యవాద మల్టీనేషనల్ కంపెనీలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. అమ్రాబాద్ ప్రాంతంలో అగ్గిపెట్టేందుకు రంగం సిద్ధమయింది. ఈ తవ్వకాలతో అమ్రాబాద్ మండలంలోని బీకే ఉప్పునూతల, మారేడు, ఉడిమిళ్ల గ్రామాలకు అత్యధికంగా యురేనియం ప్రభావం పడనుంది.

'నల్లమల పరిరక్షణ కమిటీ' ఆధ్వర్యంలో (22 జులై 2019న) కవులు, రచయితలు, పరిశోధకులు, సామాజికవేత్తలు, ప్రజా సంఘాలు అమ్రాబాద్ ప్రాంతంలో యురేనియం తవ్వకాలపై నిజనిర్ధారణ కోసం వెళ్లినం. అక్కడ ఎవరిని కదిలించినా కన్నీళ్లే. వాళ్ల కళ్లల్లో విషాదఛాయలు. పసిపిల్లల కళ్లల్లోనూ వెలుగు లేదు. విలపిస్తున్న వృద్ధులు, మహిళలు, యువకులు ఊపిరిపోయినా ఈ జాగనిడిసేది లేదంటున్నరు. నల్లమలను కాపాడుకుంటమనే ఆశే ఆ కళ్లనిండా.

"మా ఓట్లతోటి గెల్సినోడు మమ్ములేన్నే అడివిల్నించి ఎల్లిపొమ్మంటాండు. గిదేం న్యాయం? ఈ అడివి వానయ్య జాగీరా? మమ్ముల ఎల్లగొడ్తాన్కి వానికేం అక్కున్నది? ఈ అడివి మాది. ఈ చెట్లు మాయి. మా తాత ముత్తాల సంది ఇక్కన్నే ఉంటన్నం. ఈన్నే సస్తం. ఈ అడవిల్నే మా బత్కున్నది. ఈ అడివే మాకు కన్నతల్లి. మా తల్లినొదిలిపెట్టి మేమేడికి పోవాలె? ఎట్ల బత్కాలె? అడివి లేకుంటే మేం బత్కుతమా? వాడిచ్చే లచ్చలొద్దు. వాని ఉజ్జోగాలొద్దు. సర్కారోల్లొచ్చి బలంతంగ

ఎల్లగొట్టినా ఈన్నించి కదులం. ఈన్నించి ఏడికి తోల్కపోయినా ఒక్కరోజు సుత ఉండలేం. టెంక పోలీసోల్లొచ్చినా ఈన్నించి కదిలేది లేదు. రడం జేసుడు మాకేం కొత్తగాదు. ఈడ అన్నలున్నప్పుడు సర్కారోల్లకు శెవటలు బట్టినయ్. ఒనికిర్రు. ఆల్లున్నప్పుడు ఈ జాగల ఎవడు అడుగుబెడ్తానికి దైర్నం జెయ్యలేదు. ఇప్పుడు అన్నల్లేరనే గదా! ఈ సర్కారు గాడ్డి కొడ్కులు మా మీన జులుం జేస్తాన్రు. వాడెన్ని ఇకమతుల్జేసినా ఇగ కొట్లాడుడే. వాడో మీమో అంతు దేల్సుకుంటం. రోకలి బండలు, కారంపొడి గుప్పుకుంట కొడుకుల్ని తరిమి తరిమి కొడ్తం. మా బత్కుల నిప్పులు బోసేటోన్ని మీమెందుకొదుల్తం?" అంటూ 88 ఏండ్ల ముసలి తల్లి ధర్మాగ్రహం ప్రకటించింది.

పత్తిచేన్లో కలుపు తీస్తున్న చెంచు మహిళల్ని కదిలిస్తే... "ఈన్నించి అంద్రం ఎల్లిపోవాల్నట. మీమెందుకు పోతం? మా అడివికి ఎవడొత్తడో సూత్తం. అచ్చంపేట మూల తిరిగొస్తె వాని సంగతి జెప్తం. ఈ రాజ్యానికి మా మీన అక్కులేదు. ఇక్కడికెవడొచ్చినా కొడ్వల్తోటి తల్కాయ తెగనర్కుతం" అంటూ కొడవలెత్తి చూపింద్రు.

యూసీఐఎల్ అధికారులు ఒక్క తిర్మలాపూర్‌లోనే 600లకు పైగా బోరు పాయింట్లు పెట్టింద్రు. గుట్టుచప్పుడు కాకుండా అర్ధరాత్రుల్లో వచ్చి దొంగచాటుగా 36 గంటల్లో 25 బోర్లేసింద్రు. ఇది తెలుసుకున్న పరిసర ప్రాంత ప్రజలంతా మూకుమ్మడిగా వచ్చి అడ్డుకున్నరు. బోరులోంచి వెలువడిన యురేనియం శాంపిల్స్ తీసుకెల్లింద్రు. దీంతో అక్కడి ప్రజల్లో భయం గూడుకట్టుకున్నది. ఎప్పుడేం జరుగుతదో తెల్వక బిక్కుబిక్కుమంటున్నరు.

తరతరాలుగా అడవులతో పెనవేసుకున్న చెంచులు అంతర్ధానం కానున్నరు. 'ఈ భూమిపై నల్లమలలో ఒకప్పుడు చెంచుజాతి మనుగడ సాగించింది' అని చరిత్ర పాఠాలు చదువుకోవాల్సిన దుస్థితి వచ్చింది. అమ్మలా బువ్వపెట్టిన అడవి, నీడనిచ్చిన చెట్లు కండ్లెదుటనే విధ్వంసమైతున్నయని తెలిసి విలవిల్లాడుతున్నరు. 'ఏం చదువుతున్నవు బాబూ...?' అని ఒక స్కూల్ పిల్లవాణ్ని అడిగితే... వాడి కండ్లనిండా నీళ్లు. తాను అక్షరాలు దిద్దిన ఈ బడి, ఆడుకున్న చెట్లు చేమలూ, అడవి దారుల్ల కలెదిరిగిన గురుతులు మాయమైతయని తెలిసి వాని గొంతు దు:ఖంతో నిండిపోయింది. అడవిని ఖాళీ చేయాలంటున్నరని ఓ 90ఏండ్ల ముసలి తల్లి నెలరోజులుగా తిండి మానేసింది. తమకు బతుకునిచ్చిన అడవి తల్లినుంచి విడదీస్తరని తల్లడిల్లుతున్నది. అక్కడ ఏ మనిషిని కదిలించినా కన్నీళ్లే. అడవితో పెనవేసుకున్న పురాజీవ స్మృతులేవో వాళ్లను కలవరపెడుతున్నయి.

అక్కడ పీపుల్స్‌వార్ తిరిగిన గురుతులున్నయి. వాళ్లందించిన చైతన్యం ఉన్నది. కొండ కోనల్లో ఎగిరిన ఎర్రజెండా రెపరెపలున్నయి. నల్లమల కొండల్లో ప్రతిధ్వనించిన వసంత మేఘగర్జనలున్నయి. వీరులు చూపిన తొవ్వ వెలుగై పరుచుకుంటున్నది. ఆ వెలుగు దారే వాళ్లకిప్పుడు దిక్సూచి. వాళ్లకిప్పుడు పోరుతప్ప మరో దారిలేదు. యురేనియం ప్రాజెక్టును వ్యతిరేకిద్దాం. జీవ వైవిధ్యాన్ని, జీవించే హక్కును కాపాడుకుందాం. నల్లమలను కాపాడటానికి ఆదివాసీలు చేసే పోరాటానికి అండగా నిలుద్దాం.

★ రచయిత: పరిశోధక విద్యార్థి T

**<u>రచయితలకు సూచనలు:</u>**

**1. రచనలను పేజీకి ఒకవైపు మాత్రమే అర్థమయ్యేలా రాసి పత్రిక అడ్రస్‌కు ప్రతినెల 15వ తేదీలోగా పంపగలరు.**

**2. డీటీపీ చేయించి పంపేవారు ప్రతినెల 18వ తేదీలోగా ఓపెన్‌ఫైల్‌లో పంపించగలరు.**

**3. చేతి రాతలో పంపే రచనలను స్కాన్ చేసి మెయిల్ ద్వారా కాకుండా పోస్ట్ ద్వారా పంపించగలరు.**

**4. స్మార్ట్‌ఫోన్లలో ఫొటోలు తీసి వాట్సప్ ద్వారా రచనలను పంపించవద్దు.**

**5. ఇతర పత్రికలకు పంపే రచనలను మాకు పంపవద్దు.**

**6. అర్థం కాకుండా, కొట్టివేతలతో ఉండే వ్యాసాలను పత్రిక అంగీకరించదు.**

**7. పరిశోధక రచయితలు పంపే రచనలు కచ్చితంగా తమ ఆమోదపత్రం జతచేసి పంపించగలరు. గతంలో ముద్రించిన వ్యాసాల్లోని పేరాలు ఎత్తి రాసి పంపవద్దు.**

**-సం.**

# నల్లమల పరిరక్షణ-మన బాధ్యత

అరవింద్

"నన్ను కాపాడేసరికి నా జుట్టు పూర్తిగా కాలిపోయింది. నా మొహం గాలి బుంగలా ఉబ్బింది. నా చొక్కా ఎందుకు కాలి భుజాల దగ్గర వేలాడుతున్నదా అనుకున్నాను. కానీ తీరా చూస్తే అది నా చర్మం. అదొక నరకం."

(-మిచికో యమాఒకా-హైస్కూల్ విద్యార్థి)

హిరోషిమా పట్టణంపై అమెరికా అణుబాంబుతో దాడి చేసింది. రెండు లక్షలపై చిలుకు ప్రజలు ప్రాణాలు కోల్పోగా, వేలాది మంది గాయపడ్డవారిలో ఒక బాలుడి మాటలే పైన పేర్కొనబడినవి.

హింసకు బాగా అలవాటైపోయిన మన మెదళ్ళకు మరో బాలిక ఆర్ద్రతను మీ ముందుంచుతాను. హిరోషిమా తరువాత నాగసాకి మీద అణుబాంబు పేల్చారు. మొత్తం 2.70లక్షల జనాభాలో 1.40లక్షల మంది చంపబడ్డారు. ఆ ఘటనలో చనిపోకుండా గాయపడిన ఓ బాలిక స్వరంలో విందాం.

"నా వాళ్ల శవాలు ఎట్లా కనుక్కోవాలి? క్లాస్ రూములోకి చూసినప్పుడు ఒక్కొక్కరిని చూడగలిగే దానిని. కానీ ఇక్కడ ఉన్నది మొత్తం శవాల గుట్టలు. నా వాళ్లను కనుక్కోవాలంటే ఒక్కొక్క శవాన్ని పక్క తీయాలి. ఆ గుట్టలలో అన్ని రకాల శవాలు ఉన్నాయి. మనుషులవే కాదు. పక్షులవి, పిల్లులవి, కుక్కలవి, ఒక ఆవు శవం కూడా ఉంది. చాలా భయంకరంగా ఉంది. వర్ణించడానికి మాటలు దొరకడం లేదు. మనుషుల లాగే అవి కూడా కాలిపోయి ఉన్నాయి మరికొన్ని ఉబ్బిపోయి ఉన్నాయి.

ఒక నెల రోజుల తర్వాత మా పెద్దన్న కుటుంబ సభ్యులందరినీ పిలిచాడు. ఒక బట్టలో చుట్టినదేదో టేబుల్ మీద పెట్టాడు. 'తొషికో అమ్మను ప్రతిరోజూ వెతుకుతున్నావు కదా కదా.! ఆ మూట తెరచి చూడు.!' అన్నాడు. అమ్మ ఎముకలు ఉంటాయనుకున్నాను. అతను చెప్పినట్లు మూట విప్పాను. కాని కాలిన పుర్రె మాత్రమే ఉంది. కళ్ళు లేవు. పండ్లు లేవు. కొన్ని వెంట్రుకలు. కొంత చర్మం వుంది. ఆమె అద్దాలున్నవి. ఇప్పుడవి జపాన్లోని పీస్ మెమోరియల్ మ్యూజియంలో ప్రజలకు ఏదో సందేశం ఇస్తున్నట్టుగా ఉన్నాయి" అని తన కుటుంబంలో 13 మందిని కోల్పోయిన తొషికోసేకి ప్రపంచం ముందు ఉంచిన మాటలివి. మిచికో, తొషికోసేకి బాలల మాటల్లోని అనూభవాలు శాంతిని కోరుకున్న ప్రతి హృదయాన్ని మెలిపెట్టి భాధిస్తాయి. మనిషితనమున్న ప్రతి ఆలోచనాపరుడిని కదిలిస్తాయి. పాలకులకు మాత్రం అదొక ఆట. చదరంగం. ప్రజలకు మాత్రం కన్నీటి వరద, రణరంగం. అణుబాంబులకు ముడి పదార్థం యురేనియం. అలాంటి యూరేనియం కోసం నల్లమలలో కారు చిచ్చు. విధ్వంసం.

"తేనెటీగలు భూమిపై అదృశ్యమైతే, ఆ తరువాత మనిషి జీవించడానికి నాలుగు సంవత్సరాలు మాత్రమే మిగిలి ఉంటుంది." -మారిస్ మాటర్లింక్.

పై మాటలు చాల ఆశ్చర్యంగా ఉండవచ్చు. నిష్టూరంగా అనిపించవచ్చు. కానీ, ఇది నిజం. శాస్త్రీయం. రేపు జరగబోయే ప్రమాదానికి ముందస్తు ప్రకటన. హెచ్చరిక.

ఈ భువిపై అత్యంత అందమైన, దట్టమైన అడవుల్లో నల్లమల ఒకటి. ఇక్కడ ప్రత్యేకమైన కీటకాలలో తేనెటీగలు. ఆ తర్వాత సీతాకోకచిలుకలు. అత్యంత వైవిధ్యమైన కీటక జాతులకు నివాసాలయం నల్లమల. కానీ, ఇవాళ కంటికి కనిపించని స్థితిలో కీటకాలు ఉన్నాయంటే.. మారిస్ మాటలలోనైతే మానవ మనుగడ ఏ ప్రమాద స్థాయికీ చేరుకుందో ఊహించే ప్రయత్నం చేయండి.

మన హైదరాబాద్‌కు వంద కిలోమీటర్ల చేరవలోనున్నది నల్లమల అరణ్యం. నేడు ఆ అడవి అత్యంత ప్రమాదానికి గురవుతున్నది. కారణం? యురేనియం తవ్వకాలు. అందుకు ప్రభుత్వాలు అన్ని సిద్ధం చేసుకుంటున్నాయి. రహస్యంగా, దొంగచాటుగా కొన్నిగ్రామాలలో బోర్లు వేసి శాంపిల్స్ తీసుకుని పరారయ్యారు. ఏ పొలాల్లో బోర్లు వేసారో ఆ పొలాల రైతుల అనుమతి లేదు. రైతులదే కాదు. గ్రామ పంచాయతీ తాలుకు అనుమతి లేదు. ఆఖరికి ఎమ్మార్వో అనుమతి కూడా లేదు. ఇలా సుమారు 400 పై చిలుకు బోర్లు వేసినట్లు సమాచారం. ఈ సంఖ్య వేలల్లో చేర్చాలనే పథకంతో అడవిలోకి అడుగుపెట్టారు. పదర మండలానికి చెందిన తిర్మలాపూర్ లాంటి

గ్రామ ప్రజలు అడ్డుకోవడం మూలంగా తోక ముడుచుకొని వెళ్ళారు. అంటే తాత్కాలికంగా వెనక్కు వెళ్ళారు. కానీ, మన తల్లి లాంటి అడవి కోసం వాళ్ళు మళ్ళీ వస్తారు. కోట్ల రూపాయుల డబ్బుతోనో, లిక్కర్ లారీలతోనైనా వస్తారు. వందల వేల సైన్యంతోనైనా వస్తారు. తుపాకులతో, బాంబులతోనైనా వాళ్ళు వస్తారు. కానీ, మన అడవి కోసం, కాళ్ళ కింద నేల కోసం, పర్యావరణం కోసం మనం ఏం చేయాలి.? ఏం చేయగలం?

"పర్యావరణాన్ని కాపాడటానికి మన స్వంత ప్రభుత్వంతో పోరాడాల్సి రావటం భయానకమైనది." –అన్సెల్ ఆడమ్స్

ఈ దేశంలో రాజ్యాంగం హామిపడ్డ మౌలిక వసతులను కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి. అందుకోసమే చాల కృషి చేశాయి. ఐనా, నేడు తమకు తాముగా జీవిస్తున్న ప్రజలపై యుద్ధం. ఆదివాసీలు స్వచ్ఛమైన పీల్చుకునే గాలిపై, తాగే నీటిపై, నివసించే అడివిపై దాడి. అందుకు ముద్దుగా "నల్లమలలో యురేనియం తవ్వకాలు" అంటుంది. ఈ విధ్వంసంపై కడుపు మండి ఏ గొంతైనా పకులితే "అభివృద్ధి" అంటు నోరు నొక్కేస్తుంది. తప్పదు. కాళ్ళ కింద నేల కోసం, స్వచ్ఛమైన గాలి కోసం, నీటి కోసం ప్రభుత్వాలపై పోరాటం తప్పదు.

నల్లమల అతి ప్రాచీనమైన ఆదిమవాసులకు నిలయం. ఈ అరణ్యం చెంచు తెగ ప్రజలకు గూడులాంటిది. ఈ భువిపై అత్యంత నిస్వార్థమైన ప్రజలు వారు. అడవిని ఆరాధిస్తు, అడవిని కాపాడుతూ మనందరికీ చల్లదనం, బుతుపవనాలను అందిస్తున్న వాళ్ళు. ప్రపంచంలో అడవులు నేటికీ ఉన్నాయంటే వాళ్ళ కష్టఫలితమే. ఆదివాసీలు లేని చోట ఏ అడవి మనుగడ సాధించినది లేదనేది చారిత్రక సత్యం. నమ్మలేకుంటే గూగుల్ సెర్చ్ చేయండి.

ఈ విధ్వంస అభివృద్ధి నమూనాలో మార్కెట్లో అమ్మకం కాని చెంచుల పట్ల ఎవరికీ ఆసక్తి ఉండదు. వాళ్ళ అంతమే ప్రభుత్వ పంతంగా వుంటుంది. ఇప్పటి వరకు వాళ్ళకు పలకాబలపం అందివ్వనివాళ్ళు, బుక్కెడు మంచినీళ్ళివ్వని వాళ్ళు, కూడు, గూడు, గుడ్డ అందించనివాళ్ళు, ఇప్పటివరకు మూడు రంగుల జాతీయ జండా చూపించనివాళ్ళు, సరిగ్గా తామున్న దేశం పేరు చెప్పనివాళ్ళు.. తమ లాభాల కోసం, పిడికెడు పెట్టుబడిదారుల కోసం "అడవిని తవ్వుతున్నాం. మీరు ఖాళీ చేయండి" అని అనడానికి ప్రభుత్వాలు సిగ్గు పడవు. లజ్జపడవు. అవి పాలకులకు వున్నాయనుకుంటే అంతకంటే ఎక్కువగా మనకేమి లేవనేది అసలు నిజం.

ప్రపంచంలో అణుబాంబుల వినియోగాన్నే కాదు, అణు విద్యుత్‌ను కూడా అభివృద్ధి చెందిన దేశాలు కట్టడి చేశాయి. అందుకు కారణాలు అణుబాంబులతో, అణు విద్యుత్‌తో జరిగిన ప్రమాదాల పరంపర. చాల దేశాలు అణు విద్యుత్ రహిత దేశాలుగా ఫ్రాన్స్, డెన్మార్క్, జపాన్ లు ప్రయత్నం చేస్తూ విజయం సాధిస్తున్నాయి. అణువిద్యుత్ కేంద్రాలకు భద్రత ఇవ్వడంలో అభివృద్ధి చెందిన రష్య, జపాన్ లాంటి దేశాలే విఫలమయ్యాయి. ఆక్సిజన్ అందించలేక పసిపిల్లలను చంపుకుంటున్న ఇండియా అణు రియాక్టర్స్‌కి భద్రత ఇవ్వగలమవా.?

ప్రమాదాలు జరిగిన చెర్నోబిల్, పుకుషిమా అణువిద్యుత్ కేంద్రాలలో లక్షలాది మంది నిర్వాసితం చేయబడ్డారు. వేలల్లో చచ్చిపోయారు. 1986లో జరిగిన చెర్నోబిల్ ఘటనలో ఇప్పటి నుండి 2056 నాటికి 90,000 మంది క్యాన్సర్ మూలంగా చనిపోతారని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. అణు ప్రమాదం నిన్నటికి పరిమితం కాదు. పోని, ఇవ్వాల్టికి కాదు. మరో యాభై ఏళ్ళ వరకు పచ్చిగాయంగా పర్యావరణంపై చేస్తున్న యుద్ధం. ఈ విధ్వంసపు అణు పదార్థాలకు మూలం యురేనియం. ఇదొక విష పదార్థం. లక్షల సంవత్సరాల కింద భూమిపై ఏర్పడ స్పటికం. ఈ లక్షల సంవత్సరాలలో ఆ పదార్థంపై సారవంతమైన మట్టిపొరలు ఎన్నో ఏర్పడ్డాయి. కనుకనే ఇవ్వాల్టి పచ్చదనం, అరణ్యాలు, జీవరాశి, మానవ మనుగడ. ఎన్నెన్నో అబ్బురపరిచే పక్షులు, కీటకాలు, జంతువులు, జలచరాలు. లక్షల సంవత్సరాల క్రితం పూడిపోయిన యురేనియమనే విష పదార్థం తీయడం అవసరమా.?

భారతదేశంలో అడవి వైశాల్యం తగ్గిపోవడం, తెలంగాణలోనూ అడవుల సంఖ్య తగ్గిపోతున్నది. జాతీయ అటవీ విధానం ప్రకారం 33.3 శాతం అడవులు ఉండాల్సివుండగా 24.35 శాతం వుంది. ఈ తరుణంలో నల్లమల అడువులపై ఎందుకు యుద్ధం?

"నిర్వాసితం మరణం లాంటిది. మీదాక వచ్చే వరకు మీరు అర్థం చేసుకోలేరు"

–గోల్షిఫ్తే ఫరాహని

పై మాటలు అంత సులభంగా అర్థం కావు. అనుభవంలోకి వస్తే తప్ప. నిర్వాసితం అంటే మనలాగ ఇంటి అద్దె ఎక్కువైందని హైదరాబాద్‌లోని అమీర్‌పేట నుండి మెహదీపట్నంకు మారడం కాదు. నిర్వాసితం క్రూరమైంది. దారుణమైంది. నిర్వాసితం అవ్వడమంటే కొండల నుండి, పుట్ట నుండి, ఆవాసాల నుండి, సెలయేరు నుండి, పక్షుల నుండి,

పెంపుడు జంతువుల నుండి, తమ పూర్వీకుల స్మృతి చిహ్నాల నుండి, ఊరు నుండి, సమూహం నుండి, బంధాలనుండి.. ఒక్క మాటలో చెప్పాలంటే తమ నుండి తాము జీవితం నుండి తాము దూరమవ్వడం. నిర్వాసితం మరణం లాంటిది.

చెంచులు నదిలో వుండే చేపల్లాంటివారు. వీళ్ళను నదిలోంచి తోడి కబేళా లాంటి మన మైదాన ప్రాంతంలో వేస్తే ఎలా బతకగలరు.? వీళ్ళకు నల్లమల లాంటి అడవులు, పుట్టలు, గుట్టలు, నదులు, సెలయేర్లు తెచ్చివ్వగలమా.?

నల్లమల ఎదపై ఇప్పుడు గునపాలు దించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తహతహలాడుతున్నాయి. 83 చదరపు కిలోమీటర్లలో యురేనియం తవ్వకాలకు సిద్ధపడుతున్నారు. నాలుగు ప్లాటులుగా విభజించారు. ఈ తవ్వకాలతో అనేక ప్రమాదాలకు గురిచేస్తున్నారు. ఇక్కడ అనేక జీవజాతులున్నాయి. పక్షులున్నాయి. చెంచులను ఇలా సమస్తం ధ్వంసం చేయడానికి భారత రాజ్యాంగాన్ని, జాతీయ, అంతర్జాతీయ చట్టాలను తుంగలో తొక్కుతున్నారు. అడవి పరిరక్షణ కోసం, ఆదివాసీల హక్కుల కోసం ఏర్పడ్డ చట్టాల పేర్లు రాస్తూ పోతే పెద్ద బండిలవుతుంది. అంతర్జాతీయ స్థాయిలో జెనీవా చట్టం. పేస చట్టం, 1/70 చట్టం, వన్యప్రాణి సంరక్షణ చట్టం (1972), సహజ వనరుల హక్కు సంరక్షణ చట్టం(1972), కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (1974) అడవుల సంరక్షణ చట్టం (1980), అటవీ, పర్యావరణ శాఖ(1985) ఎకోమార్క్ (1991), పర్యావరణ ట్రిబ్యునల్ చట్టం (1995), జీవ వైవిధ్య చట్టం (2002), అటవీ హక్కుల చట్టం (2006) ఇలా ఎన్నో ఉన్నాయి. వీటిలో ఏ ఒక్క చట్టాన్ని గౌరవించినా యురేనియం తవ్వకాలు ఆగిపోతాయి. నల్లమల పచ్చదనంతో వర్ధిల్లుతుంది. జాతీయ జంతువు పులులు, జాతీయ పక్షి నెమలులు, రాష్ట్రీయ జంతువు జింకలను మాటల్లో కాక చేతలలో బతికించుకున్న వారమవుతాం.

## నల్లమలను ఎలా రక్షించుకోగలం?

నల్లమల యురేనియంపై గ్రీన్ సిగ్నల్ ఇస్తూ సెంట్రల్ ఎన్విరాన్‌మెంట్ మినిస్టరీ నుండి 19జూన్ నాడు ఢిల్లీలో సర్క్యులర్ వెల్లడైంది. అప్పటిదాకా చేసిన శాంపిల్ సర్వే, ఏరియల్ సర్వేల అసలు లోగుట్టు అర్థమైంది. నల్లమల పరిరక్షణ కోసం కవులు, రచయితలు, బుద్ధిజీవులుగా కదిలి గ్రామాలకు వెళ్ళాం. ప్రజలు పోరాటాలకు సిద్ధంగా వున్నారు. ఇక్కడ పోరాటాలు కొత్తకాదు. నాలుగు కాళ్ళ జంతువుల నుండి తమను తాము కాపాడుకున్న ప్రజలు రెండు కాళ్ళ క్రూరమృగాల వంటి పెట్టుబడిదారులతో యుద్ధానికి సై అంటున్నారు. వేటాడే పులులతోనే స్నేహం చేసినవాళ్ళు వేటగాడిని వేటాడడం పెద్ద రిస్క్ కూడా కాదు.

నల్లమలను కాపాడుకోవడం చెంచులకు, అక్కడి ప్రజలకు మాత్రమే ముఖ్యమైన అవసరమా? అంటే కాదు. అంతకంటే ఎక్కువ అవసరం నగరాల్లో, మైదానంలో ఉన్న మనకే వుంది. హైదరాబాద్‌లో 45డిగ్రీల ఎండ వుంటేనే అల్లాడి పోయి చమటలు కక్కినవాళ్ళం. వడగాడ్పులకు పిట్టల్లా రాలుతున్న జనాన్ని చూశాం. రేపు నల్లమల ధ్వంసమైపోతే ఉష్ణోగ్రత 50 డిగ్రీలకు చేరితే భరించగలమా!? మన ఏసీల సంఖ్య పెరిగి కరెంటు బిల్లులు కట్టలేక ఆత్మహత్యలు చేసుకునే దౌర్భాగ్య స్థితి ఏర్పడుతుంది. చీమల్లా మాడి మసైపోతాం. దక్షిణ తెలంగాణ, హైదరాబాద్ గొంతు కనీసం తడుస్తుందంటే తల్లి కృష్ణమ్మ పరవళ్లు తొక్కడమే. రేపు యురేనియం తవ్వితే కృష్ణ నది అత్యంత భయానకమైన రేడియో ధార్మికతకు, విషద్రవాలకు గురై మనల్ని బలితీసుకుంటుంది.

యురేనియం తవ్వకాలు చెంచు దేవతలనే కాదు. హిందువుల దేవుళ్ళను కూడా కబలిస్తుంది. మద్దిమడుగు, ఉమామహేశ్వరం, సలేశ్వరం, రాయలగండి కోట, శ్రీశైలం ఇలా ఎన్నో ఆలయాలు ప్రశ్నార్థకమైతాయి. నల్లమలను కాపాడు కోవడంలో మన అవసరం వుంది. స్వార్థం వుంది. భాధ్యత వుంది. మనకు, మన భవిష్యత్ తరాలకు కనీసమైన మంచి గాలి, నీరు అందుతాయి.

నల్లమలను కాపాడుకోవడానికి చెంచుల నాయకత్వంలో మనమంత ర్యాలీ అవ్వాలి. ఐక్యం అవ్వాలి. విశాల ప్రజా ఉద్యమం పురుడు పోసుకోవాలి. అందులో భాగంగా చట్టాలను ఉపయోగించుకుంటూ న్యాయ పోరాటం చేయాలి. పోరాటాన్ని నిస్వార్థంగా నడపగలిగేవాళ్ళు, క్రూరమైన రాజ్యాన్ని ఎదిరించి పోరాడగలిగే వాళ్ళు ఆదివాసీలు. రవి అస్తమించని ఖండమైన సౌతాఫ్రికా అడవులను పిప్పి చేసిన డీబీర్స్ నల్లమలపై పాగ వేసింది. వజ్రాల కోసం వెతుక్కుంటూ వచ్చిన డీబీర్స్ కంపెనీని నల్లమల ప్రజలు తరిమికొట్టారు. ఆ తరువాత టైగర్ జోన్ పేర చెంచుల తరలింపుకు వ్యతిరేకంగా పోరాడి తమ ఆవాసాలను తాము కాపాడుకున్నారు. ఇదే ప్రాంతంలో వైఎస్సార్ తన పాలనలో యురేనియం తవ్వకాలకు ప్రయత్నిస్తే ప్రజా ప్రతిఘటనతో తోక ముడుచుకొని వెళ్ళాడు. కనుక, అలాంటి ప్రజల నాయకత్వమే నల్లమలను కాపాడుతుంది. కవులు, రచయితలు, కళాకారులు అంతా నల్లమల ప్రజా పోరాటాలను ఎత్తిపట్టాల్సి వుంది. మరే ఎన్నికల రాజకీయ పక్షాలు కాపాడలేవు. తమ రచనలో, స్వరంలో ప్రజల ఆకాంక్షలను చాటి చెప్పాల్సి వుంది. యురేనియం తవ్వకాలతో వేలాది మంది క్యాన్సర్లతో చచ్చిపోతున్న జార్ఖండ్‌లోని జాదుగుడాల కాకుండా నల్లమలను కాపాడుకోవాలి. T

# యురేనియం-ప్రాణాంతక పర్యవసనాలు

● గీతాంజలి

ఇది 2015లో డిసెంబరు నెల చివరి వారం. నల్లమల అడవిలో అమ్రాబాద్ మండలం మన్ననూర్ టైగర్ రిజర్వ్ ప్రాంతం. వటవర్లపల్లి, సార్లపల్లి, కుడిచాతలబైలు చెంచు గ్రామాలలో ఆదివాసీలు, ముఖ్యంగా చెంచులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి కుట్రపూరితంగా సామ్రాజ్యవాద కంపెనీలైన డీబీర్ సంస్థకు అడవిలోని ఖనిజాలైన వజ్రాలు-సున్నపురాయి యురేనియంలను అప్పచెప్పటానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేస్తూ నిరసనలు, ధర్నాలు చేస్తున్నప్పుడు సేకరించిన వాస్తవాలు.

అలాగే ఆదిలాబాద్-ఉట్నూరు మండల కేంద్రాలలో, జన్నారం మండలంలో కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలోకి వచ్చే మైసంపేట, రాంపూర్ మల్యాల, అల్లీనగర్, దొంగపల్లి గ్రామాలలో ఆదివాసీలు సరిగ్గా సున్నపురాయి తవ్వకాల కోసం తమను ఊర్లు ఖాళీ చేయించే ప్రయత్నం చేస్తున్న సమయంలో వారిని కలిసాము. 2008 నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యురేనియం తవ్వకాల కోసం నల్లమల ప్రాంతాల్లో సర్వే చేస్తూనే ఉన్నాయి.

2019లో అభయారణ్యాలు, టైగర్ రిజర్వ్ ప్రాంతాలు, హరితహారాలు, పులుల పరిరక్షణ, ఆదివాసీల కోసం అభివృద్ధి పథకాలు అంటూ చేసుకున్న ముసుగులు తీసేసాయి పాలకవర్గాలు. నల్లమల ప్రాంతంలో యురేనియం ప్రాజెక్టు మొదలు పెట్టబోతున్నాయి. కేంద్ర అణుశక్తి శాఖ అనుమతులు తీసుకొని నల్లమల ప్రజలకు తప్పుడు సమాచారం ఇస్తూ మభ్యపెడుతూ గ్రామాల్లో వేల ఫీట్లలో బోర్లు తవ్వుతూ భూగర్భ లోతుల్లో యురేనియంతో నిండి ఉన్న మృత్తిక శాంపిల్స్‌ని పరీక్ష కోసం కేంద్ర అణుశాఖలకు పంపిస్తూ ప్రజల్ని భయభ్రాంతుల్ని చేస్తున్నది.

పులుల్ని రక్షించటానికి అభయారణ్యం టైగర్ రిజర్వ్ జోన్‌లను ప్రారంభించిన ప్రభుత్వం ప్రాణాంతకమైన యురేనియం తవ్వకాలతో పులులను, మనుషులనీ చంప బోతున్నదా.. నల్లమలను నాశనం చేయబోతుందా. 2019 జూలై. ఇప్పటి పరిస్థితి నల్లమలలో ఏంటో తెలుసుకదా.

23.2.2015న ఆదిలాబాద్ ఉట్నూరు మండల కేంద్రంలో ఆదివాసీల ర్యాలీ జరిగింది. వీరంతా జన్నారం మండలం కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలోకి వచ్చే మైసంపేట, రాంపూర్, మల్యాల, అల్లీనగర్, దొంగపల్లి గిరిజన గ్రామాలకు చెందిన ఆదివాసులు.

తమకు అటవీ జీవితం వద్దని పునరావాసమే కావాలని అనాదిగా అటవీ ప్రాంతంలో ఉంటూ పిల్లల చదువులకీ, వైద్యానికీ నోచుకోక ప్రాణాలు పోతున్నాయని, టైగర్ జోన్ ఏర్పాటు చేసినందువలన వన్యప్రాణుల సంఖ్య పెరగడంతో పంటలను వన్యప్రాణులు నాశనం చేస్తున్నాయని తెలుపుతూ ఈ ఆదివాసీలు డీఎఫ్‌వో రవీందర్‌కి వినతి పత్రం అందజేసారనే కుట్రపూరితమైన అవాస్తవాలతో కూడిన ఈ వార్త న్యూస్ పేపర్‌లో వచ్చింది.

నిజనిర్ధారణకు మేము విరసం, తెలంగాణ ప్రజాఫ్రంట్, తెలంగాణ నిర్వాసిత వ్యతిరేక వేదిక-చెంచు, ఆదివాసీ, కులనిర్మూలన పోరాట సమితి మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ జోన్‌లలోని ఆదివాసీ గ్రామాలను సందర్శించినపుడు చాలా కొత్త విషయాలు బయటపడ్డాయి. అతికొద్ది మంది గిరిజనేతర ఆదివాసులతో అడవిలో మేం ఉండం అని ధర్నా చేయించడం వెనకాల ప్రభుత్వం-ఫారెస్టు డిపార్ట్‌మెంటుకు చెందిన అధికారులున్నారు. అమాయక ఆదివాసీ ప్రజలను వీరు పనిగట్టుకొని మరీ బెదిరించి, అయోమయంలోకి నెట్టేసి, అభద్రతలో అటవీ ప్రాంతాన్ని వదిలే నిర్ణయం తీసుకునేలా చేసే ఎన్జీవో, స్వచ్ఛంద సంస్థలున్నాయి. ఈ మొత్తం యంత్రాంగాన్ని శాసించే అంతర్జాతీయ మైనింగ్ మాఫియా వుంది. కవ్వాల్ టైగర్ ప్రాజెక్టు జోన్‌లోకి వచ్చే ఈ ఐదు గ్రామాల్లోని అటవీ ప్రాంతంలో అపారమైన సున్నపురాయి, ఇతర ఖనిజ సంపద వుంది. ఈ సంపదని మల్టీ నేషనల్ కంపెనీలకు ధారాదత్తం చేయడం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక దళారీ పాత్ర పోషిస్తూ అడ్డంగా ఉండి తీవ్రంగా ప్రతిఘటిస్తున్న ఆదివాసీలను అభివృద్ధి నాటకంతో అడవి నుంచి వెళ్లగొట్టాలని చేసే ప్రయత్నమే ఇదంతా. నిజానికి అడవిలో ఐదు, ఆరుకు మించి పులులు లేవు. ఆదివాసీలు పులులతో, పులులకు-ఆదివాసీలతో ప్రమాదం లేనేలేదు.

వీళ్ల లెక్క ప్రకారం వాళ్ల తాతల కాలం నుంచి ఇప్పటిదాక పులి ఒక్క ఆదివాసీని చంపలేదు. కావాలనే వీళ్లు మమ్మల్ని పంపెయ్యాలని చూస్తున్నారు. మాకు ఇక్కడ్నే బాగుంది. ఇక్కడ్నే ఉంటాం. బయటకు పోము. బతుకుతెరువు లేదు అంటున్నారు ఆదివాసీలు. ఇక్కడ వీళ్లకు సంవత్సరానికి రెండు పంటలు పండుతాయి. జొన్నలు, పత్తి, కందులు, వరి, ఆముదాలు పండించడమే కాదు.. అడవిలోకెళ్లి కంకవనంలో వెదురు తెచ్చుకుని చీపుర్లు, వెదురుచాపలు, బుట్టలు, రోకళ్లు నిత్యం తయారు చేసుకొని అమ్ముకుంటూనే ఉంటారు. అటవీ ఉత్పత్తులైన తేనె, జిగురు, ఇప్పపూలు, విషముష్టి విత్తనాలు లాంటి అనేకమైన అటవీ ఉత్పత్తులు సేకరించి అమ్ముకొని జీవిక సాగిస్తున్నారు. వీటికి మైదాన ప్రాంతాల్లో మంచి గిరాకీ వుంది. వీటిని అమ్మే క్రమంలో దళారుల చేతిలో ఎంత మోసపోయినా ఎంతో కొంత సంపాదించుకొని బతుకుతున్నారు. అటవీ సంపద, కలప అక్రమ రవాణా వ్యాపారం, సున్నపురాయి తవ్వకాలు ఇదే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వ యంత్రాగానికి ఆదివాసీలు భారంగా మారారు.

ఇప్పటికే కవ్వాల్ ప్రాంతంలోని కుర్రెగూడెం ప్రజలను బలవంతంగా, కుట్రపూరితంగా చాలా అమానవీయైన పద్ధతిలో మైదాన ప్రాంతానికి తరలించారు. ఒర్రెగూడెంలో అపారమైన సున్నపురాయిని ఒక ఎమ్మెల్సీకి అప్పచెప్పేసారు. ప్రజల్ని గూడెం లేచిపోయిందని వ్యవసాయం బందు పెట్టించారు. ప్రజా ప్రతిఘటన ఎక్కువవడంతో అక్కడ వాగులో విషం కలిపారు. ఆదివాసీలు, అడవిలోని జంతువులు(పులులతో సహా) తాగే వాగులో కలిపిన విషానికి మొదట జంతువులు చనిపోయాయి. తర్వాత మనుషులు చనిపోయారు. తీవ్రమైన భయభ్రాంతులకు లోనైన ప్రజలను మరింత భయపెట్టి మరికపల్లి పునరావాస కేంద్రంలో పెట్టారు. అక్కడ తిండి, నీళ్లు, బతుకుతెరువు లేక ఆదివాసీలు అల్లల్లాడుతున్నారు. వారికి ఏ పునరావాస ప్యాకేజీ ప్రకటించలేదు. ఇది దాచిపెట్టి... అల్లీపూర్, డొంగపల్లి, సింగరాయిపల్లి ఆదివాసీలకు మహారాష్ట్రలోని అక్కడ అభివృద్ధి చేసిన(మోడల్) కొద్ది పునరావాస ప్రాంతాన్ని చూపించి మీకు కూడా ఇలానే ఇస్తాం. మీరు గూడాలు వదిలిపెట్టండి అంటున్నారు. దీంట్లో ఎన్జీవోల పాత్ర చాలా ఉంది. ప్రజాసంఘాలు వచ్చిన ప్రతీసారీ వెంటనే ఎన్జీవోలు ప్రవేశించి ప్రజలను అయోమయంలో పడేస్తున్నాయి. ఆదివాసీ గ్రామాల్లో ఒక ఇరవై బోర్లేసి అటవీ ప్రాంతాలకీ, మా గ్రామాలకూ మధ్య ఫెన్సింగ్ వేస్తే వ్యవసాయం చేస్కుంటూ, అటవీ ఉత్పత్తులు సేకరించి అమ్ముకుంటూ మా జాగాల మేముంటాం. పులులు వాటి జాగాల అవుంటాయ్. మీరు వీళ్ల ఊరికి కరెంటు, వైద్యానికి దవాఖాన, రోడ్లు ఇవ్వండి.. మేం ఇక్కడ్నే ఉంటాం అంటున్నారు. ప్రభుత్వం ప్రకటించే 10 లక్షల ప్యాకేజీని వాళ్లు తిరస్కరిస్తున్నారు. వాళ్లకు చూపించిన పునరావాసం మైదాన ప్రాంతంలో ఉంది.

“అక్కడ అన్నీ బండలున్నాయి. వ్యవసాయం నడువదు. మాకు ఇక్కడ ఎన్ని ఎకరాలుంటే అన్ని ఎకరాలు సాగు



భూమివ్వాలి. పక్కన ఇక్కడ ఉన్నట్లే సెలమ(వాగు) ఉండాలి. అడవి ఉండాలి. పశువులను కట్టేస్కోను జాగ ఉండాలి. పశు గ్రాసం ఉండాలి. అట్లనే రెండు పంటలు. అక్కడ పండినాకనే మేం పోతాం. అంతే కానీ ఏమీ ఇయ్యకుండా బండరాళ్ల ప్రాంతంలోకి మేము పోము" అంటున్నారు. వీళ్ల పంటలను జంతువులు నాశనం చేస్తున్నాయన్నది పచ్చి అబద్ధం. మేం వెళ్లిన ఏ గ్రామంలోనూ ఆదివాసీలు ఈ మాట చెప్పలేదు. ఈ అటవీ ప్రాంతాన్ని సున్నపురాయి తవ్వకాలకు ఎమ్మెన్సీలకు ఇవ్వాలన్న నిర్ణయం తీసుకున్న తర్వాత ప్రభుత్వం అన్ని అభివృద్ధి పథకాలను నిలిపేసింది. ఏమీరాకపోతే చచ్చినట్లు ప్యాకేజీ అందిపుచ్చుకొని వెళ్లిపోతారని కుట్రపన్నింది. అలాగే ఇక్కడ బేస్ క్యాంపుల్లో ఉద్యోగాల్లోంచి ఎస్సీ, ఎస్టీలను తొలగించి మైదాన ప్రాంత గిరిజనేతరులను నియమించి ఆదివాసీలకు, గిరిజనేతరులకు గొడవలు పెడుతోంది.

"ఐదు పులుల కోసం ఐటీడీఏ వందల కోట్లు ఖర్చు పెడుతోంది. కానీ రోజురోజుకీ అంతరించిపోతున్న మా ఆదివాసీలకు ఒక్క పైసా పెట్టడం లేదు. ఇక్కడ కనీస సౌకర్యాలు అందిస్తే మేమింకా ఇక్కడే బాగా అభివృద్ధి చెందుతాం. ఇక్కడ్నించి వెళ్లిపోతే ఆదివాసీలుగా అటవీ హక్కులు అన్నీ కోల్పోతాం. మా పిల్లలనూ, వాళ్ల ముందు తరాలనూ కోల్పోతాం. పది లక్షల ప్యాకేజీ వద్దు. మా అడవిలో మేం ఉంటామ"ని ఆదివాసీలు చెబుతున్నారు. వీళ్లందర్కీ 1/70, 2006 అటవీ హక్కు చట్టం, పెసా చట్టం, 5వ షెడ్యూలు గురించి చాలా చక్కటి అవగాహన వుంది. "ప్రభుత్వానికైనా మా పర్మిషన్ లేకుండా, గ్రామసభలు నిర్వహించకుండా మా అటవీ ప్రాంతానికొచ్చి మా భూములు తీసుకొని మమ్మల్నిక్కడ్నించి తరిమే హక్కు లేదు. ఈ అడవిలోని భూమి, నీరు, అడవి మీద పూర్తి హక్కు మాదే.. ప్రభుత్వానికి కాదు" అంటున్నారు ఆదివాసీలు. వీరిప్పటికీ ఆదివాసీ, గిరిజన, గోండు సంఘాలు, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు చేసారు. చేస్తున్నారు. ఇంకా ఈ టైగర్ ప్రాజెక్ట్ అడవి నించి, గూడాల నుంచి రద్దయ్యేంత వరకూ పోరాడుతామని చెప్తున్నారు.

ఇదే వేదన మహబూబ్‌నగర్ జిల్లా అమ్రాబాద్ మన్ననూర్ మండలం టైగర్ రిజర్వ్ అటవీ ప్రాంతపు వటవర్లపల్లి, సార్లపల్లి, కుడిచింతలబైలు గ్రామాల ఆదివాసీలది. ఊర్లు లేచిపోతున్నాయి. వ్యవసాయం బందు పెట్టండి అని గ్రామస్తులను ఫారెస్టు డిపార్ట్‌మెంట్ వాళ్లు చెంచులను వేధిస్తున్నారు. జిగురుకు, వెదురుకు, ఇప్పపూవుకి జంగల్‌కు పోతే కొట్టి కేసులు పెడ్తున్నారు. మేం బయట బత్కలేం. అంతకు ముందు మిమ్మల్ని అభివృద్ధి చేస్తం అని ఎనభై మంది చెంచులను మైదాన ప్రాంతాలకు తరలిస్తే వాళ్లలో చాలా మంది బయటి వాతావరణానికి తట్టుకోలేక చనిపోయారు. మాకు అడవిలోనే అన్ని విధాలుగా రక్షణ ఉంటుంది అంటున్నారు చెంచులు.

"కన్నతల్లి లాంటి అడవి మాది. మమ్మల్ని వేరు చేసే కుట్ర ప్రభుత్వం పన్నుతున్నది. దానికి చాలా పనికిరాని కారణాలను చూపుతున్నది. పులులతో మాకు అపాయం అంటుంది. మాతో అడవికి నష్టం అంటుంది. మాకు పులులతోని ఏ అపాయం లేదు. మా తాతల ముత్తాతల కాడికెల్లి పులులతో నివాసం చేస్తున్నాం. పులి మాకు దేవత. దాన్ని మేం పూజిస్తం. పులి ఎప్పుడు, ఎక్కడ అడవిలో తిరుగుతుందో మాకు బాగా తెలుసు. అది లేనప్పుడే జంగల్‌కి పోతం. మాతోని పులికి, జంగల్‌కి కష్టమే లేదు. వాళ్లే ఫారెస్ట్‌వాండ్లతోనే కష్టం. ఆ ఆఫీసర్ల ఇండ్లకు బోయి సూడుండ్రి. సోఫాలు, కుర్చీలు, తలుపులు అన్నీ జంగల్ కలపనే. ఆళ్లే కొట్కపోతరు. శానామంది కలప వ్యాపారం చేస్తరు. మేం కొట్కపోతున్నమని అంటరు. ఇంక పులులను మేం చంపం. గోర్లు, చర్మం కోసానికి ఆల్లే చంపుతరు. పులలతోని మాకు ప్రమాదం లేదు. ఆ ఫారెస్టు వాళ్లతోనే మాకు ప్రమాదం. ఎట్ల చేసి మమ్మల్ని మా జంగల్‌కెల్లి ఎల్లగొట్టాల్నని సూస్తున్నరు. ఏడికిపోవాల. మేం పోం. ఒక్కసారి జంగల్ కెల్లి బయటకుపోతే మాకు బత్కులేదు. సచ్చిపోతం. బయట ఉండలేక మా వోళ్లు శానామంది గిట్లనే సచ్చిపోయిన్రు." అని చిర్ర రాములు అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఏరియాలోని సారపల్లి ఆదివాసీ ఆగ్రహంగా చెప్పాడు.

నిజానికి టైగర్ ప్రాజెక్టు పేరుతో తమనెందుకు తరలించాలని చూస్తున్నారో వాళ్లు స్పష్టంగా చెపుతున్నారు. 2003లో ఈ అటవీ ప్రాంతాన్ని ఇక్కడున్న యురేనియం, వజ్రాల వంటి ఖనిజాల కోసం దక్షిణాఫ్రికాకు చెందిన డీబీర్ ప్రైవేట్ సంస్థకు అప్పజెప్పినప్పట్నించి చెంచుల జీవితంలో దుర్భరమైన సంక్షోభం మొదలైంది. వీళ్ల అడ్డు తొలగించు కోవడానికి 2006-2007లో కొన్ని చెంచు పెంటలను ప్రభుత్వం బలవంతంగా అభివృద్ధి పేరుతో మైదాన ప్రాంతమైన అప్పాపూర్‌కి తరలించడంతో అక్కడ వ్యవసాయానికి దూరమై రేషన్‌బియ్యం కూడా అందక, వేరే ఏ పనీ దొరకక అడవిలోకి ప్రవేశం నిషిద్ధమై చాలా మంది చెంచులు అసహజ మరణాల పాలయ్యారు. చెంచు జనాభా ఐటీడీఏ లెక్కల ప్రకారమే 125 చెంచు పెంటల్లో 15 వేలకు పైగా ఉంటే 2015 కల్లా 8

వేలకు మాత్రమే మిగలడం వీరి అసహజ మరణాల సంఖ్యను సూచిస్తుంది. నిజానికి ఈసారి ఈ మూడు ఆదివాసీ గ్రామాల్లో సాగుభూమిలో పత్తి 80శాతం పండి కూలీలను బైట నుంచి కూడా పిలిపించుకున్నామని చెప్తున్నారు. 10 లక్షలు/5 లక్షలు ప్యాకేజీ ఒక బోగస్ అనీ, ఒకవేళ వాళ్లు ఆ ప్యాకేజీ ఇచ్చినా మాకు దేనికీ పనికిరాదని, ఒక గంట అడవిలోకి వెళితే రోజుకి 300-400 రూపాయల అటవీ ఉత్పత్తుల వ్యాపారం చేస్తామనీ చెబుతున్నారు. 70 సంవత్సరాల కింద నుంచి ఉంటున్న గిరిజనేతలను ఇంకా ఎక్కువే బెదిరిస్తున్నారు ఫారెస్టు డిపార్టుమెంట్ అధికారులు. మీ భూములకు మీరు చెలాన్లు చూపండని అంటున్నారు. మర్యాదగా ప్యాకేజీ తీసుకొని వెళ్లిపోండి. లేకపోతే అడవిలోని భూమీ దక్కదు. ప్యాకేజీ దక్కదు. దిక్కులేని చావు చావాలని బెదిరిస్తున్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ గిరిజనులు, గిరిజనేతరులు చాలాసార్లు పాదయాత్ర చేసారు. నిజానికి ఈ రెండు వర్గాల మధ్య మంచి అనుబంధం ఉంది. అడవిలోని స్థానిక గిరిజనుల భూములు గిరిజనేతరులు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తారు. వీరి భూమి, అటవీ హక్కుల కోసం కూడా గిరిజనులు పోరాటం చేసారు. వీరి మధ్య విభేదాలు సృష్టించడానికి ఎన్జీవోల్ని ప్రభుత్వం రంగంలోకి దింపింది. కలెక్టర్ టీకె శ్రీదేవి మొదట చెంచులకే వత్తాసు పలికినా, తర్వాత డీబీర్ సంస్థకే వత్తాసు పలుకుతూ ప్యాకేజీ తీసుకొని వెళ్లిపొండని ప్రభుత్వానికి వంత పాడుతుందన్నారు.

కుడిచింతలబైలు, సార్లపల్లి, వటవర్లపల్లి చెంచు పెంటల్లో బలవంతంగా బెదిరించి ఎక్కడంటే అక్కడ సంతకాలు పెట్టించు కుంటున్నారు. మాకంటే పులులు ఎక్కువా అని చెంచులు వేదన పడుతున్నారు. పోడుపంట, అటవీ ఫలసాయం, మందుమొక్కలు, పశుసంపద, పాడి, భూమి ఇవన్నింటినీ వదిలిపెట్టి మేం మైదాన ప్రాంతంలో బతకలేం. ఇక్కడ అడవితల్లి ఒడిలో అడవి దేవతల దీవెనలతో బతుకుతున్న మేం, మైదాన ప్రాంతాల్లో బానిస బతుకులు, కూలీ బతుకులు బతకలేం. నిర్వాసితులైన పోలేపల్లి సెజ్ బాధితులు పట్టణాల్లోని క్రాస్‌రోడ్స్‌లో బిచ్చగాళ్లైనట్లు మేము కాలేం. మా భూమి, మా అడవి, మా నీరు మాక్కావాలి. ఈ అడవి మీద మాకే హక్కు ఉంది. వేరే దేశం కంపెనీలకు అడవిని దారాదత్తం చేసేందుకు మమ్ముల్ని ఎల్లగొట్టాలని చూస్తున్నారు. అట్ల ఎల్లగొడ్తున్నందుకు ఢిల్లీ కెళ్లి మా చెంచు గల్లీల దాకా ఉన్న రాజకీయ నాయకులు, ఫారెస్టు ఆఫీసర్లు, ఎన్జీవోలు బాగా తింటున్నారు. మా నోటికాడ కూడు గుంజుతున్నారు. మైదాన ప్రాంతం అభివృద్ధి మాకొద్దు. 10 లక్షల ప్యాకేజీ కోసం అటవీ భూమిపై మాకున్న శాశ్వత హక్కుని అటవీ సంపదపై మాకున్న హక్కుని, అడవితో మాకున్న అనుబంధాన్ని, అటవీ దేవతలతో మాకున్న జీవ సంబంధాన్ని, సంస్కృతినీ ఒదలలేం. పులులు ఎక్కువలేవు. మా జోలికి రావు. మా జోలికి జంతువుల కంటే ప్రమాదకరమైన మనుషులు వస్తున్నారు. అయినా ఈ అభివృద్ధి మా కోసం కాదు. డీబీరు కంపెనీ కోసం. అయినాగానీ మేం భయపడం. పోరాటం చేస్తాం. 1/70, పెసా, 2006 అటవీ హక్కు చట్టాలు మాకున్నాయి. గవర్నరు కూడా మా హక్కును మా నుంచి గుంజుకోలేడు. ప్రాణాలైనా పోగొట్టుకుంటాం, కానీ ఈ అడవి మీద హక్కుని మా జీవించే హక్కుని మేం కోల్పోమని అంటున్నారు. అమ్రాబాదు చెంచులు, కవ్వాల్ నాయక్‌పోడులు, గోండులు.

నిజానికి ఎంతో పోరాడి సాధించుకున్న 1/70, పెసా అటవీ హక్కుల్ని సరైన దిశగా అమలు చేయాలి. అడవిలో ఆదివాసీల హక్కుల్ని కాపాడవల్సిన పాలకవర్గం, ప్రపంచ బ్యాంకు ఏజెంటుగా, దళారీగా మారిపోయి సామ్రాజ్యవాద అనుకూల ప్రయోజనాల కోసం తన స్వంత దేశపు అడవి బిడ్డలైన ఆదివాసీల జీవించే హక్కుని కాలరాస్తున్నది. యురేనియం, సున్నపు రాయిని ఎమ్మెన్సీలకు కట్టబెట్టడానికి ఆదివాసీలను అడవి నుంచి చంపైనా వెళ్లగొట్టే ప్రయత్నం చేస్తున్నది. అందుకే కవ్వాల్ కుర్రిగూడెం వాగులో విషం కల్పింది. అమ్రాబాద్-కవ్వాల్ అడవిలో విషనాగులు వొదలబడ్డాయి.

అయితే చెంచులు, ఇతర ఆదివాసీలు బలహీనంగా ఏమీలేరు. సామ్రాజ్యవాద దేశాల ప్రయోజనాల కోసం స్వంత దేశ ప్రజల జీవితాల్ని బలిపెడుతున్న పాలకవర్గాలను అసహ్యించుకుంటున్నారు. తీవ్రస్థాయిలో వారిని ప్రతి ఘటిస్తున్నారు. కొద్దిమంది పాలకవర్గ తొత్తులుగా మారిన గిరిజనేతరులతో అడవి జీవితం వద్దని, మైదాన ప్రాంతపు అభివృద్ధిని కోరుకుంటున్నామని ధర్నాలు చేయించి నకిలీ మెమోరాండమ్‌లు సమర్పించినంత మాత్రాన ఏమీకాదని గుర్తుంచుకోవాలి. లక్షల సంఖ్యలో నిర్వాసితులైన, అవబోతున్న ఆదివాసీల దండు స్పష్టమైన పోరాట కార్యాచరణతో అటవీ ప్రాంతాల్లో యురేనియం మైనింగ్ మాఫియాల కోసం ప్రారంభించిన టైగర్ ప్రాజెక్ట్ రద్దు దిశగా ముందుకు కలలబారుతుందన్న విషయం గ్రహించాలి. ప్రతీ ఆదివాసీ కొమురం భీంను మనసులో నింపుకొని ఆ చిక్కటి అడవుల్లో ఉడతలు, కౌజు పిట్టలను వేటాడే అమ్ముల పొదిలోని బాణాలను ఎదుర్కోవడానికి ప్రభుత్వమే సిద్ధంగా ఉండాలి.

# యురేనియం-ప్రభావాలు

ప్రకృతిలో చాలా రకాల లోహాలు ఉన్నాయి. అందులో అతి బరువైన లోహం యురేనియం. 1896లో హెన్రి బెక్వేర్ల్ అనే రసాయన శాస్త్రవేత్త ఈ లోహాలకి రేడియో ఆక్టివిటీ అంటే అణుధార్మికత ఉన్నదని కనిపెట్టారు. ఈ ధాతువులలో అణువులు నిలకడగా ఉండవు. అస్థిరంగా ఉండే ఈ అణువులు విస్ఫోటనం చెందడం వలన భయంకరమైన అణుధార్మికశక్తి వెలువడుతుంది. దీని ద్వారా వెలువడే రేడియేషన్ చాలా ప్రమాదం.

యురేనియంలో అణువుల విస్ఫోటనం ద్వారా దాన్నుంచి కొత్త యురేనియం ఉత్పన్నాలు అవుతాయనంటారు అంటే బైప్రోడక్ట్స్ అన్నమాట. యురేనియం, ప్రోటానియం, థోరియం, రేడియం, రెడాన్ గ్యాస్, పోలోనియం మొదలైన రెడాన్ సంతానం ఇవి యురేనియం కంటే ప్రమాదకరం. 1898లో మేడం క్యూరి యురేనియంతో ప్రయోగాలు చేసి ఆక్టినియం, థోరియం, రేడియంలను కనిపెట్టింది. కానీ యురేనియంలోని అణుధార్మిక శక్తి వలన మేడం క్యూరి, ఆమె కుమార్తె ఇరీన్ క్యాన్సర్‌తో మరణించారు. హెన్రి బేకవేలెర్ కూడా రేడియోధార్మికత వల్ల వచ్చిన కాన్సర్‌తో చనిపోయారు.

యురేనియం భూమి పొరల్లో ఉన్నంతసేపు పర్యావరణానికి, మనుషులకు ఏ ప్రమాదం ఉండదు. తవ్వి బయటకు తీసి ప్రాసెసింగ్ లేదా శుద్ధి చేసే క్రమంలోనే ప్రమాదముంది. యురేనియంను గనుల నుంచి తవ్వి తీసిన ముడి పదార్థం నుంచి వేరు చేసే క్రమాన్నే శుద్ధి చేయడం అంటారు. దీంతో 15 శాతం మాత్రమే శుద్ధమైన యురేనియం కేకు లేదా ఎల్లో కేకుగా వెలువడుతుంది. మిగతా 85 శాతం విషపూరితమైన వ్యర్థ రసాయన పదార్థాలు భయంకరమైన రేడియేషన్‌ని వెలువరిస్తాయి. యురేనియం క్రషింగ్లో అణు ధూళి



వెలువడుతుంది. దీంట్లో కంటికి కనిపించని ఆల్ఫా, బీటా అనే సూక్ష్మ అణువులు ఉంటాయి. ఇవి మనం పీల్చుకునే గాలి, తాగే నీరు, తినే ఆహారాల్లో కలిసిపోయి శరీరంలోకి ప్రవేశించి, ప్రాణాంతకమైన వ్యాధులకు కారణమవుతాయి. గామ అనే అణువులు మనిషి శరీరం మీద నేరుగా ప్రభావాన్ని చూపిస్తాయి. అవి వరుసగా ఎముకల కాన్సర్, బ్లడ్ కాన్సర్, ఊపిరితిత్తుల కాన్సర్, కిడ్నీ కాన్సర్, చర్మ వ్యాధులు, క్యాన్సర్లు, గర్భస్రావాలు, పిల్లలు ఎముకలు వంకర్లు తిరిగి, పెద్దతలతో పుట్టటం (congenital anamoly), ఫిట్లు, స్త్రీ, పురుషులిదర్లో వంధ్యత్వం వచ్చి పిల్లలు పుట్టటం లేదు. ఇలా మనుషులు యురేనియం వలన ఎన్నో రకాల వ్యాధులతో చనిపోతున్నారు. ఎముకల వ్యాధులతో పుట్టే పిల్లలు అతి కష్టం మీద 15 ఏళ్ల లోపు మాత్రమే బతుకుతున్నారు. వీళ్ల వైద్యానికి యుసిఐఎల్ గానీ, ప్రభుత్వం కానీ నష్టపరిహారం ఇవ్వదు. గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక, ఆర్థిక కారణాల వలన ఇటువంటి వ్యాధులు సహజమే అని యుసీఐఎల్ చేతులు దులుపుకుంటుంది. అదే విధంగా జంతువుల్లో కూడా వంధ్యత్వం వచ్చి అలాగే వాటికి కూడా కలుషితగడ్డి, మొక్కలు, నీటి వల్ల మనుషుల కొచ్చే రోగాలు వచ్చి చనిపోతున్నాయి.

జార్ఖండ్లోని జాదుగుడా గ్రామంలోని ఎముకల వ్యాధి భారిన పడి కాళ్ళు, చేతులు, వెన్నుముక వంకర్లు తిరిగిన పిల్లలు పాకుతూ, వీల్ చైర్లలో కూర్చొని బలహీనంగా కనిపిస్తారు. రోగనిరోధకశక్తి తగ్గిపోవడం, హార్మోన్ల అసమతుల్యత, రక్తహీనత, జన్యు సంబంధ అనువంశిక రోగాలు, చర్మ వ్యాధులు, కేంద్ర నాడీ వ్యవస్థ దెబ్బ తినడం, అలసట, నీరసం, కీళ్ల నొప్పులు, మానసిక వ్యాధులు, డిప్రెషన్, వత్తిడి, ఆందోళన, భయం, నిద్రలేమి, స్త్రీలలో రుతు సంబంధమైన సమస్యలు వస్తున్నాయి. యురేనియం వ్యర్థ పదార్థాల నుంచి వెలువడే అణుధార్మికత వందల, వేల సంవత్సరాల పాటు పర్యావరణంలో మిగిలిపోతుంది. ఇది జన్యుపరమైన మార్పుల్ని, దుష్ప్రభావాలను మనుషుల్లో, జంతువుల్లో, పక్షుల్లో, వృక్షాల్లో, నీళ్ళల్లో, మట్టిలో తీసుకువస్తుంది. పిల్లలు బుద్ధిమాంద్యంతో పుడుతున్నారు. పంటల్లో, నీళ్లలో, భూమిలో చేరి పంటలు విషపూరిత మవడం, లేదా పండక పోవడం జరుగుతున్నాయి.

1986లో రష్యాలోని చెర్నోబిల్‌లో న్యూక్లియర్ రియాక్టర్ కేంద్రం నుంచి లీకైన అణుధార్మికత అతి తక్కువ మోతాదులో కేవలం రెండు కేజీల సీజీఎం 137 వలన అక్కడి పశువులు,



పంటలు, భూములు, నీటి వనరులు కొన్ని సంవత్సరాల వరకు మనుషులకు ఉపయోగపడలేదు. ఆ అణుధార్మికత లీకైనప్పుడు మనుషులందరినీ వందల కిలోమీటర్ల దూరానికి వెంటనే తరలించేశారు. యురేనియం ద్వారా ఉత్పన్నమయ్యే రెడాన్ గ్యాస్ ఎంత ప్రమాదకరమైనదంటే యురేనియం ప్లాంట్‌లో పనిచేసే కార్మికులు దాదాపు 30 వేల మంది ఊపిరితిత్తుల కాన్సర్‌తో చనిపోయారు.

జాదుగుడాలో కూడా ఈ కార్మికులు చాలాసార్లు తక్కువ రక్షణ వ్యవస్థలతో పనిచేయడం వలన క్యాన్సర్ల భారినపడి చనిపోయారు. మరెన్నో వేల మంది శ్వాస కోశవ్యాధులతో బాధపడుతున్నారని ఆస్ట్రేలియాకు చెందిన sea_us అనే స్వచ్ఛంద సంస్థ చేసిన సర్వేల్లో తేలింది. రేడాన్ గ్యాస్ గాలి కన్నా 8 రెట్లు బరువైంది. కాబట్టి భూమికి దగ్గరలో గాల్లో తేలుతూ తక్కువ కాలంలో ఎక్కువ దూరాలకు ప్రయాణం చేయటం వలన చాలా ప్రదేశాల్లో గాల్లో ప్రయాణం చేయటం వలన దేశమంతా వ్యాపించే ప్రమాదం ఉంది. ఇది గాలితో పాటు భూమిలో కూడా వ్యాపిస్తుంది. కాబట్టి అక్కడి భూగర్భ జలాలనే కాకుండా అది ఎక్కడెక్కడ వ్యాపిస్తుందో అక్కడ భూగర్భజలాలను కలుషితం చేస్తుంది. భూసారాన్ని అనేక ప్రమాదకర యురేనియం ఉత్పన్నాలతో నాశనం చేస్తుంది. దీన్ని "చైనా సిండ్రోమ్" అని కూడా అంటారు.

హైదరాబాద్‌లోని న్యూక్లియరు ఫ్యూయల్ కాంప్లెక్స్ (NFC)కు యురేనియం జాదుగుడా నించి ఓపెన్ ట్రక్కుల్లో వస్తుంది. అవి వచ్చిన దారంతా, యురేనియం ధూళిని వేదజల్లుతాయి అంతే కాదు, NFCకి చుట్టు పక్కల ప్రజలు అణుధార్మికతకు గురవుతున్నారని, వాళ్లలో జన్యుపరమైన మార్పులు వస్తున్నాయని పరిశోధనల్లో తేలుతున్న విషయం.

## యురేనియం - అంతర్జాతీయ రాజకీయాలు

18వ శతాబ్దంలో కనుగొనబడిన యురేనియం ప్రపంచ ఆధిపత్య రాజకీయాలకు మూల కేంద్రమైంది. బీద దేశాల మీద పెత్తనం చేయడానికి అణుబాంబు బూచీని అమెరికా, కొరియా దేశాలు సిద్ధం చేసుకొని పెట్టుకొన్నాయి. ఇప్పుడు, భారతదేశం దేశ రక్షణ నెపంతో తాయారు చేయాలని అనుకొంటున్నది. నెపం దేశరక్షణ అని చెప్తున్నా డీబీర్ లాంటి బహుళజాతి కంపెనీలకు లాభం చేకూర్చటానికన్నది చాల స్పష్టం. 1945లో హిరోషిమా నాగ సాకీల మీద ప్రయోగించిన అణుబాంబు కోసం వదిలిన యురేనియం కెనడా నించి తయారైంది. అప్పటినించి ప్రపంచ మార్కెట్‌లో ఉరేనియం విలువ చాలా పెరిగిపోయింది. 60 ఏళ్ల క్రితం 1 గ్రాము యురేనియం ధర లక్ష డాలర్లు ఉండేది అంటే ఇండియన్ కరెన్సీలో 70,000 లక్షలన్నమాట. కెనడా దేశమే యురేనియం ఉత్పత్తిలో అగ్ర స్థానంలో ఉంది. కెనడా యురేనియంను అమెరికాలో ప్రాసెసింగ్ చేస్తుంది. అందుకోసం అమెరికా దాని ఉత్పత్తిలో వాటా తీసుకోవడమే కాదు. ఆ వ్యర్థాల నుంచే అణుబాంబుని తయారుచేసుకుంటుంది యురేనియం న్యూక్లియర్ రియాక్టర్ల నిర్మాణంలో, విద్యుచ్ఛక్తి ఉత్పత్తిలో ఉపయోగపడుతుంది. కానీ ప్రజా ప్రయోజనాల కంటే, శాంతియుత ఉపయోగాల కంటే, ఆధిపత్య దేశాలలో వినాశకర అణు, హైడ్రోజెన్ బాంబుల తయారీలో కోసమే, మిలటరీ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తారు. ఇక ముందు జరగబోతుంది కూడా కొరియా దేశాధ్యక్షుడు కిమ్ అణుబాంబుని తయారుచేసి పెట్టుకున్నాడు. భారత్ కూడా అదే దారిలో నడవ బోతున్నది. న్యూక్లియర్ తయారీకి ఫ్లూటోనియం యురేనియం నుంచే తయారవుతుంది. 40 వేలకు పైగా ఉన్న న్యూక్లియర్ హెడ్స్ ఈ రోజు బీద దేశాలకి ప్రమాదకరంగా మారనున్నాయి. పాకిస్తాన్, తైవాన్, దక్షిణ కొరియా, అర్జెంటీనా, రుమేనియా దేశాలు అణ్వాయుధాల తయారీ కోసమే కెనడా నుంచి యురేనియంను దిగుమతి చేసుకున్నాయి. 1974లో కెనడా నుంచి భారతదేశం న్యూక్లియర్ రియాక్టర్లను దిగుమతి చేసుకొని అణుబాంబుని తయారు చేసిన తరువాత భారతదేశం మీద ఆంక్షలు మొదలైనాయి. కానీ తరువాత ఆంక్షలు తీసేసినా భారతదేశం స్వయంగా యురేనియంను ఉత్పత్తి చేసుకుంటూ అణుబాంబులను తాయారు చేసుకొవడానికి సిద్ధమయ్యింది.

చాల దేశాలు యురేనియం ద్వారా వస్తున్న నష్టాలను గమనించి తవ్వకాలు మనుకోవడమో, ఉన్నవాటిని మూసెయ్యడమో చేస్తున్నాయి. ఫ్రాన్స్ దేశం యురేనియం నుంచి ఉత్పత్తయిన వ్యర్థ విషపూరిత రసాయనాలు తమ దేశ పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి చేస్తున్న హానిని గుర్తించి,

రష్యాలోని సైబీరియాలో కొన్ని వేల కోట్ల డాలర్లు ఇచ్చి డంప్ చేస్తున్నది. తరువాత కొత్త న్యూక్లియర్ రేయాక్టర్ల ఏర్పాటుపైన ఫ్రాన్స్ దేశం నిషేధం విధించింది.



మార్చ్ 28, 1979న త్రిమెయిల్స్ (Three miles) ఆక్సిడెంట్ తర్వాత అమెరికా కొత్త అణు రియాక్టర్లను ఆపేసింది. పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి యురేనియం చేస్తున్న నష్టాన్ని చెప్పకుండా దేశభద్రత పేరు మీద ప్రజలని చాలా దేశాలు మోసపుచ్చుతున్నాయి. అంధకారంలో పెడుతున్నాయి. అణుబాంబుల తయారీ దేశభక్తితో చేస్తున్నది ఎంత మాత్రమూ కాదు. తను కబలించాలనుకొంటున్న బీద దేశాలని బెదిరించి తన రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకోవాలని అమెరికా లాంటి ఆధిపత్య దేశాలు ఒక రాజకీయాస్త్రంగా వాడుకొంటున్నాయి. అమెరికాలోని అణువిద్యుత్తు కర్మాగారాల్లోని వ్యర్థ రసాయనాలను భూగర్భ సొరంగాల్లో దాచి ఉంచడానికి సంవత్సరానికి 25 వేల కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నది. అయితే అమెరికా కూడా కొత్త అణు రియాక్టర్లను ఆపేసింది.

పాలకవర్గాలు, యూసీఐఎల్ చెబుతున్నట్లు యురేనియం ద్వారా జరిగిన విద్యుత్ ఉత్పాదనతోనే ఇప్పుడు అభివృద్ధి చెందిన దేశాలు ఇంకా ముందుకు వెళ్తున్నాయి అనేది అబద్ధం. అసలు అణువిద్యుత్తు కంటే జలవిద్యుత్తు, థర్మల్ విద్యుత్తు చాలా సురక్షితం, చవక. సహజ వాయువు ద్వారా, గాలిమరల ద్వారా, సౌర శక్తి ద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్తు చాల చౌక. అణురియాక్టర్లు చాలా ప్రమాదం. ఇది ప్రపంచ చరిత్రలో నిరూపితమైంది వాస్తవం

భారతదేశం గత 60 ఏళ్ళనుంచీ కొన్ని వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి కేవలం 27 వేల మెగావాట్ల అణువిద్యుత్తును మాత్రమే తయారు చేయగలిగింది. ప్రపంచంలో ఉత్పత్తి చేసే మొత్తంలో అది కేవలం 4% కంటే తక్కువ. ఇది 2004 లెక్క. అయితే 15 ఏళ్ళు దాటాక కూడా ఇంతే ఉండబోతున్నదని అప్పట్లోనే అటామిక్ రీసెర్చ్ డిపార్టుమెంటు అంచనా వేసింది. అయినా ఇంత ఖర్చు పెట్టి అణువిద్యుత్తు తయారీ కేవలం సామ్రాజ్యవాద దేశాలు, పెట్టుబడిదారీ వర్గాల ప్రయోజనాల కోసం, తన స్వంత ఆధిపత్య రాజకీయాల కోసం ప్రజలకి ప్రాణాంతకమైన వ్యాధులను తెచ్చే యురేనియం తవ్వకాలను చేపట్టాయి. ఒక్కోసారి విలువైన యురేనియం దేశాల మధ్య దొంగ రవాణా ద్వారా ప్రైవేట్, ప్రభుత్వ యంత్రాంగం ద్వారా తరలించబడుతుంది.

ప్రపంచ వ్యాప్తంగా యురేనియం తవ్వకాలు తగ్గుతూ వస్తున్నాయి. కారణం అణు ప్రమాదాలతో ఆయా దేశాలు తీసుకున్న మానవీయ నిర్ణయాలు అయితే, ఆయా దేశాల్లో జరిగిన ప్రజా ప్రతిఘటనలు, ఉద్యమాలు కూడా కారణమే.

ప్రపంచవ్యాప్తంగా యురేనియం తవ్వకాలు చేస్తున్న దేశాలు తీవ్రమైన ప్రజాప్రతిఘటనలున్నా కానీ, ప్రపంచ వ్యాప్తంగా యురేనియంను ఉత్పత్తి చేస్తున్న దేశాలు–ఖజకిస్థాన్, కెనడా, ఆస్ట్రేలియా, నమీబియా, నైజీరియా, రష్యా, ఉజెకిస్తాన్, చైనా, యునైటెడ్ స్టేట్స్, ఉక్రెయిన్, ఇండియా, సౌత్ ఆఫ్రికా, పాకిస్థాన్ మొదలైనవి. ఈ దేశాలు ప్రతి ఏడాది యురేనియంను వేల టన్నుల్లో ఉత్పత్తి చేస్తున్నది. యురేనియం ఉత్పత్తిలో ప్రపంచవ్యాప్తంగా కెనడా 32%లో, 19%లో ఆస్ట్రేలియా మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. భారత దేశంలో యూసీఐఎల్‌కి ఉన్న యురేనియం నిల్వలు త్వరలో అయిపోతాయి. భారత దేశంలోని 10 అణువిద్యుత్ కేంద్రాలకు జార్ఖండ్ రాష్ట్రం లోని తూర్పు సింగ్భం జిల్లాలోని జాదుగరా, భాటిన్, చటి కుఛ, సర్వా పహార్లల్లో నుంచి యురేనియం తీస్తున్నది. కెనడా, ఆస్ట్రేలియా దేశాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ యూసీఐఎల్ మన దేశంలో నుంచే యురేనియం తీయాలనుకున్నది. అందుకే దేశంలో అత్యధిక యురేనియం నిలువలున్న మేఘాలయలోని ఖాసీ పర్వత ప్రాంతాలను, నల్గొండను ఎన్నుకున్నప్పటికి అక్కడి ప్రజల వ్యతిరేకత వలన, నల్లమలలో విప్లవోద్యమం బలంగా ఉండడం వలన చేయలేకపోయింది. తర్వాత కడపజిల్లా పులివెందులలో, తుమ్మలపల్లిలో విజయం సాధించగలిగింది. నిజానికి అమెరికా, ఫ్రాన్స్ లాంటి దేశాలు ఇప్పుడు యురేనియం తవ్వకాలు మానేసినా భారత దేశం మాత్రం ప్రజల ప్రాణాలు ఫణంగా పెట్టి యురేనియం తవ్వకాల కోసం ఉవ్విళ్లూరుతున్నది.

**తరువాయి వచ్చే సంచికలో...**

# మరణం అంచున నల్లమల

ఎనుపోతుల వెంకటేష్

ప్రపంచంలో మరోచోటా ఎక్కడా కనిపించని మానవజాతి. నల్లమల అడవికి మాత్రమే పరిమితమైన అపురూపమైన అరుదైన జాతి చెంచుజాతి.

దేశంలోనే అతిపెద్ద అభయారణ్యంలో దట్టమైన అడవులు. ఎత్తైన కొండలు. వేల అడుగులలోతు లోయలు. గల గల పారేసెలయేళ్లు. అన్ని కలిస్తే దట్టమైన నల్లమల అడవి. ఈ అడవిలోనే ఆ మానవ తెగ జీవనం సాగిస్తోంది.

అడవి మీద ఆదారపడి బతికే ఆదివాసులు, ఆదివాసేతరులు దశాబ్ద కాలంగా ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకొని బిక్కు బిక్కుమంటూ రోజులు గడుపుతున్నారు. తెలంగాణ రాష్ట్రానికే తలమానికమైన నల్లమల ప్రాంతం దాదాపు 2008 మొదలుకొని 2009 నుండి అక్కడ ప్రతి జీవరాశికి యురేనియం వుచ్చుపడింది.

2009 నవంబర్‌లో భారత ప్రభుత్వం సామ్రాజ్య వాదులకు, బహుళజాతి కంపెనీలకు అవసరమైన అపారమైన ఖనిజ సంపదల కోసం, వజ్రాల కోసం విదేశీ పెట్టుబడి దేగలు విహరించేందుకు వీలు కలిగించారు. 2012లో బహుళజాతి సంస్థ అయిన డీబీర్స్ కంపెనీ అధికారులు హెలీకాప్టర్ సహాయంతో ఉమ్మడి అమ్రాబాద్ మండలం పరిధిలోని ఉడిమిల్ల, బి.కె తిర్మలాపూర్ గ్రామాలు కేంద్రంగా యురేనియం ఖనిజ నిలవలు సమృద్ధిగా ఉన్నట్లు నిర్ధారించారు.

కంపెనీ అధికారులు అటవీ ప్రాంతానికి వెళ్ళేందుకు, ప్రభుత్వ అండదండలతో నమూనాలు సేకరించేందుకు భూగర్భ తవ్వకాలు నిర్వహించాలని ఖనిజాల అన్వేషణ, పరిశోధన జరపాలని సిద్ధపడి వీటిలో భాగంగానే బి.కె తిర్మలాపూర్ గ్రామంలోని వ్యవసాయ భూములలో ఉచితంగా బోరుబావులు తవ్వుతూ బోర్ల ద్వారా వెలువడిన మట్టిని కావర్లలో నింపుతుంటే స్థానిక రైతులకు, ప్రజలకు అనుమానం వచ్చి బోరు వాహనాలను ధ్వంసం చేశారు. వారిని వ్యవసాయ పొలాల నుంచి అడవి పరిసర ప్రాంతం నుంచి వెళ్లగొట్టారు.

2016లో కొంత మంది శాస్త్రవేతలు, కంపెనీ అధికారులు స్థానిక పోలీసుల అండదండలతో అడవిలో ప్రవేశించేందుకు ప్రయత్నించగా పదర గ్రామంలో పసిగట్టిన ప్రజలు రోడ్డుకు అడ్డంగా గీతగీసి ఆ గీత దాటి ఒక్క అడుగు ముందుకు పెట్టండంటూ శపథం చేస్తూ మాటల యుద్ధం సాగింది. అడ్డుపడిన పోలీసులతో ఇది మా బతుకుల సమస్య అంటూ స్థానికులకు, పోలీసులకు మధ్య కొంత సమయం వాగ్వివాదం జరిగింది. దాంతో పోలీసు అధికారులతో సహా అందరూ వెనుతిరిగారు.

యురేనియం ప్రపంచదేశాలలో ఎంత విధ్వంసాన్ని సృష్టించినదో, ఎంత ప్రమాదకరమైనదో తెలిపేందుకు అప్పటికే స్థానికంగా ప్రజా సంఘాలు, కులసంఘాలు, రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు కలిసి అక్కడ యురేనియం వ్యతిరేక పోరాట సంఘం నాగయ్య, నాసరయ్యల నాయకత్వంలో ఏర్పడింది. గ్రామ గ్రామాన ప్రచార క్యాంపెయిన్ నిర్వహించారు. తెలంగాణ ప్రజా ఫ్రంట్, తెలంగాణ విద్యార్థి వేదిక నాయకులు సినిమా రూపంలో దాని ప్రభావం గురించి తెలియ చెప్పారు. దాని గురించి తెలుసుకున్న ప్రజలు వ్యతిరేకించడం, ఉద్యమాలు చేయడం మొదలు పెట్టారు. అది చూసి నల్లమలలో యురేనియం మైనింగ్ ప్రాజెక్ట్‌ను నిలిపివేస్తున్నట్టు ఒక తప్పుడు ప్రచారం జరిగింది. అది నమ్మిన నల్లమల ప్రజలు ఒక ఏడాది పాటు ప్రశాంతంగా ఊపిరి పీల్చుకున్నారు. కానీ అది ఎంతో కాలం నిలవలేదు.

ఈ ఏడాది మే 22న కేంద్ర అటవీ సలహా మండలి సమావేశం జరిపి అమ్రాబాద్ పులుల అభయారణ్యంలోని ఉడిమిల్ల కేంద్రంగా 83 చదరపు కిలోమీటర్లలో 4 వేల భారీ బోర్లు తవ్వి, శాంపిళ్లు సేకరించారు. భూగర్భంలో వున్న 20 వేల టన్నుల యురేనియం నిక్షేపాలను వెలికి తీయాలని అంచనా వేశారు. దీంతో నల్లమల ప్రజానీకం గుండెల్లో అణుబాంబులు పడినట్టు కంటిమీద కునుకు లేకుండా ఉలిక్కి పడుతున్నారు.

అమ్రాబాద్, పదర మండలాలలో చెంచు గూడాలలోని అమాయకపు ఆదివాసులు ఏక కంఠంగా చావడానికైనా, చంపడానికైనా మేము సైతం అంటూ నినదిస్తున్నారు.

ఈ నెల 22 జులై 2019 నుండి వరుసగా ఐదు రోజుల పాటు తెలంగాణ రచయితల వేదిక, మానవ హక్కుల సంఘం, తెలంగాణ ప్రజా ఫ్రంట్, తెలంగాణ విద్యార్థి వేదిక, పౌరహక్కుల సంఘాలు ఒక్కొక్కటిగా నిర్వహించిన క్షేత్రపరిశీలనలలో భాగంగా ప్రజల అభిప్రాయ సేకరణలో ఒక రచయితగా నేను పరీక్షించిన అంశాలు ప్రజల మాటల్లో.

మా చెంచోళ్లను అడవిల నుండి వెళ్లగొడ్తరట. ఫారెస్టోళ్లు మా గుడిసెలు పీకేత్తరట. అడవి నొదిలి మా చెంచోళ్లు బతుకలేరు సారు. అడవిలనే పుట్టినం, అడవిలనే పెరిగినం. ఈడనే ఉంటం. ఈడనే చస్తం అని ఉడిమిల్ల చెంచు కాలనీకి చెందిన మండ్లి గంగయ్య ఆయన సహజాతమైన పదాలతో, మాతో చెప్పిన మాటలు. మండ్లి అంజమ్మ "మా తాత, మా అయ్యా,అమ్మలు ఈడనే సచ్చింద్రు. వాళ్లు సంపాయిచ్చిన పొలం(చేను) ఉంది. ఇల్లుంది. ఈ ఊరు నుంచి మేము ఎల్లిపోము" అని వాదించింది. బి.కె తిర్మలాపూర్ గ్రామంలో నల్ల నారమ్మ మాజీ ఎం.పి.టి.సి. ఈమె వయసు 70కి పైనే. ఆమె మమ్ముల మా ఊరు నుంచి తీసుకుపోయి ఎక్కడో ఏస్తరట. తల్లులు పిల్లలు ఎడబాస్తరు. తల్లికి పిల్ల కాకుండా, పిల్లకు తల్లి కాకుండా చేస్తారా? మా అత్తమామలు, తల్లిదండ్రులు, మా ఆయన అందరు ఈ ఉర్లనే సచ్చింద్రు. ఈడనే పూడ్చినం. మమ్ములను కూడా ఈ మట్టిలనే కలపండి కాని మేము ఊరిడిచి పోము. కొయ్యల జయసింగ్ చెరువుల చేపలను ఒడ్డున వేసినట్టు మమ్ముల మా ఊరికి దూరం చేస్తే బతకలేం అన్నాడు. కొయ్యల బాలమ్మ మాదిగ కులానికి చెందిన ఆమె ఒక్క మాటలో ఊర్ల అడుగుపెట్టే కొడుకులను తరిమి కొడుతాం. అన్ని రకాలుగా  మేము సిద్ధం అన్నది. ఇలా ఏ ఊరు వెళ్ళి ఎవరిని అడిగినా మా ఊపిరినైనా ఇడుస్తం కానీ మా ఊరు ఇడువం అని ఏక కంఠంతో నల్లమల ప్రజలు చెప్పుతున్నారు.

బహుళజాతి సంస్థ కన్ను నల్లమల మీద పడటానికి మరో బలమైన కారణం ఉంది. ప్రపంచ ప్రఖ్యాతి గావించిన ఎన్నో వజ్రాలు గతంలో నల్లమల పరిసర గ్రామాలలో దొరికాయని ఓ ప్రచారం కూడా ఉంది. దాదాపు రెండు శతాబ్దాలకు పూర్వమే నిజాంల కాలంలో బ్రిటీష్ ప్రభుత్వం నల్లమలలో వజ్రాల అన్వేషణ జరిగిందని ఉమ్మడి మహబూబ్ నగర్, కర్నూల్ జిల్లాల్లో వాటి నిక్షేపాలు విరివిగా ఉన్నాయని బ్రిటీష్ అన్వేషకులు నిర్ధారించారని ఈ వజ్రాలకు నిజాం వజ్రాలుగా నామకరణం చేశారని కూడా తెలుస్తుంది.

నిజానికి నల్లమల వజ్రాల అన్వేషణకు దాదాపు 100 ఏళ్ల కిందటే ఒప్పందం కుదిరినట్లు మరో ప్రచారం కూడా ఉంది. నల్లమల అటవీ ప్రాంతంలో అన్వేషణ కోసం బహుళజాతి కంపెనీ అయిన డీబీర్స్ భారత ప్రభుత్వ అనుమతి కోరుతూ 2002లో దరఖాస్తూ చేసుకుంది. అలా ఎనిమిది సంవత్సరాల పాటు ఎదురుచూసిన బహుళజాతి సంస్థకు 2008లో భారత ప్రభుత్వం పచ్చజెండా ఊపిందని హెలికాప్టర్లు నల్లమలపై చక్కర్లు కొట్టాక గాని తెలియలేదు. చెంచులను అడవి దాటించే ప్రయత్నంలో భాగమే ఇది. నల్లమల కీకారణ్యంలోకి మొదట పోలీసు బలగాలను అడవిలోకి పంపి నక్సలైట్లను వెళ్లగొట్టారు. ఆ తరువాత పులుల సంరక్షణ కోసమంటూ చెంచులను అడవి నుంచి పునరావాస ప్రాంతాలకు తరలించేందుకు ప్రయత్నించారు. శ్రీశైలం ప్రధాన రహదారిలో వున్న వటవర్లపల్లి, కుడిచింతలబావి, సార్లపల్లి గ్రామాలలోని చెంచులు వ్యవసాయం చేస్తున్న భూముల నుంచి వెళ్లగొట్టడం, దుక్కి దున్నే రైతును అడ్డగించి "ఇవి ఫారెస్టు భూములు మీరు వ్యవసాయం చేయొద్దు" అని బెదిరించి వ్యవసాయ పనిముట్లను అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకునేవారు. ఈ తంతును కాస్త లోతుగా తరిచి చూస్తే పాలకవర్గాల కుట్రేమిటో ఇట్టే తెలిసిపోతుంది.

నల్లమలలో ఒక వైపు వజ్రాల వేట. మరోవైపు ప్రపంచాన్నే గడ గడ లాడించిన అణుబాంబుల తయారీలో ఉపయోగించే యురేనియం అనే ముడిపదార్థాల అన్వేషణకు, వెలికితీతకు సిద్దపడ్డ భారతదేశంలోని "యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్" (యూసీఐఎల్) దేగకన్ను నేడు నల్లమలపై గురిపెట్టడంతో అమ్రాబాద్ అడవి బిడ్డలు హడలి పోతున్నారు.

ఈ విధ్వంసపు  విధానాలను కళ్ళారా చూస్తున్న స్థానిక రాజకీయ నాయకులు, అటవీశాఖ అధికారులు, రాష్ట్ర ముఖ్యమంత్రి గారు నిమ్మకు నీరేత్తినట్టు వ్యవహరిచడం దేనికి సూచిక?

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంస్కరణల పేరుతో ప్రారంభించిన నూతన ఆర్థిక, పారిశ్రామిక విధానాల్లో భాగంగా బహుళజాతి సంస్థల దోపిడికి గేట్లు బార్లా తెరిచారు. నల్లమలను నాశనం చేయడానికి మన పాలకులే సామ్రాజ్యవాదులకు ఎర్ర తివాచీలు పరిచి స్వాగతం పలుకుతున్నారు. ప్రపంచీకరణ, ప్రయివేటీకరణ పేరుతో ఈ విధానాలు అమలు జరుగు తున్నాయి. సూటిగా చెప్పాలంటే సామ్రాజ్యవాద దేశాలకు మన దేశాన్ని తాకట్టు పెట్టటమే కాక అంతర్జాతీయ విఫణిలో అమ్మకానికి పెట్టి కేంద్ర, రాష్ట్ర పాలక వర్గాలు గులాములుగా వ్యవహరిస్తున్నారు. ఈ వినాశకర అభివృద్ధి తవ్వకాలకే మొగ్గు చూపుతున్న ప్రభుత్వ వైఖరిని ఎదిరించకుండా చూస్తూ ఊరుకుంటే మరో పదేళ్ళలో నల్లమల ప్రాంతమంతా నామ రూపాల్లేకుండా పోతుంది. విదేశీ బహుళజాతి కంపెనీలు అమ్రాబాద్ అడవులలోని ఆదివాసీ, ఆదివాసేతర ప్రజల అస్థిత్వాన్ని వల్లకాడుగా మార్చడానికి సిద్ధంగా ఉన్నారు.

ఎన్నో వీరోచిత పోరాటాలకు పురుడు పోసిన పురిటిగడ్డ నల్లమల. పోరాట సారధులై "జల్ జంగల్ జమీన్" అని నినదించిన కొమరంభీం నినాదాన్ని ముక్త కంఠంతో నినదిస్తూ నల్లమల అస్థిత్వ పోరాటం సాగించాల్సిన బాధ్యత మనందరిది.

★ **రచయిత: పీజీ విద్యార్థి, ఓయు**

# యురేనియం తవ్వకాలు-పర్యావరణ విధ్వంసం

ముత్తన్నగారి రాజేందర్ రెడ్డి

నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రకృతి-సమాజాల మధ్య అగాధం పెరగడం వల్ల "ఆవరణ వ్యవస్థలు" విధ్వంసం అవుతున్నాయి. అవి అడవుల విధ్వంసం కావచ్చు, జీవ వైవిధ్యం కావచ్చు, కోరల్ రూఫ్స్ కావచ్చు, ఓజోన్ పొర విధ్వంసం కావచ్చు, సముద్రాలు కావచ్చు, ఇలా ఆవరణ వ్యవస్థలు విధ్వంసం అవుతున్నాయి. జనాభా పెరగడం కావచ్చు, మానవ కాలుష్యం వల్ల కావచ్చు. ప్రకృతి-సమాజాల మధ్య అగాధం ఏర్పడి పర్యావరణం విధ్వంసం అవుతుంది.

సూర్యగోళం నుంచి ఒక యురేనియం ఆస్టరాయిడ్స్ భూమిని డీకొట్టడం వల్ల భూమిమీద "డైనోసార్స్" జాతి అంతరించాయి. యురేనియం ఖనిజం భూమి అంతర్భాగంలోకి వెళ్లడానికి ఎల్ఏకేఎస్‌హెచ్ఏఎల్ఏ సంవత్సరాల సమయం పట్టింది. ప్రకృతిలో వున్న 92 సహజ సిద్ధ మూలకాలలో యురేనియం ఒకటి. ఈ యురేనియం అస్థిర స్వభావం కలిగి వుంటుంది. అడవులలోని భూ అంతర్భాగం, తీరప్రాంతాలు, గట్టిరాతినేలల్లో 'యురేనియం' భార లోహ ఖనిజం ప్రపంచ వ్యాప్తంగా ఇమిడివుంది.

ఈ 'యురేనియం' నిల్వలు కెనడా, రష్యా, అమెరికా, నైజీరియా, భారతదేశంలో వున్నాయి. భారతదేశంలో ఈశాన్య రాష్ట్రాలు, మధ్య భారతంలో తూర్పుకనుమలు, పశ్చిమ కనుమలలో యురేనియంతో పాటు అనేక రకమైన ఖనిజ లోహాలు ఈ ప్రాంతంలో వున్నాయి.

ఆదివాసులు అనాదిగా అడవులలో జీవిస్తున్నారు. వారు ప్రకృతి-సమాజాల మధ్య ఆగాధం రాకుండా "ఆవరణ వ్యవస్థల"ను కాపాడుతున్నారు.

వీరు కేవలం ఆహార పోషణకే ప్రాధాన్యత ఇస్తారు. కాని ఆహార ఉత్పత్తి విస్తారంగా పెంచడానికి భూసారం నిస్సారం కావడానికి వీరు నిరాకరిస్తారు. అడవితో అనుబంధంగా బతుకుతూ, అడవిని, పర్యావరణాన్ని కాపాడుతున్న వారిని అడవి నుండి గెంటివేయడం ఒక 'విద్రోహంగా' చెప్పవచ్చు. అందులో భాగంగా మనపాలకులు "అభివృద్ధి" ముసుగులో యురేనియం నిల్వల తవ్వకాలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహాయ సహకారంతో 'యురేనియం' తవ్వకాలు ప్రారభించుటకు సిద్ధపడుతున్నారు. దీని వెనుక "ప్రపంచబ్యాంక్" ప్రపంచమార్కెట్ అనేది నాలుగు రూపాలలో విజృభించడానికి సిద్ధమయింది.

1. ఉత్పత్తి కేంద్రాల రూపంలో
2. ముడి సరుకుల రూపంలో
3. కారుచౌక శ్రమ రూపంలో
4. పెట్టుబడి రూపంలో (నగదు)

''మార్కెట్''ను క్రింది స్థాయికి విస్తరించడానికి ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నది. అందులో భాగంగా 'ముడి సరుకుల' రూపంలో సహజవనరులను విధ్వంసం చేసి తరలించుకపోతుంది. అందులో భాగంగా మన తెలంగాణ రాష్ట్రంలో నేడు "అభివృద్ధి" ముసుగులో యురేనియం తవ్వకాలు ప్రారభించాలని చూస్తున్నారు.

## యురేనియం లోహం చారిత్రక నేపథ్యం

ప్రకృతిలో లభించే సహజ సిద్ధ "మూలకాలు"(92)లలో అతి బరువైన లోహం యురేనియం. ఇది భూమి లోపల వున్నప్పుడు ఎలాంటి ప్రమాదం లేదు. భూమి నుండి రెండు పద్ధతులలో దీనిని తీయటం జరుగుతుంది. ఒకటి ఓపిఈఎన్ టచ్ మెథడ్ ఐడిఐ భూమి పైన తవ్వటం జరుగుతుంది.

రెండవ పద్ధతి ISL రేడియో దాతువుల ధార్మికత వల్ల అణువులు నిలకడగా వుండవు. ఈ అణువులు విస్ఫోటనం చెందడం వల్ల అంతులేని "అణుధార్మికత" వెలువడుతుంది. ఈ కిరణాల నుంచి వెలువడిన రేడియో తరంగాల వల్ల జంతు, వృక్ష, పక్షుల జాతి ఉనికి ప్రశ్నార్థకమవుతుంది.

యురేనియం క్రషింగ్లో వెలువడే ధూళిని అణుధూళి అంటారు. దాంట్లో B కిరణాలు అనే సూక్ష్మ అణువులు వుంటాయి. ఇవి కంటికి కంపించవు. మనం పిల్చుకొనే గాలిలో, నీటిలో, తినే ఆహారంలో చేరి మానవుల ఆరోగ్యాన్ని నాశనం చేస్తాయి. అలాగే "పర్యావరణ వ్యవస్థలను" విధ్వంసం చేస్తాయి. ఇవి కేవలం రెండు విషయాలలో కొద్దిగా ఉపయోగపడుతాయి. అంతే తప్ప దీనివల్ల ప్రయోజనం శూన్యం.

యురేనియం''ను భూమి లోపల వున్నంతవరకు పర్యావరణానికి ఎలాంటి నష్టం లేదు. కానీ భూమి నుండి తీయటం వల్లనే ఈ ఇబ్బందికరమైన విధ్వంసం జరుగుతుందని

చెప్పవచ్చు. యురేనియం 'అణుబాంబు'ల తయారీలో వాడటం జరిగింది. దాని వ్యర్థ పదార్థాల వల్ల మూడు రకాలైన ఆవరణ వ్యవస్థలు విధ్వంసమవుతాయి.

1. లితోస్పియర్ (భూవరణం)
2. హైడ్రోస్పియర్ (జలావరణం)
3. అట్మోస్పియర్( వాతావరణం)

యురేనియం ఒక అర్థ జీవిత కాలం కలిగి వుంటుంది. ఒక యురేనియం అణుధార్మికత 75 వేల సంవత్సరాలు అయితే ఆ 75 వేల సంవత్సరాల వరకు చుట్ట పక్కల ప్రాంతాలకు వెళ్లడానికి వీలులేదు ఆ చుట్టు ప్రక్కల జంతు, వృక్ష, పక్షి, మానవ జాతి వునికి వుండదు. ఇలాంటి పరిస్థితులు 1984లో రష్యాలోని చేర్నుబీలు ప్రాంతంలో అణుధార్మికత బయటికి వచ్చి 15 లక్షల మంది మరణించటమే గాక జంతు, వృక్ష, పక్షి జాతి విధ్వంసమవడం వల్ల మనకు ఈ విషయం తెలిసింది.

ఏ యురేనియం మూలకాన్ని అయితే మనకు పరిచయం చేశారో ఆ శాస్త్రవేత్తలైన మేడమ్ క్యూరీ దంపతులు అసహజ మరణం పొందారు.

2011 ప్రాంతంలో జపాన్‌లోని ప్రకోషియమ్ ప్రాంతంలో "అణుకేంద్రం నుండి విడుదలైన అణుధార్మికత వల్ల దాదాపు ఆ ప్రాంతంలో 2/3 వంతు ప్రజలు మరణించారు.

అంతేగాక జంతు, వృక్ష, పక్షి, మానవ జాతి విధ్వంసం వల్ల మనం ప్రత్యక్షంగా వీక్షించాము. అంత సాంకేతికంగా ప్రత్యామ్నాయ మార్గలైన సౌరశక్తి, పవనశక్తి, తరంగశక్తి వాడుకోవలసిన అవసరం వుందని ఆ వ్యవస్థను అభివృద్ధి చేయవలసిన అవసరం వుందని పెద్ద యెత్తున "చర్చ" జరుగుతున్న ఈ సందర్భంలో అక్కడ వదిలివేసిన "అణు కుంపటి" మన దగ్గర నిర్మించదలచి అతి ఉత్సాహంగా ఉన్న మన పాలక ప్రభుత్వాలను ముఖాముఖిగా ప్రశ్నించాలి.

ఈ యురేనియం తవ్వకాలు నల్లమల అడవుల్లో కావచ్చు. దేశంలో ఎక్కడైనా తవ్వినప్పుడు దేశ మూల వాసులైన ఆదివాసులు, ఆ ప్రాంతంలో వున్న గిరిజనేతరులు అంతరించి పోతారనేది వాస్తవం.

యురేనియం తవ్వకాల వల్ల జరిగే ప్రయోజనం ఒక వెంట్రుక వాసైనా లేకపోగా, నష్టం మాత్రం సముద్రమంత వుంది. యురేనియం తవ్వకాలను ఆపివేయాలని ప్రపంచ వ్యాప్తంగా అనేక సంస్థలు చెప్తున్నాయి. అందులో ఐపిసిసి (Internet Planet Climatic change) తీవ్రంగా హెచ్చరించింది. ఈ తవ్వకాల వలన105 సెల్సియస్ నుంచి 305 సెల్సియస్ వరకు ఉష్ణోగ్రత పెరగవచ్చని ఆందోళన వ్యక్తం చేసింది. అంతే కాకుండా 2015లో "పారిస్" సమావేశంలో మన దేశ పాలకులు పర్యావరణానికి విఘాతం కలిగించమని ఒప్పందాలు చేసుకున్నారు.

ఇటువంటి పరిస్థితులలో యురేనియం తవ్వకాలు ప్రారంభించాలనుకోవటం తన చెట్టు కొమ్మను తానే నరుక్కోవటమే గాక ఈ యురేనియం తవ్వకాలపై పెద్ద యెత్తున చర్చ జరపవలసిన అవసరం వుంది. అందుకు రచయితలు, విద్యార్థులు, బుద్ధి జీవులు, సామాజిక కార్యకర్తలు, ఉపాధ్యాయులు పౌర సమాజం యుద్ధ ప్రతిపాదిక మీద నడుంబిగించవలసిన అవసరం వుంది.

ప్రకృతి- సమాజాల మధ్య "అగాధం" పెరగడానికి కారణం భూమి "సరుకు" కావటమే. సరుకు రెండు రకాలు.

1. ఉపయోగ విలువ
2. మారక విలువ

ఉపయోగవిలువ కోణంలో "దోపిడి" అంటే భూసారం నిస్సారం కావటమే. ఇది పర్యావరణ సంక్షోభానికి దారి తీస్తుంది. మారక విలువ కోణంలో దోపిడీ అంటే అదనపు విలువ దోపిడీ. అదనపు విలువ దోపిడీ ఆర్థిక సంక్షోభానికి దారి తీస్తుంది.

ఇక్కడ అభివృద్ధి అంటే ఉపయోగవిలువ, మారక విలువ కోణంలో చూడవలసిన అవసరం వుంది. ఇవి రెండు ఒకే చలనంలో ప్రయాణించే రెండు బిందువులు. ఈ రెండు బిందువులు ఒకే సమాజంలో ప్రయాణించే బిందువులని గుర్తించాలి.

ప్రకృతి-సమాజం మధ్య అగాధం పూడ్చలంటే metabalicriet(జీవన క్రియ) పూడ్చాలని "కార్ల్ మార్క్స్" తన ప్రకృతి-మానవుడు గ్రంథంలో, ఇతర రచనలలో కూడా వివరించారు.

ఈ మేటబలిక్రీట్ పూడ్చాలంటే ఆవరణ వ్యవస్థలను రక్షించవలసిన అవసరం వుంది. ఆ ఆవరణ వ్యవస్థలను రక్షించాలంటే (ఆదాన, ప్రధానాలలో) మార్పు రావలసిన అవసరం వుంది. దానికి ఒక్కటే పరిష్కారం. పెట్టుబడిదారి విధానం అమలుకు ప్రత్యామ్నాయంగా జనావాసాల ప్రాతిపదికగా ఒక ఉత్పత్తి విధానం రావలసిన అవసరం వుంది. దానికి ప్రతి ఒక్కరూ తమ భాద్యతగా కృషి చేయవలసిన అవసరం వుంది. దానికి ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా ప్రజలను సమీకరించి బహుళజాతి కంపెనీలు కార్పొరేట్ వ్యవస్థలు అత్యాశకు బలవుతున్న ఈ "ధరిత్రి"ని కాపాడటానికి ఒక విశాలమైన పర్యావరణ వర్గ ఉద్యమాన్ని నిర్మాణం చేయవలసిన అవసరం వుంది.

★ రచయిత: పరిశోధక విద్యార్థి T

# స్వాతంత్ర్యం - ప్రజా విమోచనం

కోబాడ్ గాంధి

(గత సంచిక తరువాయి)

## నూతన విలువలు - నూతన మానవుడు

'మనిషి ద్వారా సత్యాన్ని కోరుకునే ముందు సత్యాన్ని కనుక్కో. దాన్ని అనుసరించే వారెవరో తెల్సుకుంటావు' - అల్‌గజాలి

కన్‌ఫ్యూషియస్ బోధనలు చెప్పేవేమంటే జీవితం వైపు సాగే సాధారణమైన, సెక్యులర్ మరియు అహంకారం లేని స్వభావం అనేవి నీతి వేరులోనివే –లీ సిద్ధాంతం సామాజిక న్యాయం జ్యోరాస్ట్రియన్ చరిత్ర గుండా వెళ్తుంది. చెడుతో పోరాడడం దాని సారాంశం. గతాస్ మంచిచెడులను వేరు చేస్తూ పేదలను చూసుకోవడంలోనే ఉంటారు – ప్రొ. స్కెజెవో

అతనికిష్టమైన గుణం – సాధారణత్వం

అతని లోభితత్వం – వశమవడం

చెడుపట్ల అతని అసహ్యం – దాసత్వం – మార్క్స్

ఐదేండ్లకంటే ముందు అనురాధ స్క్లెరోసిస్ వ్యాధితో బాధపడుతున్నట్లు నిర్ధారణ అయ్యింది. ఇది ఆమె అవయాలను పాడుచేస్తూ, ఆమె చేతివేళ్లకు తీవ్రబాధ కల్గిస్తూ, మోకాలినొప్పితో ముంబాయిలో విల్ స్టేషన్లలోని ఓవర్ బ్రిడ్జెస్ ఎక్కడంలో తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నది. అయినప్పటికీ మార్చ్ 2008లో 'మహిళల స్థితిగతులు – పురుషాధిక్యత' అనే అంశంపై క్లాసు తీసుకోవాల్సివుందని చెబితే ఎంతో ఇష్టముతో జార్ఖండ్ దట్టమైన అడవిలోకి కష్టపడి నడిచిపోయింది. ఆమె ట్రైబల్ బాలికలతో గడుపుతూ, వారి సమస్యలను చర్చిస్తూ వాళ్ళతో ఉండి తిని, వాళ్లతో పడుకుంటూ పదిరోజులు గడిపింది.

తర్వాత తెల్సిందేమంటే అనురాధతో వాళ్లు ఎంతగానో కలిసి, ప్రేరణపొంది మరి కొద్దిరోజులు వాళ్లతో గడపమని కోరినట్లు ఒక వార్త తెలిసినది. చివరకు ఆమె వెళ్లిపోయేరోజు చాలామంది ఆమెతో కలిసి సాధ్యమైనంత దూరం వరకు నడిచి వచ్చారు. మోకాళ్ల నొప్పివల్ల రాళ్లు రప్పలున్న బాటగుండా ఆమె చాలా కష్టంగా కుంటుతూ వచ్చింది. తోడుగా వచ్చిన బాలికలు ఆమెపట్ల బాధగా చూస్తే ఈమె నవ్వుతూ సమాధానమిచ్చింది. ఆమెను కనుచూపు వరకు చూస్తూ, కళ్లలో నీళ్లతో వాళ్లు ఆమెకు బాధగా వీడ్కోలు పలికారు. ఆనాటి క్లాసుల్లోనే ఆమె భయం కరమైన 'ఫాల్సిమెరం మలేరియా వ్యాధి'కి గురై ఆ పిదప 15 రోజులకే ఆమె చనిపోతున్నదనే విషయం వాళ్లకు తెలియదు పాపం.

ఎక్కడకు పోయినా ఇలాంటి ప్రేమాభిమానాలను పొందడం సాధారణ విషయమే. సాధారణంగా ఆమెలాంటి పేరు ప్రతిష్టలున్నవారు అంతటి స్థాయివారిని ఆహ్వానించడం, (భక్తిపూర్వక భయంతో), పొగడడం, భయపడడం సాధారణంగా జరుగుతుంది. కాని చిన్నస్థాయి అనురాధ పేరుప్రఖ్యాతులు సంపాదించాక కూడా వార్తల్లో ఉండలేదామె.

నాగ్‌పూర్‌లో ఉన్నపుడు కూడా ఆమె ఇలాంటి ఆదరాభిమానాలే అక్కడ దళితుల మధ్య నివసించినప్పుడు పొందింది. ఇండోర్ బస్తీలో దళితులతో మమేకమై జీవించింది. అలాగే ఆమె నాగ్‌పూర్ యూనివర్శిటీలో ఎం.ఏ. సోషియాలజీ బోధించినప్పుడు విద్యార్థులు, ప్రొఫెసర్ల ఆదరాభిమానాలు అమితంగా చూరగొన్నది. అలాగే ఆమె పని చేసినపుడు మేధావులు, డాక్టర్లు, లాయర్లు, మానవహక్కుల కార్యకర్తలతోనూ ఎంతో ఆత్మీయంగావుండి అందరితోనూ అభిమాన ధనవంతురాలిగా ఉండేది.

అనురాధ ప్రత్యేకమైన మనిషి. ఆమె కింది వర్గాల వారితో ఎలా అభిమానంగా మెలిగేదో, అలాగే పై వర్గాలు, మేధావులతోనూ(నాటక రచయితలు విజయ్ టెండూల్కర్, సత్యదేవ్ దూబె.. వారి అభిప్రాయాల్లో భేదాలున్నప్పటికీ)తోనూ అంతే చొరవతో ఉండేది.

అసలు అనురాధ మంత్రశక్తి ఏమిటి? కేవలం ఆమె సాదాసీదాతనం, ముక్కుసూటి మనస్తత్వం మొదలగు గుణాలే ఆమె ఎక్కడకు పోయినా వ్యక్తిత్వాన్ని కాపాడి విలువనిచ్చేవి. ఆమె అంత:సౌందర్యం ఆమె ప్రవర్తన. ఆమె పలుకులు ఒక అయస్కాంతంలాగా ఆమె కళ్లలో మెరిసి వ్యక్తులను ఆకర్షించగలిగేది. ఇలాంటి గుణగణాలు ఆమె తెలివితేటలతో

కలగలిసి ఉన్నందున ఎలాంటి సందర్భాల్లోనూ ఆమె ఉన్నా ఒక రోల్‌మాడల్‌గా నిలువగలిగింది.

మార్క్స్ చెప్పిన 'సహజమనిషి'కి, మతవాదులు చెప్పే 'పవిత్రాత్మ' అనేవాటికి అనురాధ దగ్గరగా ఉన్నది. ఇలాంటి వ్యక్తుల గూర్చి జలాలుద్దిన్ రూమీ 'హృదయంలో స్వచ్ఛత ఉన్నవారు దైవ చైతన్యాన్ని పొందుతారు. ఇలాంటి వాళ్లు దేవుని ఉనికిని వాళ్ల శరీర మధ్యలోనే చూడగలరు' అని అంటాడు.

అత్యంత అవినీతి, లోపాయికారితనం, స్వార్థం, మూర్ఖత్వం మొదలగు చెడుగుణాలు ఉన్నప్పటికీ వ్యక్తుల్లో మంచితనాన్ని సాధారణ ప్రజలెప్పుడు గుర్తు పెట్టుకుంటారు. కాని ఇలాంటి ప్రపంచంలో అనురాధలాంటి వ్యక్తి ఈ విలువలను ఎలా పొందగలరు? వీటిని సాధించడంలో ఆమె ఎప్పుడూ పోరాటం చేసిందిలేదు. సహజంగా ఆమెతో నిలిచాయి. ఒకవేళ 'సామాజిక అస్తిత్వం చైతన్యాన్ని నిర్ణయిస్తే' మరి గబ్బుపట్టిన వాతావరణంలో స్వచ్ఛమైన చైతన్యం ఎలా సాధ్యం? (ముఖ్యంగా కుళ్లిపోయివున్న ఈ నయా ఉదారవాద యుగంలో) మన మధ్య గుర్తించకుండా ఉన్న వేలాది మంది అనురాధల గూర్చి ఏ రకంగా చెప్తారు?

పాలకుల పాలనా ఆలోచనలు ప్రతి సమాజంలోనూ వారికి తగ్గట్లే వుంటాయి. అంటే – వర్గం – ఏదైతే సమాజానికి శక్తిగా వుంటుందో – అదే సమయంలో పాలకపక్షం మేధావిశక్తి కూడా వుంటుంది. వర్గం తన చెప్పుచేతుల్లో వుండే ఉత్పత్తి విధానాన్ని కల్గివుంటూ అదే సయమంలో మేధోసంపత్తిపై నియంత్రణ కల్గివుంటుంది. ఇక్కడ సాధారణంగా చెప్ప దల్చుకుంటే మానసిక అభివృద్ధికి సంబంధించిన ఆలోచనలు కొరవడిన వ్యక్తులు దానికే అనుసంధానం చేయబడతారు. పాలక పక్షానికి సంబంధించిన వ్యక్తులు ఇతర విషయాలతో పాటు చైతన్నాన్ని కల్గివుండి ఆలోచించగల్గుతారు. కాబట్టి వారు ఒక వర్గంగా పాలిస్తూ ఆ కాలాన్ని, శకాన్ని నిర్ణయించి నియంత్రించేవారుగా ఎదుగుతారు. ఇదంతా వారు శక్తి మేరకు చేస్తారు. మరోమాటలో చెప్పాలంటే వారు మేధావులు (ఆలోచనాపరులు) గా పాలిస్తారు. ఆలోచనలను కల్గించేవారుగా –వాళ్ళ వయసు వారి ఆలోచనల్ని రెగ్యులేట్ చేస్తూ పంచు తుంటారు. కాబట్టి వాళ్ళ ఆలోచనలే ఈ శకపు పాలకుల ఆలోచనలు.

ఈ రోజుల్లో దీన్ని మనం మనచుట్టూ చూస్తుంటాం. ఇది తీహార్ జైల్లాంటి ప్రదేశంలో ఇంకా స్పష్టంగా చూస్తాం. ఇక్కడ 'సత్యం' ఒక అరుదైన వస్తువు. తప్పుడుదనం ఒక విధానం. కాని ఇక్కడ కూడా గతంలో మాకు సహాయ సహకారాలందించిన బబ్లూ లాంటి ముత్యాలను ఇక్కడి సిబ్బందిలో చూడగలం. మనిషిలోపల అంతర్గతంగా మంచితనం ఉంటుంది. కాని చుట్టూ వాతావరణం వల్ల అవినీతిమయ మవుతుంది. కొందరిలో మంచిగుణాలే బలంగా ఉన్నప్పటికీ చుట్టూవున్న వాతావరణం, విలువల సంబంధం వల్ల అతను చెడువైపుపోయే అవకాశముంది.

సాధారణంగా – సమాజంలో చాలా మంది నెగెటివ్ (ప్రతికూల) విలువలు (అంటే పాలకపక్ష ఆలోచనలు) కల్గివుంటారు. కాని వారు కూడా కావలసినంత మంచితనాన్ని కల్గివుంటారు. దీన్ని కాపాడుకోవాలని వాళ్లు తాపత్రయ పడుతుంటారు. నూతన ఆవిష్కరణలు కోరుతూ సమాజంలో మార్పులను కాంక్షించేవాళ్లు చెడును దూరం చేస్తూ, మనుషుల్లో ఉన్న మంచి గుణాలపై సమాజనిర్మాణం చేయాలి. ఈ నూతన ఆవిష్కరణలు, నవమానవుని వల్లనే నూతన సామాజిక, ఆర్థిక నిర్మాణం నిలకడగా ఉండగలదు.

చరిత్రలో మనం సామాజికార్థిక విషయాల మార్పును చూస్తాం. యుగాలుగా ఎన్నో ఉద్యమాలు ధీరోధాత్తులు ఎంత కృషి చేసినప్పటికీ విలువల విషయానికొస్తే మనిషి అపజయం పొందుతున్నాడు. చివరకి సోషలిస్టు వ్యవస్థలో కూడా ఈ ప్రతికూల విలువలు తిష్ట వేసుకొన్నందున నూతన ఆవిష్కరణలు తలకిందులవుతున్నాయి.

కాబట్టి చాలా ప్రధానమైన విషయమేమంటే మనిషి లోపల ఉన్న 'మంచి' బయటపడి చక్కని సంతోషం పొంద డానికి, నిలకడగల నూతన ఆవిష్కరణల కోసం మనుషులను ఏ విధంగా మార్పుచేయాలి?

సామాజిక, ఆర్థికరంగంలో ఏ మార్పులు వీటికి దోహదపడ్తాయన్నది మనం ఇదివరకే చూశాము. ఈ బాహ్య అంశాలు మార్పుకుదోహదపడే పరిస్థితులైతాయి. కాని నిర్ణయాధికార విషయం మాత్రం నిజమైన పరిమాణాత్మక మార్పుకు దోహదపడేవి అంతర్గత అంశాలే. ఒక విత్తనం సారవంతమైతే మొక్కకు వేళ్లు, అందమైన పుష్పాలను ఇస్తుంది. కాని అది పనికిరానిదైతే ఎన్నినీళ్లు పోసినా ఎంత ఎరువేసినా మొక్కకు జన్మనివ్వదు. మనలోపల ఉన్న అంతర్గత అంశమే చైతన్యం. మన చైతన్యం మారడానికి ప్రత్యేకమైన స్వతంత్రమైన ప్రయత్నం కావాలి. కేవలం సామాజికాంశాలు తీసుకున్నంత మాత్రాన (బాహ్యాంశాలు ) తనకు తాను మారదు. ఈ అంశం మీదనే నా ఈ చివరి వ్యాసంలో చెప్పడానికి ప్రయత్నం చేస్తాను. అదే మంచిని ఎలా ఇముడ్చుకోవాలి, ప్రతికూల విలువలను

ఎలా తగ్గించాలి అన్నవే నేను ఇందులో చెప్పదలచుకున్న అంశం.

కాని ఈ అంశానికి వచ్చే ముందు నేను భారతదేశంలో ఉన్న రెండు సిద్ధాంతాల (పైకి మాత్రం ఒక లక్ష్యంగా కనబడ్తాయో) గూర్చి వివరిస్తాను. అవి గాంధీయిజం, కమ్యూనిజం. మొదటిదానికి చెందినవారు 'సత్యం' మీద వాళ్ల సిద్ధాంతాన్ని ఆధారం చేసుకుంటే, రెండవరకం వాళ్లు వర్గపోరు మీద.

మొదట మనం ఈ అంశాల్లో ఉన్న సంబంధిత విలువల గూర్చి తెల్సుకుందాం. ఆ పిదప నేను విలువల మార్పుకోసం చేపట్టాల్సిన అంశం గూర్చి వివరిస్తాను.

**ఎ) రెండు భావనలు**

'సత్యం' అనేది గాంధియన్ భావనలో కేంద్ర అంశం. దీనికితోడు అహింస, బ్రహ్మచర్యం అంశాలు ఈ సిద్ధాంతానికి భూమికలు. చాలామంది పాక్షిక హిందూ మత మేధావులు సత్యాన్ని కేంద్రంగా చేసుకున్నారు. అన్ని రకాల కమ్యూనిస్టులు కొందరు వర్గపోరాటాన్ని వాళ్ల ప్రధాన అంశంగా తీసుకుంటారు. ఈ రెంటింటినీ చూద్దాం.

**1) విలువలు – సత్యం**

ఇతర విలువలు మరియు స్వేచ్ఛా సంతోషాలవలె 'సంపూర్ణ సత్యం' అంటూ ఏదీ లేదు. ఇది ఎప్పుడూ పరస్పర సంబంధంగల అంశమే. లక్ష్యం మాత్రం 'సత్యం' భావనను ఇంకా పెంచాలి.

చిన్న చిన్న విషయాల గూర్చి మాత్రం సత్యం, అసత్యం అనేవి తొందరగా అర్థం అయ్యేవే. ఒకవేళ నేను 'పెన్సిల్' ను చూపుతూ 'పెన్' అంటే అది అసత్యమే. కాని ఒకవేళ నేను పెన్సిల్‌ను చూపుతూ అది 'లెడ్' (సీసము), కట్టెముక్క మొ॥ అంటే అది అబద్ధంకాదు. కాని అది 'పెన్సిల్' అనే దాన్ని తికమకపెడ్తుంది. కాబట్టి ఈ చిన్న విషయాల్లో కూడా 'సత్యం' అనేది పాక్షికంగా గాని సంపూర్ణం కాదు.

కాని విలువల ఆధారిత లెక్కింపుల్లో ఈ విషయం ఇంకా క్లిష్టతరమైనది. రిటైల్ రంగంలో విదేశీ పెట్టుబడులు (ఎఫ్.డి.ఐ.) చూడండి. నిజమేమిటి? ఇది భారతదేశానికి మంచా చెడా? కొందరు ఇది మంచి అంటారు, మరికొందరు చెడు అంటారు. అయితే సత్యం అనేది కొందరికి (టి.ఎన్.సి., బడా వ్యాపార వేత్తలకు) 'మంచిది ' అయితే మరికొందరికి (చిన్నవ్యాపారులకు, వ్యవసాయదారులకు) 'చెడు'. కాని ఇది కూడా వివాదం చేయబడుతుంది. ఇక్కడ 'సత్యం' అనేది ఎవరికి సేవ చేయాలన్న దానిమీద ఆధారపడుతుంది. మళ్లీ ఇది పాక్షికమే.

శాస్త్రరంగంలో కూడా ఇది (సత్యం) సంపూర్ణంగా అనిపిస్తున్నప్పటికి– ముఖ్యంగా నిరంతరం మారుతున్న ఈ రంగంలో ఇది కూడా పాక్షికంగా (ఇక్కడ విలువల తీర్పులపై ఆధారపడదు). నూతన ఆవిష్కరణలతో నిన్నటి వరకు 'సత్యం' అనుకున్నవెన్నో నేడు 'సత్యం' కాకుండా పోతున్నవి. కాబట్టి శాస్త్రరంగంలోనూ ఇది (సత్యం)పాక్షికమే.

కొందరు 'సత్యం' అనేదాన్ని వాళ్ల మొత్తం సిద్ధాంతానికి కేంద్రంగా భావిస్తూ, దాన్ని ఒక అమూర్తంగా సంపూర్ణమైనదిగా భావిస్తారు. కొన్ని మతాలు సంపూర్ణ సత్యాన్ని దేవునితో సమానంగా భావిస్తారు. కొందరు ఒక సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తూ వాస్తవాల నుండి సత్యాన్ని గ్రహించడమనేది వాళ్ల తత్వానికి కేంద్రమంటారు.

సత్యాన్ని కేంద్రంగా భావిస్తూ నీతి(ధర్మం) గూర్చి ఆలోచిస్తే వాస్తవానికి ఇది వరకు చెప్పుకున్న సద్గుణాలన్నిటినీ మనం నిరాకరించడమే అవుతుంది. కాబట్టి ఉదాహరణకు, నేను అవినీతి, అన్యాయం, అత్యాశ, మూర్ఖత్వం, స్వార్థం గుణగణాలతో ఉండి, 'సత్యాన్ని' సమర్థించగలనా? చేయలేనుగాక చేయలేను. అలాంటివారికి సత్యమనేది వాళ్లకు తగ్గట్లు మలువబడి వాళ్లకనుగుణంగా పనిచేస్తుంది. కాబట్టి విలువల వ్యవస్థ లెక్కింపులో సత్యానికి ఇతర సద్గుణాలు జతకాకుంటే దానికసలు అర్థమే లేదు. తద్భిన్నంగా ఒకవేళ మనం అలాంటి సద్గుణాలను కలిగివుంటే అప్పుడు మన లెక్కింపులు సత్యానికి చేరువుగా ఆటోమేటిగ్గా చేరుతాయి.

'వాస్తవాల'గూర్చి చెప్పాలంటే, అవి వస్తుగత నిజాలు. మనం నిజాల నుండి రాబట్టే 'సత్యం' మాత్రం ఎప్పుడూ సబ్జెక్టివ్ (ఊహాజనితం) మరియు మన ఆలోచనా సరళి, జ్ఞానంపై ఆధారపడి ఉంటుంది. ఏ సమయంలోనైనాగాని ఒక వ్యక్తి తన మానసిక సంసిద్ధతతోనే వాస్తవాలను క్రియారూపానికి తెస్తాడు. అతడు ఆ రకంగా తాను అనుకునే సత్యం వైపు వస్తాడు. కాని మానసిక స్థితిగతులు (మానసిక సంసిద్ధత) వ్యక్తి వ్యక్తికీ మారుతుంటాయి. అందుకొరకే ఒకే రకమైన వాస్తవాలతో భిన్నమైన ముగింపులు వస్తాయి. అందులో మరి ఏది సత్యం? అలాంటి విలువల తీర్పుల్లో సత్యమనేది ఒక విషయం మాత్రమే. అది కూడా వ్యక్తి హేతుకత, అభిరుచులపై ఆధారపడి ఉంటుంది.

కాబట్టి సత్యమనేది విషయము మరియు అనుబంధ విషయాలు అన్నపుడు అది మన విలువలు, అభిరుచుల మరియు జ్ఞాన స్థాయిలపై ఆధారపడుతుంది. అది రిలేటివ్ అన్నపుడు మన అవగాహన ఏ సమయంలోనైనా పరిమితమై

వుంటుంది. గొప్ప అధ్యయనాలు, పరిశోధనల ద్వారా నిరంతరం సత్యాలు కనుగొనబడుతాయి.

ఈ కారణాలచేత 'సత్యాన్ని' ఒక వ్యక్తితత్వానికి కేంద్రం చేయడమంటే అది దారి తప్పడమే అవుతుంది. 'సత్యం' (నిజాయితీ) అనేది చాలా ముఖ్యమైన విలువ. కలకాలం నిలువాలనుకోవడంలో ఎలాంటి సందేహమక్కరలేదు.

**2) విలువలు – వర్గపోరాటం**

సోషలిస్టులు, కమ్యూనిస్టులు మనిషి మంచిగుణాలంటే అతన్ని శ్రామికవర్గ వ్యక్తిగా, చెడు గుణాలుంటే బూర్జువా విలువలని అంటారు. ఖచ్చితంగా నిర్వచించబడకున్నా శ్రామికవర్గ విలువలంటే నా అర్థంలో ఇది వరకు చెప్పిన మంచిగుణాలు అన్నమాట.

వాళ్లు చెప్పే వర్గపోరాట మనేది సాధారణంగా, యాత్రికంగా నిర్వచింపబడేది శ్రామికవర్గం, బూర్జువా వర్గ వ్యతిరేకంగా భౌతిక(చాలా వరకు ఆర్థిక) పోరాటం. మరి బూర్జువా వ్యవస్థలో ఖచ్చితంగా అనుసరించేది. మనలోవుండే ఆలోచనలు బూర్జువా ఆలోచనలే (అంటే –చెడు విలువలు) అని స్పష్టంగా తెలిసేదే.

ఈ ఆలోచనలు బూర్జువా (పాలకపక్షం) వ్యవస్థలో భాగమే. వారి లోపల ఆలోచనలతో సంఘర్షించకుండా వారితో పోరాడడమనేది ఒక అర్థం లేని ఆలోచనే అది ఏ మార్పును కోరని ఓ ఊహాజనిత వాస్తవమార్పు. ఎందుకంటే మనం పాలకవర్గపు ఒక అంశంపైనే పోరాడుతాము కాని మరోటికాదు.

ఇలాంటిది చరిత్రలో జరిగినట్లు మనం చూడలేదా? మనం బూర్జువాలను నాశనం చేస్తాం. కాని మనలోపల ఉన్న (ప్రతికూల విలువలు) బూర్జువా విలువలు పైకి లేచి మనం మరో నూతన బూర్జువాలాగా మారే పరిస్థితి వస్తుంది. ఈనాటి యువరాజులు , చైనా నాయకులు, చైనా నాయకుల పిల్లలు, ఒకప్పటి చైనా రాజు చాంగ్కైషేక్ కంటే ఎంతో పెద్ద సంపదలు కల్గివున్నారని, ఒకప్పటి జార్ చక్రవర్తికంటే ఎన్నో రెట్ల ధనసంపద రష్యాలోని మాఫియా చేతుల్లో ఉంది. ఇదొక జంతుప్రవృత్తి పార్టీలోని స్నోబాల్స్, నెపోలియన్లు కొత్తబాసులుగా పీడకులుగా మారుతున్నారు.

బూర్జువాలను నిలబెట్టే (చెడు) పాలక విలువలు చాలా ముఖ్యమైనవి. వాటిలో కొట్లాడమంటే ఒకరకంగా వారికి వ్యతిరేకంగా పోరాటం చేయడమే. ఈ పోరాటాలన్నీ చాలా తొందరగా గుర్తించగలుగుతాయి. కాబట్టి ఇవన్నీ రిలేటివ్. కాని వాళ్ల విలువలకు వ్యతిరేకంగా పోరాడడమనేది (ప్రతి కూల విలువలు) అంత సులభం కాదు. ఎందుకంటే మనలోపల పొరల్లో అలాంటి బూర్జువా విలువలు, పోరాటం చేసేవారిలో నిక్షిప్తమై ఉంటాయి. అలాంటి 'శత్రువు'ను గుర్తించడం కష్టమైనదే. అలా గుర్తించినప్పటికీ దానితో పోరాటం చేయడం మరింత కష్టమైనది.

కాబట్టి రష్యా, చైనా దేశాల్లో బూర్జువాలతో పోరాటం విజయవంతమైనా, వాళ్ళ విలువలతో పోరాటం అపజయం పాలైంది. తత్ఫలితంగా రెండు వ్యవస్థలు తిరోగమనమయ్యాయి. బాధాకరంగా సోషలిస్టులు, కమ్యూనిస్టులు ఇలాంటి అంతర్గత పోరుకు చాలా తక్కువ విలువనిస్తారు. ఎక్కడో కొంత విమర్శ, స్వీయ విమర్శలాంటి చిన్నవి తప్ప, ఇలాంటివి సాధారణంగా ఎక్కువ ప్రభావం చూపలేవు. ఎట్లంటే క్రైస్తవ ఫాదర్ ముందు తప్పు చేసినట్లు ఒప్పుకోవడం లాంటిది. మనిషిలోపల చేయాల్సిన ఇలాంటి అంతర్గతపోరు గూర్చి ఎలాంటి పద్ధతిగాని, విధానంగాని, వాస్తవ పథకంకానీ ఏవీలేవు. మహా అంటే పెదవులపై ఏదో కొంత సేవ చేసినట్లు చూపడం. న్యాయం కోసం పోరాటం చేస్తున్నవాళ్లు న్యాయంగానే వుండాలి.

కాని ఇది వాస్తవం కాదు. ఒక నూతన న్యాయ ఆవిష్కరణకోసం కచ్చితంగా జరగాల్సిన పని ఏమిటంటే ఆర్థిక, రాజకీయ వ్యవస్థల కంటే బలంగా వేళ్లూనుకొని వున్న విలువలను మార్చడం. దీనివల్ల ప్రజల అంతరంగాల్లో ఆలోచనల్లో మార్పుతోబాటు ప్రతికూల విలువల్ని నాశనం చేస్తూ, అనుకూల విలువలకు బలం చేకూర్చడం. వర్గ సమాజంలో (మార్క్సిస్టు పరిభాషలో) వర్గపోరాటం అనేది అన్యవర్గ ధోరణులకు, ఆలోచనలకు వ్యతిరేకంగా పోరాడడమే. ఒకప్పుడు ఉమర్ ఖయ్యూమ్ ఏమన్నాడంటే 'మనం ఈ విగ్రహం, ఆ విగ్రహం పగులగొట్టడంలో తీరిక లేకుండా ఉన్నాం. కాని మనం పగులకొట్టాల్సిన అతిపెద్ద విగ్రహం మనలోపలే (మన అహం, వ్యక్తివాదం) ఉన్నది.'

విలువలనేవి ప్రతిసమాజంలోనూ పెనవేసుకు పోయినవే. ఈ విలువలు సమాజ మార్పుతోబాటు తప్పక మారాలి. మార్చాలి. ఆధ్యాత్మికవాదులు చాలా వరకు అంతర్గత మార్పు కావాలంటుంటారు. సోషలిస్టులు, కమ్యూనిస్టులు బాహ్య మార్పుపైనే కేంద్రీకరిస్తారు. కాని సమాజం చక్కగా నిలబడి ఉండడడానికి రెండూ కావాల్సినవే.

ప్రస్తుతం పరిమితులు గలిగి యాంత్రికంగా నిర్వచించబడ్డ 'సత్యం' 'వర్గపోరు'ను గూర్చి తెల్సుకున్నాక మార్చవలసిన విలువలను నిర్వచించే విషయం గూర్చి

ఆలోచిద్దాం. వాటిని పొందగలిగే విధి విధానాలను గూర్చి తెలుసుకుందాం. ఇంతక్రితమే నేను నా వ్యాసంలో కమ్యూన్ తరహా విధానం గూర్చి చర్చించాను గనుక ఇక్కడ ఎక్కువగా బాహ్యపరిణామాల గూర్చి చర్చించను. ఇక్కడ అంతర్గత పరిణామాలకు పాటించాల్సిన విధివిధానాలను గూర్చి స్పష్టీకరిస్తాను.

## బి) నూతన మానవుని ఆవిష్కరణ దిశగా

స్వేచ్ఛా సంతోషాల ఉద్యానవన తలుపులు తెరవడానికి కావల్సిన తాళపుచెవి అయిన ముఖ్యమైన విలువల గూర్చి చూద్దాం. సుదీర్ఘ కాలంగా మానవుడు పండ్లూ, అందమైన పుష్పాలున్న ఈ అమూల్యమైన ఉద్యానవనంలోకి ప్రవేశించాడు. గతంలో ఈ స్వర్గద్వారాలు తెరిచే ప్రయత్నాలు చేసినవారు పాశ్చాత్య, దేశీయ ప్రవక్తలు. ఈ మధ్యకాలంలో జరిగిన ప్రయత్నాలు ఫ్రెంచ్ విప్లవం, రష్యా విప్లవం. వీరంతా ఆ బ్రహ్మాండమైన అద్భుతమైన 'తాళపు చెవి' కోసం ప్రయత్నించినవాళ్ళు. ఈ రోజులు ఆ ఉద్యానవనం మనిషిని తప్పించింది. మనిషి ఆ చెత్త, మురికిలో నివసిస్తున్నాడు.

ఒకవేళ ఆ 'తాళపుచెవి' సరిగ్గా అమర్చకుంటే తాళం తెరచుకోదు. ఆ ఉద్యావనవ గేట్లు తెరుచుకోవు. ఆ తాళపుచెవిని సరిగా అమర్చాలంటే ప్రయత్నాల నుండి నేర్వాలి. దానికి తగినట్లు నూతన ఆలోచనలు అలవర్చుకోవాలి. అసలు సమస్యేమిటంటే మార్పును కాంక్షించి, పనిచేసే చాలా మందికి ఆర్థిక, సామాజిక, రాజకీయ వాతావరణం మొదలగు వాటి మీద పథకాలు, విధానాలు, కార్యక్రమాలుంటాయి. కాని ఒక వ్యక్తి విలువల మార్పుకోసం ఏమీ ఉండవు. ఇక సాధారణంగా అనుకునేదేమంటే ఈ మార్పుల కోసం జరుగుతున్న పోరాటాలప్పుడు వచ్చే ఫలితాల్లోని ఏదో ఒక అంశం తనకు తానుగా న్యాయమైన అంశాల మార్పుకు దోహదపడుతుంది. కాని గత అనుభవాలు చూసినట్లయితే, ఇవి జరుగవు. తరచుగా ఈ శక్తులే చేతుల్లోకి అధికారం రాగానే అత్యంత క్రూరులుగా మారుతాయి.

కాని మనకు మనం పరిణామం చెందడానికి ఏ పథకాలు, విధానాలున్నాయి? బాధాకరంగా ఈ రంగమంతా ఆధ్యాత్మిక వ్యక్తులతో నిండిపోయివున్నది. (చుట్టూవున్న సామాజిక, ఆర్థిక అంశాలు ఇలాంటి విలువలను ఉత్పత్తి చేస్తాయనేది వీరు నిరాకరిస్తారు) సరే మంచిది. మనం ఇదివరకే మంచికొరకనుకున్న ఈ గుణాలను మార్చడానికి ఆ ముండ్ల బాట మీదనే వెళ్దాం. పునరుద్ఘాటన అయినా నేను చెప్పేదేమంటే నేను నమ్మే విలువలనే మళ్ళీ పునరుద్ఘాటిస్తాను.

**మౌలికంగా మంచి/సుగుణాల విలువలు :**

నిజాయితీ, ముక్కుసూటితనం, సత్యంగా ఉండడం, స్వార్థం లేకపోవడం, మామూలు విలువలు కల్గివుండడం, బాధ్యతాయుతం, జవాబుదారీతనం, న్యాయంగా ఉండడం.

**ప్రతికూల విలువలు**

అవినీతి, మోసం, కుటిలత్వం, జిత్తుల మారితనం, మూర్ఖత్వం, అత్యాశ, అవకాశవాదం, బాధ్యతా రాహిత్యం, అసూయ, క్రూరత్వం, అన్యాయం మొదలగునవి.

సౌకర్యం కోసం సుగుణాలను నేను 'ఆల్ఫా' అని దుర్గుణాలను 'బీటా' అని పిలుస్తాను.

ఈ విభాగాన్ని నేను మూడు భాగాలుగా విభజిస్తాను.

*1) కోరుకునే మార్పును నేను ప్రయత్నించి విశ్లేషిస్తాను.*

*2) వాడవలసిన విధానం గూర్చి చర్చిస్తాను.*

*3) ఫోకస్ చేయాల్సిన విలువలను వివరిస్తాను.*

మనం ఇప్పుడు ఈ మూడు అంశాల గూర్చి చూద్దాం.

**1) ఆల్ఫా-బీటా సంబంధం :** ఇక్కడ చేయాల్సినదేమంటే బీటాపై ఆల్ఫాను ఆధిక్యం చేయాలి. ఆ పిదప మెల్లగా ఆల్ఫా రాశిని పెంచుతూ, బీటా సారాంశాన్ని తగ్గించాలి. ఇది ప్రారంభించడానికి ముందుగా ఎవరైతే ఆల్ఫాసారాన్ని అత్యధికంగా కలిగివుంటారో వారిపైనే కేంద్రీకరించాలి. కాని అందరి మీద కాదు. బీటా అంశాన్ని ఎక్కువగా కలిగివున్న వాళ్ళు ఎలాంటి మార్పునైన ఎదుర్కొంటారు. తద్భిన్నంగా చాలామంది ఇతరుల్లో జరిగే ప్రక్రియను నిలువరించగలరు.

మొదట ఎంపిక చేసుకొని లక్ష్యం చేసుకోవాల్సిన వాళ్ళు బహుశా తక్కువ సంఖ్యలో ఉండేవాళ్లు అనురాధాలాంటి వాళ్లు. ఇలాంటి వాళ్లే ఆల్ఫా అంశాన్ని అత్యధికపాళ్లలో కల్గివుంటారు. పిదప ఎక్కువ సంఖ్యలో బీటా అంశాన్ని అత్యధిక పాళ్లలో కల్గివుండి, ఎంతోకొంత పరిగణనలోకి తీసుకోబడనంత ఆల్ఫాపాళ్లు కల్గివుంటూ, ఆల్ఫావైపు వెళ్లడానికి ఇష్టపడడం, సంసిద్ధత తెల్పడం మొదలగునవి చేస్తుంటారు.

ఏ మాత్రం మార్పు చేయబడని కొందరు బీటా రకం వాళ్లు ఎదుర్కోబడాలి. వీరిని నెగెటివ్ (ప్రతికూల) చిహ్నాలుగా ఉదాహరిస్తూ వీళ్ల నుండి ఏమీ నేర్చే అంశాలుండవని చూపాలి.

ఇలాంటి మూడు రకాల వ్యక్తులు సమాజంలో, పార్టీల్లో, సంస్థల్లో ఉంటారు. పై విభజన మన ప్రయత్నాలకు దోహదకారిగా నిలబడగలదు.

**2) మార్పు(పరిణామం) అంతర్గతం :** ఆల్ఫా, బీటా అనే ఈ రెండు ఎక్కడో గాలిలో, శూన్యంలో ఉండవు. ఇవి మన పరస్పర సలహా సంప్రదింపుల్లో ప్రత్యక్షమవుతుంటాయి. ఎప్పుడైతే మార్పు అనేది అంతర్గతమో, మార్పు అనేది మన ఇతరుల ప్రకృతితో, ఆ సంబంధాలతో, ఆ మార్పు సంభవమని తెల్సుకోవాలి.

కాబట్టి ఉదాహరణకు నేను చక్కని విషయాన్ని పొందాలనుకొంటాను. దీనికోసం నేను మొండితనం, అహం, గర్వం, ఆధిక్యతాభావం, మొదలగు వాటిని తగ్గించుకోవడం తప్పనిసరి అనేది తెల్సుకోవాల్సిన అంశం. ఈ పరిణామం కూడా కేవలం సీరియస్ రిఫ్లెక్షన్, చైతన్యంతో (ఇతరులకూ, నాకూ) ప్రతికూల విలువలు ఎంత ప్రమాదకరమో తెల్సుకోగలిగితేనే సాధ్యం. ఇది పొందడానికి చాలా రకాల విధానాలు అవలంభించాల్సి వస్తుంది. కాని కేవలం ధ్యానంలో కూర్చొని, మొండితనం, మూర్ఖత్వం తగ్గిందా లేదా అని ఇతరులతో మాట్లాడుతూ తెల్సుకోకుండా ఏదో ఒకరోజు లేచి 'యురేకా ! నేను వినయ విధేయతలు పొందానని అరిస్తే ఏం లాభం? ఏమాత్రం మారే అవకాశం లేదు.

నేను ఇతరులతో క్రమం తప్పకుండా కలిసి మాట్లాడుతూ ఉంటే నా లోపల నా మొండితనం, మూర్ఖత్వం నిజంగా తగ్గిందా లేదా అని చెప్పగలను. తగ్గినా ఎంతమేరకు అని తెల్సుకోగలను. ఉదాహరణకు కొంతమేరకు తెల్సుకోగలిగినప్పుడు నా మొండితనం తగ్గి నా కుటుంబంపై ప్రభావం (అంటే – పురుషాధిక్య అంశంలో తగ్గుదల) ఎంత మేరకు ఉందో చెప్పగలను. కాని కింది కులాల వాళ్ళతో గాని, సంస్థాగత వ్యక్తులతో గాని కలిసి ఉంటున్నప్పుడు నా మొండితనం ఎంత దృఢంగా ప్రతిబింబిస్తున్నదో తెలుస్తున్నది.

కాబట్టి అన్నిరకాల మూర్ఖత్వాలను తగ్గిస్తూ, ప్రయత్నం ద్వారా నిర్మూలించగలగడం (లేక ఇతర ప్రతికూల విలువలు) అంటే నిరంతర నేను, ఎన్నో రకాల వ్యక్తులతో కలిసి మెలసి పనిచేస్తూ, నిజాయితీగా ఉంటేనే సాధ్యమవుతుంది. అప్పుడు మాత్రమే నా ప్రయత్నాలు ప్రతిభావంతంగా పని చేశాయని, నేను ఇంకా గొప్ప వినమ్రతను (లేక ఇతర అనుకూల విలువలు)కల్గివున్నానని చెప్పగలను.

మరోమాటలో చెప్పాలంటే, విలువల్లో మార్పు అనేది మన అంతరంగమే. కాని స్పష్టీకరణలు, లెక్కింపులు, అంచనాలు మొదలగునవి మాత్రం బాహ్యప్రపంచ వ్యక్తుల సాన్నిహిత్యంతోనే, సాహచర్యంతోనే.

**3) మార్పు అనేది లోతైనది :** నిలకడగా వుండడానికి మార్పు లోతుగానే ఉండాల్సింది. నా చేతనా మెదడు అత్యాశగా ఉండ కూడదని చెప్తుంటుంది. కాబట్టి నా ముందు అరు లడ్డూలను పెడితే, నా వంతువి రెండు తీసుకొని మా మిత్రులకు మిగతా నాలుగు పంచుతాను. మరో సందర్భంలో అత్యంత రుచికరమైన ఆరు రసగుల్లాలు నా ముందు పెట్టడంతో అది నేను అదుపులో పెట్టకోలేక నాలుగు తిని మిగిలిన రెండింటిని ఒక్కొక్కటి చొప్పున ఇద్దరు మిత్రులకు పంపిస్తాను. దీని వల్ల తెల్సుకున్నదేమంటే నాలోపల, పరిమితమైన మార్పేవున్నది. నా అత్యాశ అచేతనావస్థలో ఉండి కోర్కె బలంగా ఉన్నపుడు పైకి లేస్తుంది. కాని ఎవరో పట్టుకుంటారనే భయంతో ఇలాంటి అత్యాశను దూరం చేయలేము. కాకుంటే భయంతో నా కోర్కెను, అత్యాశను అణచుకొని రెండు మాత్రమే తీసుకుంటాను. కాని వాస్తవమేమంటే భయంతో రుచికరమైన ఆ స్వీట్లను సమానంగా పంచినంత మాత్రాన నాలోవున్న అత్యాశ పోయిందనికాదు. అది భయంపాత్ర తగ్గించినపుడు మళ్లీ పైకి లేవడం ఖాయం.

ఇదొక చిన్న ఉదాహరణే కావచ్చు. ఇది అధికారం విషయానికి వస్తే ఎలా ప్రత్యక్షమవుతుందో ఈ బ్రహ్మాండమైన భూగోళం పైన చూస్తాం. ఉదాహరణకు నేనొక చిన్న సామాజిక కార్యకర్తగా ఉన్నపుడు నా అహం అంతగా కనిపించకపోవచ్చు, కాని అది నిర్మూలించబడకపోతే, అధికారం విషయానికి వస్తే అతిక్రూరంగా ప్రత్యక్షమవుతుంది. ఈ విషయం మన రోజువారీ జీవితాల్లో చూడమా? పోనీ క్రూరపాలన కాకుంటే నిరంకుశ పాలనలో ఎన్నో రూపాల్లో చూడగలము.

మనం నేర్చుకుంటున్న కీలక అంశం ఏమిటంటే నిజమైన మార్పనేది చైతన్యం, నిజం తెల్సుకోవడం ద్వారానే సంభవం. కాని కేవలం భయం, ఆజ్ఞాపనలాంటి బాహ్యశక్తుల ద్వారా కాదు. నేను నిజాయితీగా ఒప్పుకోవాల్సిందేమంటే ఆల్ఫా విలువల వైపు నా మార్పు (ఇతరులకు కూడా జరుగుతుంటే నేను గొప్పనైన స్వేచ్ఛా సంతోషాల వైపు వెళ్తున్నట్లు భావిస్తాను. అంతమాత్రమే కాదు. అది గొప్పసంతోషాన్ని కల్గించగలిగితే తిరిగి ఆ దారి వైపు మరింత ప్రోత్సాహం దొరుకుతుంది. కాని ఒకవేళ నేను భయంతోనో, ఒత్తిడితోనో ఆల్ఫాను స్వీకరిస్తే అవకాశమొచ్చినపుడు ఇతరత్ర ఆనందాలు పొందడానికి ప్రయత్నిస్తాను. కాబట్టి, ఇదివరకటి ఉదాహరణకు వెళ్తే నేను రెండు రసగుల్లాలు తినేస్తే, తాత్కాలికంగా ఆనందం నేను కొంత పోగొట్టుకొని వుంటాను.

ఇక్కడ ప్రధానంగా చెప్పే అంశమేమంటే మార్పు అనేది లోతుగా ఉంటుంది. అది అచేతనావ్యవస్థ మీద ప్రభావం

చూపుతుంది. ఇది స్వయం చైతన్యం వల్లనే సాధ్యంకాని ఎవరో రుద్దడం వల్ల కాదు.

కాబట్టి ఈ మూడు అంశాలు విధానాన్ని నిర్ణయిస్తున్నపుడు గమనంలో పెట్టుకోవాలి.

**విధానం :** సామాజిక అంశాలపై న్యాయమైన పోరాటాలు చేసినంత మాత్రాన ఆల్ఫా అంశాలు తామంతట తాముగా రాలేవు. ఒక స్పృహతో కూడిన ప్రత్యేక ప్రయత్నం చేస్తేనే ఈ రంగంలో ఇది సాధ్యము. దీని కోసం ఒక ప్రణాళిక వేయాలి. సామాజిక సంస్థల, రాజకీయపార్టీల(మార్పు కాంక్షించేవి), ప్రభుత్వం (నూతన వ్యవస్థలో ఈ విలువల కోసం నిలబడేది) ఇంకా చైతన్యమైన వ్యక్తుల చేతనా పూరిత ఎజెండా బంధువులు, ఉద్యోగులు, వికాస సమూహాలు మొదలగు వాటి ద్వారానే ఇది సాధ్యము.

ప్రక్రియ ప్రారంభమయ్యేంత వరకు ఎవరన్నాగాని సమాజ మార్పుకోసం ఎదురు చూడనక్కరలేదు. ఎవరైనా ఆ ప్రక్రియను ఎక్కడో ఒకదగ్గర ప్రారంభించవచ్చు. ఎందుకంటే ఆ ప్రక్రియనే మార్పుకు దోహదపడ్తుంది. నూతన శకానికి చెందిన 'గురువులు' మధ్యతరగతికి చెందిన వేలాది మంది యువకుల్లో పరాయికరణ, అభద్రతాభావం పెరగడం వల్ల ఆకర్షిస్తున్నారో అలాగే వ్యక్తులు కూడా స్వేచ్ఛా సంతోషాల దారిలో అలాంటి విలువలను ప్రమోట్ చేయవచ్చు. అది విశాల ప్రాదిపదికన రూపొంది ఒక ఆదర్శ ప్రవర్తనా నియమాన్ని కోరవచ్చు.

ఇది రెండు దశల్లో చేయాలి. (1) సాహిత్యం, ప్రసారసాధనాలు, నాటకాలు, పాటలు, నూతన 'గురువుల' ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించుట, (2). చాలా ప్రధానం. (వాళ్ళ సంస్థల లోపల, బయట) సంస్థల ద్వారా, సామాజిక నాయకుల ద్వారా ప్రచారం.

ఇదొక సుదీర్ఘకాలపు ప్రక్రియ. ఏండ్ల తరబడి సాగేది. సమాజం మారిన పిదప కూడా సాగే ప్రక్రియనే. ఆల్ఫాపాత్ర ఎప్పుడూ సంపూర్ణంగా ఉండదు. కాబట్టి దాని అభివృద్ధినే ఆశించాలి. ఈ ప్రక్రియ సమాంతరంగా సాగాల్సింది. న్యాయమైన పోరాటాలతో కల్సికూడా సాగాలి. చేపట్టే విధానము చాలా అభివృద్ధి చెంది చక్కని అనుభవాలపై వాడబడాలి. ప్రస్తుతానికి ఈ మర్పు కోసం నాయకత్వం, చేపట్టాల్సిన విధానం ఈ రెంటింటిపై ప్రస్తుతం కేంద్రీకరిస్తాను. దీని పిదప నేను 'ఆదర్శ ప్రవర్తనా కోడ్' (MCB)ను స్పృశిస్తాను.

**ఎ) నాయకత్వం అంశం :** ఏదేని వెంచర్‌ను విజయవంతంగా చేయడానికి కావల్సింది ఇది అత్యవసరం. సాధారణంగా నాయకత్వానికి కావల్సినవి తెలివితేటలు, సామార్థ్యం మొదలగు వృత్తి సంబంధించి దీన్ని అర్థం చేసుకోగలం. కాని సామాజిక కార్యకర్తలకు గాని రాజకీయ నాయకులకు గాని కావల్సింది మరింత ఎక్కు మోతాదులో ఆల్ఫా అంశం. నిజానికి – రెండవ అంశం రాజకీయ నాయకునికి గాని (ఏ సామాజిక, రాజకీయ సంస్థకైన గాని) చాలా ప్రధానమైనది. ఆ వ్యక్తి సామార్థ్యాలు ఆ పిదపనే.

నాయకుడు ఇతరులకు ఆదర్శంగా ఉండాలి. అతన్ని ఉదాహరణగా చూపాలి. అతడు బీటా అంశాల వైపు నెట్టబడకుండా చూస్తూ పార్టీ, సంస్థ, నిర్మాణాల్లాంటి ఆర్థికలావాదేవీలకు దూరంగా ఉండేటట్లు చూడాలి.

**మంచి నాయకున్ని ఎన్నుకోవడానికి కొన్ని విధి విధానాలు (అతని సామార్థ్యాలకు అదనంగా)**

1) ఆదర్శ ప్రవర్తనా కోడ్ ఒక ఉదాహరణగా వుండాలి. ఆల్ఫా అంశం బీటాపై ఆధిక్యంలో వుండాలి. దీన్ని పెంపొందించడానికి ఓ విధానాన్ని ఎంచుకోవాలి. అది సంస్థ నిర్మాణ, నీతిపై ఆధారపడ్డదై వుంటుంది. వాళ్ళు ఒకవేళ వ్యక్తిగత ప్రచారకులైతే వాళ్ళు వాళ్ళ ప్రవర్తనాతో చాలా గొప్పవారై వుండాలి.

2) తన సత్ప్రవర్తనతో, మంచి గుణగణాలతో పేరు ప్రతిష్ఠతలతో, క్రమశిక్షణతో ఇతరుల్లో నమ్మకాన్ని కల్గించాలి.

3) చిన్నా పెద్దా సమస్యల మధ్య తారతమ్యాన్ని చూడగలగాలి. విశాల హృదయం కల్గివుండి వ్యక్తుల చాటున వారి గూర్చి చెడు మాట్లాడడం, బాతాఖానీ కొట్టడం, చీటికి మాటికి గొడవలు తేవడం మొదలగు అంశాలకు దూరంగా ఉండడం.

4) ఇతరుల పట్ల కన్సర్డ్‌నెస్ కలిగివుండి, బలహీనులు, పేదలపట్ల సున్నితంగా మెలగాలి.

5) న్యాయం, మంచితనం వైపు నిలబడాలి.

6) సత్యం ఎంతటి కఠినమైనా దానివైపే నిలబడి అవినీతి, లంచగొండితనం, మోసం మొదలగు గుణాలను ఏమాత్రం సహించకూడదు.

నాయకత్వ స్థానాల్లో ఉండే వ్యక్తులు ఇలాంటి కొన్ని గుణగణాలను కల్గివుండాలి. నాయకత్వం ఎంత పెద్దవుతుందో ఈ గుణగణాలు కూడా తగ్గట్టు పెద్దవిగానే ఉండాల్సింది.

**బి) విధానం :** దీన్ని మూడు దశల్లో చేయొచ్చు. 1) పెద్దయెత్తున ఆదర్శప్రవర్తనా కోడ్‌ను ప్రచారం చేయడం 2) శిక్షణా తరగతులు వరకు ఇంకా బలమైన పద్ధతిలో చేయడం అంటే చిన్న చిన్న సమూహాలతో చర్చించడం.

మాస్ మీడియాతో సహా అందుబాటులో ఉన్న అన్నిరకాల ప్రసార సాధనాలు వాడుతూ ప్రచారం చేయడం. దీనిలో విస్తృతంగా అవగాహనా ప్రచారం కూడా చేసివుండాలి. పిల్లలకైతే కార్టూన్లు, కామిక్స్ మొదలగు వాటితోబాటు విలువలను నేర్పడంలో ఇంటర్‌నెట్ గేమ్స్ కూడా వాడవచ్చు.

శిక్షణా కార్యక్రమాల్లో ఆల్ఫా అంశాన్ని అలవర్చుకోవడానికి విధానాలు, ప్రాక్టికల్ సెషన్స్ కూడా నిర్వహించాలి. ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన విషయమేమంటే ఎట్టి పరిస్థితిల్లోను ఆజ్ఞాపించడం, బెదిరింపులు ఉండకూడదు. ముఖ్యంగా ఆధునిక శాస్త్రపరిజ్ఞానాన్ని వాడుకుంటూ తనకు తాను ముందుకు సాగేట్లు దోహదపడాలి. ఉదాహరణకు ధ్యానము, హేతుకత – ఉద్వేగాల మధ్య సంబంధాన్ని మరింత బలపడే విధంగా ఈ మధ్య రకరకాల పరిశోధనల ద్వారా మెదడుకు శిక్షణనిచ్చే ప్రక్రియ సాగుతోంది. మెదడు బైట్ మ్యాటర్‌ను పెంచుతూ సృజనాత్మకత, కొత్త న్యూరాన్ల తయారీ, సినాప్సెస్(న్యూట్రాన్స్ మధ్య సంబంధం) నేర్చుకునే విధానాలను మరింత పెంపుదల చేస్తాయి. ఈ అన్నిరకాల పరిశోధనల వలన వ్యక్తులు నూతన విధానాలను అలవర్చుకొని విలువలను పొంది ఉద్వేగాలను నిలకడస్థాయిలో ఉంచుకోగలుగుతారు.

చిన్న సమూహాల చర్చల్లో వివిధ రకాల ప్రజలు తమకు తాము సౌకర్యవంతంగా ఉండి, వారి వారి భయాలు, అభద్రతా భావాలు మొదలగునవి ధైర్యంగా చర్చించుకుంటూ ఆల్ఫా వెలుగులో ఇతరులకు ఇబ్బందులు కలగకుండా మెలుగుతుంటారు. నిజానికి అపనమ్మకమనే ఎడారిలో ధైర్యము అనే ఒయాసిస్సులా వీటిని తొలగించుకోవాలి. శిక్షణా కార్యక్రమాల్లో వాడిన విధానాలనే ఇక్కడ వాడుకోవచ్చు.

చివరగా ఒకరికొకరు ప్రభావం చూపే విధంగా పరివర్తన అనేది వ్యక్తులకు, సామాజికవర్గాకి మధ్య గతితార్కిక సంబంధముండేట్లు అనివార్యమవుతుంది. నూతన సమాజంలో కమ్యూన్ తరహా నిర్మాణం బహుశ పరివర్తనకు దోహదపరుస్తుంది. కాని ప్రస్తుత సమాజంలో వ్యక్తుల కమ్యూనిటిస్థాయి సంస్థలను మన ఆవాస ప్రాంతాల్లో నిర్మిస్తే అవి అక్కడ నివసించేవారి జీవితాల నాణ్యతను పెంచుతాయి. ఈ విధానాలు ఆటపాటలు, యోగా, కరాటే, వ్యవసాయం, చెత్తను తొలగించడం, నీటి వినియోగ నిర్వహణ, సౌరవిద్యుత్తు ఇక్కడ గట్టిగా చెప్పకోవాల్సిన ముఖ్యమైన విషయం ఏదైతే మొత్తం ప్రక్రియకు దోహదం చేస్తుందో ఆ వాతావరణంలోనికి కావల్సిన సహనం అక్కడే మన ప్రతికూల విలువలు (బీటా)ఎలాంటి భేషజాలకు, భయాలకు అవగాహనలకు ఒంటరితనానికి, ఏకవ్యక్తి నియంత్రణ వుండడానికి అవకాశముండాలి. పార్టీలో, సంస్థలో, వ్యవస్థలో, సమూహాల్లో అలాంటి స్వేచ్ఛాయుత వాతావరణం ఎంత ఎక్కువగా నెలకొనివుంటే తొందరగా వ్యక్తి గత పరివర్తనా ప్రక్రియ జరుగుతుంది. చివరకు ఒకరికొకరు ప్రభావం చూపే విధంగా పరివర్తన అనేది వ్యక్తులను , సామాజిక వర్గానికి మధ్య గతితార్కిక సంబంధముండేట్లు అనివార్యమవుతుంది. నూతన సమాజంలో కమ్యూన్ తరహా నిర్మాణం బహుశ పరివర్తనకు దోహదపరుస్తుంది. కాని ప్రస్తుత సమాజంలో వ్యక్తులు కమ్యూనిటీ స్థాయి సంస్థలను మన ఆవాస ప్రాంతాల్లో నిర్మిస్తే అవి అక్కడ నివసించే వారి జీవితాల నాణ్యతను పెంచుతాయి. ఈ విధానాలు ఆటపాటలు, యోగా, కరాటే, వ్యవసాయం, చెత్తను తొలగించడం, నీటి వినియోగ నిర్వహణ, సౌరవిద్యుత్తు, శిశు సంరక్షణ, రోగుల సేవలు మొదలగు వాటిల్లో సహకార విధానాల ప్రయత్నాలను పెంచిపోషిస్తాయి.

సహకార ప్రయత్నాల స్థాయి ఆల్ఫా అంశం కల్గియున్న సమూహానికి ప్రత్యేకించి దాని ముఖ్య అంశాల మీద ప్రత్యక్షంగా అనుపాతం కల్గివుంటుంది.

ఇది ఒక రమారమి సంక్రమించిన ఆలోచనా విధానానికి ప్రక్రియ విధానాల గూర్చి వివరంగా చర్చించాక మనం ఆదర్శ ప్రవర్తనా కోడ్ వైపుకు వెళ్దాం.

**3) ఆదర్శ ప్రవర్తనా కోడ్ (MCB)**

ఈ కోడ్ విధంగా ఆల్ఫా, దానితో ముడిపడి వున్న విలువలు, విధానాలపై ఆధారపడివుండాలి. పరివర్తన కొరకు పనిచేస్తూ ఫోకస్ చేయబడానికి మార్పును కోరుతున్న సమయాన ప్రజలను మూడు విభాగాలకు చెందిన వారిగా భావించాలి.

మొట్టమొదట నాయకత్వ స్థాయిలో వున్న వ్యక్తులు గాని లేదా పార్టీలు, సంస్థలు, సమూహాల్లో ఏదో కొంత అధికారం కల్గివున్న వ్యక్తుల నుండి భిన్నమైన స్థాయిని ఆశిస్తాం. ఈ విభాగంలో (సామర్థ్యాలకు అదనంగా) ఆదర్శ ప్రవర్తనా కోడ్ తప్పనిసరి. ఇలాంటి వ్యక్తుల్లో ఆల్ఫా తప్పకుండా బీటా మీద ఆధిక్యత కల్గివుండాలి. యం.సి.బి. సారాంశం సుమారు 70–80 శాతం ఉండాలి. నాయకత్వంలో ఎవరున్నా సరే వారిని

వెనకకు పిలిచే అవకాశముండాలి. అధికారంలో ఉన్నవారి దగ్గరకు అవినీతి, లంచగొండితనం సులభంగా చేరుతాయి. ఇది చాలా ప్రధానమైనది. ఒకవేళ ఉదాహరణకు తీవ్రమైన వ్యవతిరేకత కల్గివుండి వ్యక్తి సంస్కరణకు అవకాశమివ్వకుంటే (ప్రయత్నాలు చేసినప్పటికీ) అలాంటి వ్యక్తి తప్పక మార్చబడాలి. బహుశ ఆల్ఫాను, యం.సి.బి.ని కొలవడం అంటే ధర్మామీటర్లో, గణితశాస్త్ర లెక్కల్లో కావు. ఇది ప్రజల రమారమి అంచనాలపై ఆధారపడి ఉంటుంది. శాతం, లెక్కలు అనేవి అర్థం చేసుకోవడానికేగాని మక్కీకి మక్కి అన్వయించుకోవడానికి కాదు.

రెండవ విభాగం – ఇది యం.సి.బి. (సామర్థ్యాలకు అదనంగా) కనీసం 50% కలిగివున్న(నాయకత్వ స్థానానికి వెళ్ల గల శక్తిసామర్థ్యాలు వున్నవాళ్లు) క్రియాశీలక వ్యక్తులకు సంబంధించినది. ఇక్కడ ఒకవేళ బీటా ఆధిపత్యం చలాయిస్తే, అవకాశం తప్పకుండా ఆల్ఫా అంశం వైపే గాక ఒక క్రమం తప్పని బీటా తగ్గుదల కోసం కూడా వెనుకకు పిలవడం మొదలగునవి అన్నీ ఒక్కడా వర్తిస్తాయి కాకుంటే కాస్త కరుణ ఎక్కువే.

చివరికి మూడవ విభాగంలో అశేష జనంతో బాటు పార్టీలు, సంస్థలు, వ్యవస్థలోని సాధారణ సభ్యులు చాలా పెద్దమొత్తంలో సామాన్య, కష్టపడి పనిచేసే పౌరులు, సాధారణ ప్రజలు వీళ్ళు ఎక్కువభాగం యం.సి.బి.గాని, ఆల్ఫాగాని వాళ్ళలో కల్గివుంటారు. కాని అధికభాగం కనబడకుండా వుండి, నిరాసక్త పోరాటాలు, పిల్లీ–ఎలుక పరుగులు, ఏకవ్యక్తి ఆధిపత్యం మొదలైన వాటి వాతావరణంతో బీటా ముందుకు వచ్చే అవకాశముంది. వాళ్ళలో వినబడకుండా దాగివున్న అను కూలత్వాన్ని తేవడానికి, విస్తరించడానికి, ఆల్ఫా, యం.సి.బి. విలువలు, విస్తృతంగా ప్రచారం చేయబడాలి. ఇవి ఒక ఆదర్శంగా ప్రదర్శించబడాలి. వారిలోని నాయకత్వంగానీ, క్రియాశీలురు గాని మార్పుకు అనుకూలమైన వాతావరణాన్ని తయారుచేయాలి. వాళ్ళు ఇతరులకు ఆదర్శప్రాయులుగా నిలవాలి.

కాబట్టి రమారమి ఈ మూడు రకాల ప్రజలు సమాజంలో ఉన్నారు.(ఏమాత్రం సరిచేయబడని వారు సమాజానికి గుదిబండల్లాంటివారు ఇందులో చేర్చబడలేదు. వీరిపై దాడి చేయాల్సిందే). ఇది యం.సి.బి. ఆల్ఫా కొలబద్దలతో బేరీజు వేయించాల్సిందేగాని ఇతరత్రా ఏ రకంగాను వీరిని చేయలేదు. ప్రాథమికంగా ఇది క్రియాశీలురకు, ప్రజాసేవకులకు అన్వయిస్తుంది. వృత్తులు చేసుకొనేవారికి సామర్థ్యమే ప్రధాన గణన. వీరికి వారి వృత్తిసామర్థ్యాలు పెద్దయెత్తున వుండే బీటా అంశాలవల్ల చెదిరిపోయే అవకాశముంది. ఉదాహరణకు అత్యాశగల లాయర్లు , న్యాయాధిపతులు, డాక్టర్లు మొదలగు వాళ్ల తెలివితేటలన్నీ కేవలం డబ్బు సంపాదించడానికి వెచ్చిస్తారు. వాళ్ళు ప్రజల రోగాలను ఫణంగా బెట్టి సంపాదిస్తూంటారు. కాబట్టి వృత్తిదారుల్లో కూడా ఆల్ఫా గణమైన రీతిలో పాత్ర పోషిస్తుంది.

ఈ రోజుల్లో యం.సి.బి. ఆల్ఫాలు ఎక్కడా పరిగణనలోకి తీసుకోబడుటకు చాలా వరకు తెలివి తేటలు పరిగణనలోకి తీసుకోబడ్తున్నవి. వీటికి తోడు కులం, అధికారం, డబ్బులు, హెూదా, రికమండేషన్, రక్తసంబంధీకులు చెప్పినట్లు వినడం మొదలగు గుణాలు బాగా పనిచేస్తాయే కాని కేవలం తెలివితేటలు మాత్రమే కావని గుర్తించాలి. ఏదైనా కావచ్చు కాని యం.సి.బి. ఆల్ఫా తప్ప.

ఒకవ్యక్తి దృష్టి ఎట్లా ఎక్కడ ఫోకస్ చేయాలో తెల్సుకున్నాక ఇప్పుడు యం.సి.బి. సారాంశంలో ఏముండాలి అనేదాని మీద కేంద్రీకరిద్దాం. ఆల్ఫా మొత్తం అనుకూల విలువలు కల్గివున్నపుడు, యం.సి.బి.లో వీటిలో కనీసం నేటి సమాజంలో ఒక ఆదర్శంగానైనా వుండాలి. దీన్ని ఆశించడమే చాలా మంది పౌరులకు పొందగలిగే లక్ష్యం.

కాబట్టి అప్పుడు ఈ యం.సి.బి. ఏమి కల్గివుండాలో ఇక్కడ నేను ప్రాథమికంగా వివరించుకోవచ్చు. ఈ క్రింద ప్రధాన అంశాలు.

1) సాధారణత్వం(Simplicity): ఇది నమ్రతను కల్గివుండేట్లు అనివార్యం చేస్తుంది. తక్కువలో తక్కువ అహం లేక గర్వం కూడ వుండొచ్చు. అంటే ముక్కుసూటితనం కలిగివుండి. జిత్తులమారి గుణం, మోసకారితనం మొదలగునవి లేకుండా వుండడం. ఒక సాధారణ మనిషి అంటే అమాయకుడు, తెలివిలేనివాడు అని కాదు. భిన్నరీతిలో చెప్పడమంటే ఇలాంటివారు సృజనాత్మకతకు సంబంధించి గొప్ప శక్తి కలిగివుండి, మెదడులో దురాలోచనలు, చెడు భావనలు ఏమిలేకుండా వుండడం.

2) నిజాయితీ(Honesty): అంటే సత్యానికి నిలబడుతూ అబద్ధాలను, వక్రీకరణలు లేకుండా వుండడం , క్రమశిక్షణ కల్గివుండడం, అవకాశవాదం, అవినీతి, కపటం ఏవీ లేకుండా వుండడం.

3) పరిపక్వత(Maturity): బాధ్యతతో వుండడం , సయమపాలన, వాగ్దానాలను నెరవేర్చడం, విశాల హృదయం,

వీపుచాటు నిందలు చేయకపోవడం, సమయం వృధా చేయకపోవడం మొదలగువి కల్గివుండడం.

4) నిస్వార్థం : ఇది సహ సంబంధం కలిగినది కాని అత్యాశ లేకపోవడం, అందర్నీ ముఖ్యంగా పేదలు, బలహీనులను ప్రేమించడం, లెక్కచేయడం, వారిపట్ల సున్నితంగా మెదలడం మొదలగునవి.

5) న్యాయం (Justice): ఇతరుల విషయంలో న్యాయంగా వ్యవహరించడం, పక్షపాతం, అన్యాయం, పీడించడం మొదలగు వాటిల్లో జోక్యం చేసుకోకపోవడం. ఇతరులు చేసే అన్యాయాలను సహించకుండే విధం.

ఈ ఐదు ప్రధానమైన నీతి సూత్రాలను సమాజంలో చురుగ్గా ంటూ ఇతరులను నడిపించేవారు విధిగా పాటించాలి. అనుకరించే వారందరికీ ఇది ఒక ఆదర్శంగా వుండాలి. వివిధ రకాల రూపాలలో ప్రచారం చేయబడుతూ పిల్లలవలె ముక్కుసూటిగా వుండడం , చురుగ్గా వుండి మానవత్వం దారిన నడవడం అనేది ఒక ఆదర్శవంతంగా వుంటుంది.

### సి) ముగింపు (Conclusion)

స్వాతంత్ర్యం, స్వాతంత్ర్యం అంటూ ప్రతి ఒక్కరు అంటుంటారు. అయినప్పటికీ ఇది పట్టుదొరకదు. కోర్కెల నుండి స్వేచ్ఛ, భయం నుండి స్వేచ్ఛ, క్రూరత్వం నుండి స్వేచ్ఛ, సామాజిక రుగ్మతల నుండి స్వేచ్ఛ, పీడనం నుండి స్వేచ్ఛ (కులం, పురుషాధిక్యత, ఆర్థిక) చివరకు చాలా ముఖ్యమైన మన పరాధీనత నుండి స్వేచ్ఛ.

ఇక్కడ ఇనుప సలాకల వెనుక, భౌతికస్వేచ్ఛ అంటే కొద్ది మీటర్ల దూరం కూడా జరుగలేని స్థితి. మహా అయితే అటు ఇటు దుమ్ములో వున్న ఆ కొద్ది స్థలంలోనే నడవడం. చెట్ల పందిరి కింద కూర్చోని రెండు శతాబ్దాల కిందటి ఆస్కార్ వైల్డ్ పద్యాన్ని జ్ఞప్తికి తెస్తున్నాను.

ప్రతి వ్యక్తి అదే తెల్సుకోవాలంటే
ప్రతి మనిషి కట్టిన ఆ జైలు
'సిగ్గు' అనే ఇటుకలతో కట్టాడని
(ఇనుప) చువ్వలతో ఉండే దాన్ని ఏమి చూడని
ఎలా మనుషుల సోదరులుగా గాయపరుస్తారో
దయాళు చంద్రుని చూడనివ్వని చువ్వలు
మెరిసే ఆ సూర్యున్ని అంధుని చేసే
ఆ నరకాన్ని చక్కగా దాచుకొనే
వాటికోసం ఆ పనులన్నీ జరుగుతాయి
దేవుని బిడ్డ, మనిషి బిడ్డ గాని
ఎప్పుడూ పైకి చూడలేడు
ఆకలి దప్పులు కొద్దిగానైన ఉన్నప్పటికీ
మాకు జైలు గూర్చి శ్రద్ధ అంతంతే
ఎందుకంటే నిర్ధాక్షిణ్యంగా చలిలో చంపేస్తుంది.
రోజులో ఒకరు ఎత్తే ఆ రాయి
రాత్రికల్లా ఒకరి హృదయమవుతుంది
ప్రతివారి గుండెలో అర్ధరాత్రి
ప్రతి సెల్లులో సంధ్యా వెలుగు
ప్రతివాడు వస్తువు కదుపుడో
లేక తాడు తెంపుడో
ప్రతీవ్యక్తి తన నరకంలో
ఇక నిశ్శబ్దం ఆ కఠిన గంటకంటే
చాలా దూరంలో చక్కగా ఉంది
ఏ ఒక్కరి మనిషి గొంతు ఓ చక్కని
మాట పలుకడానికి రాదు
ఆ తలుపు గుండా చూసే కన్ను
నిర్భయంగా కఠినంగా ఉన్నది
అందరూ మరిస్తే..

కాబట్టి చక్కగా ఆస్కార్‌వైల్డ్ దృశ్యీకరించిన స్వాతంత్ర్యం జైల్లో భౌతికంగా పోగొట్టుకోవడం కాదు అది మానసికంగా కూడా.

"మనిషి ఏరకంగా సూటిగా మనిషి పథకం వేసినా
తన ఆత్మను పాపం నుండి శుభ్రపరిచినా
ఎలానో కాని విరిగిన హృదయం గుండా
ఆ ఏసు ప్రభువులోనికి రాని"

ఆనాడు ఆస్కార్‌వైల్డ్ రాసినదే రెండు శతాబ్దాల పిదప నిజమవుతున్నది. అదే ఒక మనిషిని భౌతికంగా, మానసికంగా ధ్వంసిస్తున్నది. అదీ అతి ముఖ్యమైన వ్యక్తి ఖైదీ అయితే తప్ప, న్యాయ, పోలీసు వ్యవస్థ మానవాళి నుండి 'మమ్మీ'లను దూరం చేయడానికి తన చివరి మేకు కూడా మానసిక 'కాఫిన్'కు కొడ్తుంటుంది. ప్రసారసాధనాలు ప్రసారం చేసినట్లో, పార్టీలు, సంస్థలు ఆజ్ఞాపించినట్లో, జైలు బయట కనపడే దాని కంటే కడుహీనంగా వుంటుంది. అక్కడే ఖైదీ తన పరాయితనంలో

బంధించబడి వాకింగ్, టాకింగ్ నిర్జీవి కింద చేయబడుతాడు. నిరంతర నటనకు బలవంతం చేయబడి, అబద్దాలను నమ్మే ప్రతిబింబంగా మనిషి మలచబడ్డాడు. సామాజిక వెలి, పూర్తికాని కోరికలు, ఉద్వేగపు అభద్రతల గోడల మధ్య వ్యక్తి బంధింపబడ్డాడు. డబ్బు గుడిలో బంధింపబడి , మార్కెట్టు దేవుని ముందు సాగిలపడ్డాడు.

సోషలిస్టు వ్యవస్థ కోర్కెలను స్వేచ్ఛను పొందింది. కాని పెట్టుబడిదారీ వ్యవస్థలో మనిషిని దోచుకున్న ఇతర స్వేచ్ఛల పట్ల అపజయం పాలయింది. కాబట్టి అలాంటి వ్యవస్థలు సుస్థిరతను సాధించలేవు. ఎందుకుంటే మనిషి కేవలం సహజాతావసరములైన ఆకలి, సెక్సులతో ఆకలి తీర్చుకునే జంతువు కాదు. మనిషి నిజమైన 'సహజమనిషి'గా ఎదగడానికి అన్ని రకాల స్వేచ్ఛలు కోరుతాడు. తనకు తాను ఇతరులతో, ప్రకృతితో సామరస్య ధోరణిలో జీవిస్తాడు.

అలాంటి స్వేచ్ఛను, ప్రజలు నిజమైన విమోచనాన్ని పొందాలంటే, ముఖ్యంగా ఆల్ఫా విలువలను పొందడం, వాటిని వాడుకుంటూ తన అంతశ్శక్తితో బాహ్య ప్రపంచాన్ని మార్చడం, పుల్లల్లేని చీపురుతో చెత్తను ఊడ్వలేము. మురికి, మురుగు నీరు వాడుతూ కుండలు, పెనాలు శుభ్రం చేయలేము. చెదలుతో తయారుచేయబడ్డ పునాదుల మీద అందమైన భవంతిని కట్టలేము. బాహ్య శత్రువు కంటే అంత:శత్రువు చాలా ప్రమాదకరం. ఎందుకంటే నిశ్శబ్దహంతకి (సైలెంట్‌కిల్లర్).

మన పరదాలు తీసేద్దాం. మన ఉనికిని మారుద్దాం, మనలోవున్న చెడును నాశనం చేద్దాం, మన ఉద్వేగాలను గాయపరిచే అభద్రతలు, భయాల నుండి పారిపోదాం. మన సహజ వాంఛలు, కోర్కెల్లో సామరస్యాన్ని తెద్దాం. ఇలాంటి ప్రక్రియలో స్వచ్ఛమైన, చల్లని స్వేచ్ఛావాయువును, చెదిరిపోయిన విమోచనాన్ని ఆస్వాదిద్దాం.

కాబట్టి వీటన్నింటికి స్వర్గ ద్వారాల తాళాన్ని తీయడానికి ఆల్ఫావిలువల తాళపు చెవిని మలుద్దాం.

మార్క్స్ తన 'Instroduction to Critique of Hegel's Philosophy of Law' అనే పుస్తకంలో చెప్పినట్లు రాడికల్ కావడమంటే వేర్ల దగ్గరి దాన్ని పట్టుకోవడం. కాని మనిషికి వేరు తనకు తనే.

కాబట్టి సామాజిక కార్యకర్తలు, ప్రగతిశీల పౌరులం (అనురాధ 5వ వర్ధంతి సందర్భంగా ఆమెకు నివాళి అర్పించుటకు) 12 ఏప్రిల్, 2013న మనలో ఉన్న ప్రతికూల విలువలను దూరం చేసుకుందామని ప్రతిజ్ఞ చేద్దాం.

ఈ సందర్భంగా తుదిశ్వాస వరకు పాటించిన ఆదర్శ విలువలను జ్ఞప్తికి తెచ్చుకుంటూ ఆమెకు నివాళులర్పిద్దాం.

**స్వేచ్ఛానువాదం: ఎనిశెట్టి శంకర్**

**వ్యాసం ముగిసింది.**


## 'నడుస్తున్న తెలంగాణ'ను ఆర్థికంగా ఆదుకోండి

**నడుస్తున్న తెలంగాణ మీది. మాది. మనందరిది.**
**నొసటి నుంచి రాలిన చెమట చుక్కది. పోరులో చిందిన నెత్తుటి బొట్టుది.**
**అంటరాని వెలివాడది, ఆశయాల బడుగు జీవిది.**
**విద్యార్థులది, అధ్యాపకులది, ఉద్యోగులది,వ్యాపారస్తులది.**
**కనుక ఈ పత్రికను నడపడానికి మీకు తోచిన ఆర్థిక సహాయం చేయండి.**
**పత్రికను పదికాలాలు నిలబెట్టండి**

నడుస్తున్న తెలంగాణలో మీ ప్రకటనలకై సంప్రదించండి


| | | |
|---|---|---|
| చివరి కవర్ (కలర్‌లో పూర్తి పేజి) | : | రూ. 40,000 |
| రెండవ కవర్ (కలర్‌లో పూర్తి పేజి) | : | రూ. 35,000 |
| మూడవ కవర్ (కలర్‌లో పూర్తి పేజి) | : | రూ. 30,000 |
| పూర్తి పేజి (బ్లాక్ & వైట్) | : | రూ. 25,000 |

# జమిలి ఎన్నికలు-ఫెడరల్ వ్యవస్థకు విఘాతం

ఎ.నర్సింహారెడ్డి

బీజేపీని నడిపిస్తున్న సంఘ్ పరివార్ తన ఎజెండాను ముందుకు తీసుకుపోవాలంటే ప్రస్తుతం ఉన్న రాజ్యాంగం అందుకు అనువుగా లేదు. అందువలన దాని ప్రజాస్వామ్య, లౌకిక, సమాఖ్య స్వరూపాన్ని, స్వభావాన్ని సమూలంగా తమకు అనుకూలంగా మార్చుకోవాలనే దుష్ట ఆలోచన దానికి ఉంది. ఈ నేపథ్యంలోనే 2019 సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో అఖండ మెజారిటీతో మోడీ సర్కారు రెండవసారి అందలమెక్కింది. దేశం ఎదుర్కొంటున్న వ్యవసాయ సంక్షోభం, ఆర్థిక మాంద్యం, నిరుద్యోగం, అవినీతి వంటి తీవ్రమైన సమస్యలను పక్కనపెట్టి కొత్త సమస్యను, వివాదాన్ని ముందుకు తేవడం అంటే అసలు సమస్యల నుండి జనం దృష్టిని మళ్లించే ఎత్తుగడతోనే మోడీ ప్రభుత్వం ఒక కీలక ప్రతిపాదనను మరొకసారి తెరపైకి తీసుకు వచ్చింది. అదే జమిలి ఎన్నికలు. ఇంకా చెప్పాలంటే “వన్ నేషన్, వన్ ఎలక్షన్’ అన్న అంశానికి భారతీయ జనతా పార్టీ అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. జూన్ 19, 2019న జరిగిన అఖిలపక్ష సమావేశంలో బీజేపీ ఈ విషయాన్ని లేవనెత్తడం అంటే దానిని అది ఎంత ప్రధానమైన అంశంగా భావిస్తోందో అర్థం అవుతోంది.

మోడీ ప్రభుత్వ ప్రతిపాదన మౌలికంగా మన రాజ్యాంగ సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమైనది. అప్రజాస్వామికమైనది. ఈ ప్రతిపాదన పార్లమెంటరీ ప్రజాస్వామ్య మూలాలనే ధ్వంసం చేస్తుంది. అయినా జాతీయ ప్రజాస్వామ్య కూటమి(ఎన్.డి.ఎ) లోని పార్టీలు, కొన్ని ప్రాంతీయ పార్టీలు ఈ ఆలోచనను సమర్థిస్తున్నట్టుగా కనిపిస్తోంది. చిన్న ప్రతిపక్ష పార్టీలు మాత్రం వ్యతిరేకిస్తున్నాయి. కేంద్రానికి, రాష్ట్రాలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం వల్ల రాజ్యాంగ బద్దమైన ప్రజాస్వామ్యానికి, ఫెడరల్ వ్యవస్థకు విఘాతం కలుగుతుందని వాటిని వ్యతిరేకిస్తున్న పార్టీలు అంటున్నాయి. జమిలి ఎన్నికలు నిర్వహించడం వల్ల రాష్ట్ర ప్రజల సమస్యలు పక్కకు పోయి జాతీయ సమస్యలు ప్రధానమై అధికార పార్టీ నియంతృత్వ ధోరణులు మరింత బలపడతాయన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి.




ఒకే దేశం, ఒకే ఎన్నిక అనే ప్రధాని మోడీ ప్రతిపాదన భిన్న దృక్పథాలతో కూడిన ప్రాంతీయ రాజకీయ పక్షాలను సమాఖ్య స్ఫూర్తి నుంచి పరాయీకరణకు దారితీస్తుంది. మోడీ పాలనలో దేశంలో అన్ని వ్యవస్థలూ విధ్వంసమయ్యాయి. ప్రజా సంక్షేమాన్ని మరిచిపోయిన ప్రభుత్వాలు కొత్త తరహా ప్రచార యంత్రాంగాన్ని ఎంచుకుని ముందుకు సాగుతున్నాయి. చట్ట సభల్లో ప్రతిపక్షం లేకుండా ప్రజల గొంతును నులిమేసే ఉద్దేశంతోనే ప్రజాప్రతినిధుల కొనుగోళ్లు (పార్టీ మార్పిడి) జరుగుతున్నాయి. కేంద్రంలో మోడీ ఏం చేస్తున్నారో, రాష్ట్రాల్లో కొందరు ముఖ్యమంత్రులు కూడా అవే చర్యలకు దిగుతున్నారు. భారతదేశం

విభిన్న సంస్కృతులకు కేంద్రంగా ఉంది. అయితే బీజేపీ ప్రభుత్వం సాంస్కృతిక జాతీయవాదం పేరుతో దేశమంతా ఒకే సంస్కృతిని, ఒకే మతాన్ని, ఒకే పార్టీని, ఒకే నాయకున్ని రుద్దేందుకు ప్రయత్నిస్తోంది.

ప్రజా సమస్యలు పరిష్కారం కానప్పుడు అనివార్యంగా సామాజికార్థిక సంక్షోభాలు, ప్రజా ఆందోళనలు పెల్లు బుకుతాయి. అటువంటి సందర్భంలో అధికారంలో ఉన్న శక్తివంతుడైన ప్రతి నియంత తిరుగులేని అధికారాన్నే కోరుకున్నాడు. నేడు మోడీ మదిలో అదే మెదులుతున్నది. అందుకే అధికార పగ్గాలు చేపట్టిన వెంటనే మోడీ ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను హరిస్తూ, జమిలి ఎన్నికల ప్రతిపాదనను ప్రజల ముందు చర్చకు పెట్టింది. మోడీ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాన్ని నిశితంగా పరిశీలిస్తే మోడీ, అమిత్‌షాల ద్వయం భావోద్వేగ రాజకీయాల్లో ఆరితేరినట్లు కనిపిస్తున్నది. ఎన్నికలను తమకు అనుకూలంగా మలుచు కోవడం ఎలాగో వీరికి తెలిసినంతగా మరెవరికి తెలియదని పిస్తున్నది. జమిలి ఎన్నికల ద్వారా (పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి జరపడం) గరిష్ట ప్రయోజనాన్ని పొందే కుతంత్రంలో మోడీ, షాలు ఉన్నారు. అందువల్ల ఈ ప్రతిపాదనను జాగ్రత్తగా పరిశీలించాలి, చర్చించాలి.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ప్రజలు నిర్ణీత కాలానికి ప్రభుత్వాన్ని ఎన్నుకుంటారు. అయితే బూర్జువా పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో పెట్టుబడిదారీ దోపిడీ వర్గ ప్రభుత్వాలు సుస్థిర ప్రభుత్వాన్ని, అంటే అధికార పార్టీ అత్యధిక మెజారిటీని కోరుకుంటుంది. ప్రజలు సుస్థిర దేశాన్ని, సుస్థిరమైన జీవితాలను కోరుకుంటారు. అంటే బలమైన ప్రభుత్వానికి, బలమైన దేశానికి మధ్య తేడా ఉంటుందని గమనించాలి. లౌకిక, ప్రజాస్వామ్య విలువలను గౌరవించే సమాజం తిరుగులేని మెజారిటీలను, సుస్థిర ప్రభుత్వాలను ఇష్టపడదు. ప్రజాస్వామ్యవాదులు బలమైన దేశాన్ని వాంచించే దేశభక్తులే కానీ, బలమైన ప్రభుత్వాలను కోరుకోరు. అంటే, తుమ్మితే ఊడిపోయే బలహీనమైన ప్రభుత్వాలు కాదు కానీ, ప్రజావ్యతిరేక నిర్ణయాలు తీసుకోబోయే ముందు ఆచితూచి అడుగు వేయక తప్పని భయభక్తులుండే ప్రభుత్వాలనే ప్రజలు కోరుకుంటారు.

ప్రభుత్వం బలంగా ఉంటే ఏమి జరుగుతుందో మనం దేశంలో, రాష్ట్రంలో ఐదేళ్లుగా చూస్తూనే ఉన్నాము. అధికారం చేపట్టి రెండు మాసాలు కాకముందే ఆర్‌టీఐ సవరణ బిల్లు, ఉపా చట్ట సవరణ బిల్లుల వంటి మొత్తం ఏడు చట్టాలకు సవరణలు చేపట్టింది. దుష్టపాలన ప్రభావం అంతా ప్రజల మీదే చూపిస్తున్నది. నియంతృత్వ ప్రభుత్వం ప్రజల కోర్కెలను చెప్పనివ్వదు. నలుగురిని ఒకచోట కూడనివ్వదు 'ఆందోళనలు అనుమతించదు. సమాజ గమనంలో భాగస్వామి కానివ్వదు. అవినీతిమయమైన రాజకీయాలు, పాలనాయంత్రాంగం, స్వార్థపూరితమైన పాలకులకు సంపాదించుకునే అవకాశానిస్తుంది. ప్రజల ప్రయోజనాలను, హక్కులను విస్మరించి స్వలాభంతో పాలన సాగిస్తారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో భిన్న, వివిధ ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించే వేరువేరు పార్టీలు, వాటి మధ్య ఉండే స్పర్థ, ఘర్షణ, వైరుధ్యాలు, అనేక అంచెల రాజకీయ పాలనా వ్యవస్థ కల్పించే వెసులు బాటుగా ఉంటుంది.

## జమిలి ఎన్నికల వాదన కొత్తేమి కాదు

లోక్‌సభకు, శాసనసభకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలన్న ప్రతిపాదన కొత్తదేమీ కాదు. 1982లో ఎన్నికల కమిషన్ ఈ ప్రతిపాదన చేసింది. 1999లో లా కమిషన్ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేసింది. పార్లమెంటరీ స్థాయి సంఘం 79వ నివేదికలోనూ, 2015లో నీతి ఆయోగ్ సభ్యులు రూపొందించిన చర్చా పత్రంలో కూడా ఇదే అంశం ప్రస్తావించారు. అందువల్ల దీనికి రాజకీయ ప్రాధాన్యత వచ్చింది. ప్రభుత్వాలు సమర్థంగా పని చేయడానికి, ఎన్నికల వ్యయం తగ్గించడానికి జమిలి ఎన్నికలే మేలు అన్న అభిప్రాయం వ్యక్తమైంది. ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే ఎన్నికల వ్యయం తగ్గించవచ్చునని, విధాన నిర్ణయాలు తీసుకోవచ్చునని కూడా అంటున్నారు. ఎక్కడో ఒక చోట ఎన్నికలు జరుగుతున్నందు వల్ల ఎన్నికల నియమావళి అమలులో ఉంటుంది. కనుక విధాన నిర్ణయాలు తీసుకోలేకపోతున్నామని చెప్తున్నారు. కానీ ఈ ప్రతిపాదన చేసే వారు రాజ్యాంగ సూత్రాలను, ప్రజాస్వామ్య విలువలను, ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదన్నది జగమెరిగిన సత్యం.

చట్టసభల జవాబుదారీతనాన్ని కాలరాసి, సభాకాలాన్ని వృదా చేసి, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న, అవినీతిలో కూరుకుపోయిన ప్రభుత్వాలపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టేటప్పుడే తదుపరి నూతన సభాపక్షనేతను ఎన్నుకొనే తీర్మానాన్ని కూడా తప్పక ప్రవేశపెట్టాలనే కొత్త షరతును ముందుకు తెచ్చారు. తమ ప్రతిపాదనకు మద్దతుగా లా కమిషన్ ముసాయిదా వర్కింగ్ పత్రాన్ని వుటంకించారు. అలా చేయడమంటే కొత్త ప్రభుత్వాన్ని అదే సభలో వెంటనే ఎన్నుకోగల అవకాశం వుంటేనే సభ, విశ్వాసం కోల్పోయిన ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు ఉద్దేశించిన అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే

అవకాశం ఉంటుంది. అంటే ఆ షరతుతో ప్రజాప్రతినిధులకున్న హక్కును కాలరాస్తున్నారు. తమ విశ్వాసాన్ని కోల్పోయిన ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ఎన్నికైన శాసన సభ్యులు, లోక్‌సభ సభ్యులకున్న హక్కును కాలరాస్తున్నారు.

బీజేపీ అధికారానికి వచ్చినప్పటి నుండి ఒకే దేశం, ఒకే చట్టం, ఒకే సంస్కృతి, ఒకే పన్ను అంటూ వివిధ రకాల జాతులు, భాషా సంస్కృతులు, ఆచార వ్యవహారాలు, సాంప్రదాయాలు కలిగిన భారతదేశ వైవిధ్యాన్ని గుర్తించ నిరాకరిస్తోంది. అతి ప్రమాదకర సంకేతాలను వెలువరిస్తూ దేశం మొత్తాన్ని ఏక జాతీయ చట్రంలో ఇరికించే కుట్రపూరిత స్వభావంతో ముందుకు వస్తుంది. నిజానికి భారతదేశం 29 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో ఫెడరల్ (సమాఖ్య) స్వభావంతో కూడిన రాజ్యవ్యవస్థ కలిగి ఉంది. సామాజికంగా, సాంస్కృతికంగా, భౌగోళికంగా వైవిధ్య భరిత దేశం. ఇప్పటికే కశ్మీర్ ప్రజల స్వయం నిర్ణయాధికార హక్కుపై ఒకవైపు ఉక్కు పాదం మోపుతూ, రెండోవైపు రాజ్యాంగం పూచీపడిన 370 ఆర్టికల్‌ను, 35-ఏ ను రద్దుచేసారు. ఇప్పటికే ఒకే దేశం ఒకే పన్ను అంటూ జీఎస్‌టీని తీసుకువచ్చి రాష్ట్రాల ఆదాయానికి గండికొడుతూ, వాటి హక్కులపై దాడి చేసింది.

### ప్రస్తుత రాజ్యాంగ నిర్దేశం :

రాజ్యాంగంలోని 75(3) అధికరణం ప్రకారం కేంద్ర మంత్రిమండలి పార్లమెంట్ ఉభయ సభలకు సమష్టిగా బాధ్యత వహించాలి. అదే విధంగా ఆర్టికల్ 164(1)ని అనుసరించి రాష్ట్ర మంత్రి మండలి శాసనసభకు జవాబుదారీగా వుంటుంది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం ప్రభుత్వంపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గినా లేదా ద్రవ్యవినిమయ బిల్లు వీగిపోయినా ప్రభుత్వం సభ విశ్వాసాన్ని కోల్పోయినట్లే. అప్పుడు ప్రభుత్వం తప్పనిసరిగా రాజీనామా చేయాల్సిందే. అలాంటపుడు ప్రత్యామ్నాయ ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం లేకపోతే సభను రద్దు చేసి, తిరిగి తాజాగా ఎన్నికలకు వెళ్లడమొక్కటే మార్గమని రాజ్యాంగం స్పష్టంగా చెబుతోంది. లోక్‌సభకు కానీ, శాసనసభకు కానీ నిర్దిష్ట కాల పరిమితి గరిష్టంగా 5 సంవత్సరాలు, కాగా కనిష్ట పరిమితి ఏదీ రాజ్యాంగంలో పొందుపరచలేదు. ఆర్టికల్ 83 (2), ఆర్టికల్ 172 (1) కింద ఈ రెండు సభలకు ఐదేళ్లు లేదా ఆ సభ రద్దయ్యే వరకూ మాత్రమే పదవీలో ఉంటాయి.

రాజ్యాంగపు మౌలిక స్వభావం సమాఖ్య లక్షణమని సుప్రీంకోర్టు పదే పదే హెచ్చరించింది. సమాఖ్య స్వభావానికి అద్దం పట్టేదే రాజ్యాంగంలోని అధికరణ ఒకటి. 'భారతదేశం, రాష్ట్రాల సమాఖ్య' అని నిర్వచించింది. మనదేశంలో రాజ్యాంగం కల్పించిన పౌర ప్రజాతంత్ర హక్కులకు ఉన్న వెసులుబాటు ఏమిటి అన్నది చర్చనీయాంశమే. జమిలి ఎన్నికల ప్రతిపాదనను ముందుకు తోయడం అంటే కొద్దిపాటి జనాభిప్రాయ వ్యక్తీకరణకు ఉన్న అవకాశం లేకుండా చేయడమే. ఉదారవాద పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ ఎంత కాదనుకున్నా ప్రజలకు కొన్ని హక్కులు మిగిల్చింది. కీలకమైన నిర్ణయాల్లో ప్రజల భాగస్వామ్యానికి కొన్ని పరిమితులతోనైనా కొంత అవకాశం ఉంది. ఈ కొద్దిపాటి హక్కులు, అవకాశాలు కాలదన్నటమే బిజెపి ప్రభుత్వం ముందకు తెచ్చిన జమిలి ఎన్నికల లక్ష్యం.

మాజీ రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ ఎన్నికల కమీషన్‌కు చెప్పిన మాటలు ప్రధాని మోడీ శ్రద్ధగా విని ఉంటే ఇందులో రాజ్యాంగపరమైన చిక్కులు వున్నాయని అర్థమై ఉండేది. తగిన రాజ్యాంగ ప్రక్రియను అనుసరించకుండా జమిలి ఎన్నికలు ఒకేసారి అమలు జరపలేరు. మనదేశంలో ఎన్నికల కమిషన్‌కు మాత్రమే దుర్భేధ్యమైన అధికారం ఉన్నది. అందువల్ల ఎన్నికల ప్రక్రియలో అన్యులు జోక్యం చేసుకొనేందుకు వీలుకాదు. స్వయం ప్రతిపత్తిగల ఎన్నికల కమిషన్ మాత్రమే కసరత్తు చేయాలి. రాజ్యాంగంలో ఆర్టికల్ 324 కింద ఎన్నికల కమిషన్‌కు మాత్రమే ఈ ప్రతిపాదనను చర్చించే అధికారా లున్నాయి. అందువల్ల ప్రధాని ఏర్పాటు చేసిన అఖిల పక్ష సమావేశానికి విలువలేదు. రాజ్యాంగంలోని 327 అధికరణ క్రింద సార్వభౌమాధికారం గల పార్లమెంట్‌కు చట్టాలు చేసే అధికారం ఉన్నప్పటికీ ఎన్నికల గురించి కసరత్తు చేసే అధికారం లేదు.

### జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి వ్యతిరేకం

జమిలి ఎన్నికలు నిర్వహిస్తే అనేక రాష్ట్రాల శాసన సభల గడువు తగ్గించవలసి వస్తుంది. అంటే ప్రజాస్వామ్య తీర్పును కాలరాసినట్టే. ఒకవేళ 356వ అధికరణం జోలికి పోకుండా ఏకాభిప్రాయంతో శాసన సభల గడువు కుదించడానికి వీలున్నా అది ఫెడరల్ విధానాలకు విఘాతం కలిగించినట్టే. గతంలో కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ అతిగా ప్రవర్తించినందువల్ల ఏక కాలంలో ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగింది. దాని వల్ల రాజకీయ శక్తులలో మార్పు రావడంతో పాటు ఫెడరలిజం బలపడిన మాట వాస్తవం. రాష్ట్రాలకు విడిగా ఎన్నికలు జరిగితే ఆ రాష్ట్రాల సమస్యల మీద దృష్టి కేంద్రీకరించడం వీలవుతుంది. జమిలి ఎన్నికలు జరిగితే రాష్ట్రాల సమస్యలపై దృష్టి

కేంద్రీకరించడం తగ్గుతుంది. కేంద్ర ప్రభుత్వానికే ఎక్కువ ప్రాధాన్యత వస్తుంది. ఒకే పార్టీ పెత్తనం పెరిగిపోతుంది. విడివిడిగా ఎన్నికలు జరిగితే ప్రజాస్వామ్య ఒత్తిడులకు అవకాశం ఉంటుంది. పైగా రాష్ట్రాలకు విడిగా ఎన్నికలు జరగడం వల్ల కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల్లో ఉన్న లోపాలను సరిదిద్దుకోవడానికీ అవకాశం ఉంటుంది.

జమిలి ఎన్నికలు నిర్వహించాలంటే చట్ట సభల గడువు నిర్దిష్టంగా ఉండవలసి వస్తుంది. కానీ కేంద్రంలో గానీ, రాష్ట్రాలలోని ఒక ప్రభుత్వం మీద అవిశ్వాస తీర్మానం నెగ్గితే మళ్లీ ఉమ్మడి ఎన్నికల క్రమం చెదిరిపోతుంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో చట్ట సభల గడువును ప్రభుత్వ పతనంతో నిమిత్తం లేకుండా మారకుండా ఉండే అవకాశం లేదు. అవిశ్వాస తీర్మానాలు నెగ్గితే కేంద్రంలోగానీ, రాష్ట్రాలలో గానీ మధ్యంతర ఎన్నికలు నిర్వహించక తప్పదు. దీనికి ప్రతిపాదిస్తున్న విరుగుడు ఏమిటంటే అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించేటట్టయితే ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఏమిటో నికరంగా చెప్పాలని, లేదా ఆ శాసనసభ గడువు ముగియడానికి మిగిలి ఉన్న సమయానికి మాత్రమే ఎన్నికలు నిర్వహించాలని అంటున్నారు.

రాజ్యాంగంలో ఇలాంటి ఏర్పాటుకు అవకాశం లేదు. శాసన సభల గడువు నిర్దిష్టంగా ఉంటే సుస్థిరత నెలకొంటుందని అంటున్నారు. ఈ క్రమంలో ప్రజాస్వామ్యం అన్న అంశాన్ని పట్టించుకోవడం లేదు. అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించే వారు ప్రత్యామ్నాయ ప్రభుత్వం గురించి కచ్చితంగా చెప్పాలనడం ప్రజాస్వామ్య సూత్రాలతో రాజీ పడడమే. ప్రజాస్వామ్యంలో బాధ్యతాయుతంగా ఉండడానికి ఎక్కువ విలువ ఇవ్వాలా లేక సుస్థిరతకే ప్రాధాన్యత ఇవ్వాలా అన్న ప్రశ్న కూడా ఎదురవుతుంది. అలాంటి పరిస్థితే వస్తే దొడ్డి దారిన అధ్యక్ష తరహా పాలన వైపు వెళ్లినట్టు అవుతుంది. జమిలి ఎన్నికల వల్ల పెద్ద పార్టీలకు ప్రాధాన్యం ఇచ్చినట్టూ అవుతుంది. పెద్ద పార్టీలకు వనరులు ఎక్కువ అందుబాటులో ఉంటాయి. అప్పుడు ప్రధానమైన రెండు పార్టీల మధ్యే పోటీకి పరిమితం కావలసి వస్తుంది. దీంతో వ్యక్తులకు ప్రాధాన్యత పెరుగుతుంది. ప్రాంతీయ పార్టీల ప్రాబల్యం తగ్గుతుంది.

భారత రాజ్యాంగంలో పేర్కొన్న విధంగా విశ్వాస పరీక్షలో నెగ్గని ప్రభుత్వాన్ని ఆర్టికల్ 83(2)ననుసరించి లోక్‌సభను, 172(1) ననుసరించి అసెంబ్లీని రద్దు చేయాల్సి ఉంటుంది. మరి ఒకేసారి ఎన్నికలు అని చెబుతున్న కేంద్రం ఆయా రాష్ట్రాల అసెంబ్లీ రద్దు అయ్యాక సమస్యలను ఏ విధంగా పరిష్కరిస్తుందన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా ఉంది. రాష్ట్రంలో ఇబ్బందికర పరిస్థితి ఏర్పడితే కేంద్రం గవర్నర్ పేరిట పాలన విధించే అవకాశం ఉందని అర్థం చేసుకోవాల్సి ఉంది. లోక్‌సభ, శాసనసభల కాలపరిమితి పొడిగించడం, తగ్గించడం వంటి చర్యలు పూర్తి ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. అంటే, ఆయా అసెంబ్లీలు ఎన్నికయ్యే వరకు ఆ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని కేంద్రం భావిస్తోందా అన్న అంశం తేలాల్సి ఉంది. కనుక ఈ పరిణామాలన్నీ నిశితంగా గమనిస్తే.. అధ్యక్షతరహా పాలనకు మోడీ సర్కారు తెరతీస్తున్నట్టు కనిపిస్తోంది. చాటుమాటున రాష్ట్రాల్లో రాష్ట్రపతి పాలన పెట్టాలని కేంద్రం భావిస్తోందని అర్థమవుతోంది.

నిర్వహణా సౌలభ్యం కోసం జమిలి ఎన్నికల విధానాన్ని అనుసరించడం అంటే ప్రజాస్వామ్య మౌలికతత్వానికి వ్యతిరేకమే అవుతుంది. సార్వభౌమాధికారం ప్రజలకు లేకుండా పోతుంది. ఎన్నికలను కేవలం ఒక ప్రక్రియలా, తంతులా భావించినట్టు అవుతుంది. ఈ పద్ధతి అనుసరించడం అంటే ప్రజల బాధ్యత కేవలం అయిదేళ్లకు ఒకసారి ఓటు వేయడానికే పరిమితం చేసి ఆ తరువాత ప్రజలకు ఏ పాత్రా లేకుండా చేసినట్టు అవుతుంది. ఆ తరువాత వ్యవహారం అంతా కార్యనిర్వాహక వర్గం చేతిలోనే ఉంటుంది. క్రియాశీలంగా ఉండే ప్రజలు అయిదేళ్ల పాటు వేచి ఉండలేరు అని డా.రాంమనోహర్ లోహియా చెప్పిన మాటను ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి. ప్రజోద్యమాలతోపాటు రాష్ట్రాలలో మామూలు పద్ధతుల్లో ఎన్నికలు జరుగుతూ ఉంటే ప్రజాస్వామ్య భావాలు వ్యక్తం చేయడానికి వీలుంటుంది.

ఈ జమిలి ఎన్నికలు ఆచరణ సాధ్యం కావాలంటే రాజ్యాంగపు మౌలిక చట్రాన్ని మార్చేయాలి. రాజ్యాంగంలోని మౌలిక విలువలైన లౌకికత, ప్రజాస్వామ్యం, సమసమాజం, సామాజిక న్యాయం, చట్టబద్ధ పాలన, సమాఖ్య స్వభావం వంటి వాటిని అటుకెక్కించి హిందూత్వ మను ధర్మపాలన సాగించడమే బీజేపీ లక్ష్యంగా ఉందని గమనించాలి. ఈ ప్రక్రియకు పూనుకునేందుకు బీజేపీ దొడ్డిదారిన ముందుకు తెస్తున్న ఎజెండా జమిలి ఎన్నికలు. దేశానికి ఇప్పుడు కావల్సింది మౌలిక సమస్యల పరిష్కారం తప్ప జమిలి ఎన్నికలు కాదు. 70 ఏండ్లుగా ప్రజల మౌలిక సమస్యలు ఏ ఒక్కటి పరిష్కారం కాలేదన్నది యదార్థం. ప్రజల న్యాయమైన సమస్యలను పరిష్కరించక దాటవేస్తూ, పాకిస్తాన్ బూచీ, కశ్మీర్ సమస్యను చూపుతూ ప్రజా చైతన్యాన్ని పక్కదారి పట్టించడంలో బీజేపీ అగ్రగామిగా ఉంది.

**ప్రజలు చైతన్యవంతులు :**

దేశ రాజకీయ, సామాజిక, సాంస్కృతిక ముఖచిత్రాన్ని,

రాజ్యాంగాన్ని మౌలికంగా మార్చేయాలనే దీర్ఘకాలిక ఆశయం కలిగిన భారతీయ జనతాపార్టీ అందుకు అనువుగా 2022 నాటికి అంటే భారతదేశానికి స్వతంత్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయ్యే సమయానికి, దేశ రాజకీయ పటం అంతా కాషాయమే నిండాలని ఆశిస్తున్నది. అందుకోసమే ఈ జమిలి ఎన్నికల ప్రతిపాదన. తెలంగాణ విషయానికి వచ్చేసరికి ముందస్తు ఎన్నికలు జరుపుకున్న టిఆర్ఎస్ కేంద్రం పెట్టిన సమావేశానికి వెళ్లి జమిలి ఎన్నికలకు జైకొట్టి వచ్చింది. ఆ ప్రతిపాదన మౌలికంగా ప్రాంతీయ పార్టీలకు, స్థానిక ఆకాంక్షలకు ప్రతికూలమని కూడా టిఆర్ఎస్ గుర్తించలేదు. 1967 నుంచి దేశంలో మొదలైన ప్రాంతీయ, సామాజిక రాజకీయ పక్షాల అవతరణ క్రమాన్ని ముగించి, బలమైన, ఏకఛత్రాధిపత్యాన్ని స్థాపించే ఉద్దేశంతో జరుగుతున్న ప్రయత్నాలను అర్థం చేసుకోకపోతే భారతదేశపు బహుళత్వానికి, వైవిధ్యానికి చేటు కలుగుతుంది.

2019 ఎన్నికల్లో రెచ్చగొట్టిన మాదిరి మతభావాలు, విద్వేష ప్రచారం, వుపయోగించుకొనేందుకు పుల్వామా, కార్గిల్ వంటివి ప్రతి సంవత్సరం, ప్రతి ఎన్నికల సందర్భంలోనూ రావు. రెండవది విద్వేష ప్రచారాన్ని ప్రతి సంవత్సరం ప్రతి రాష్ట్రంలో రెచ్చగొట్టడం ప్రారంభిస్తే అది ఎల్లకాలమూ, అన్ని వేళలా ఆశించిన ఫలితాలు ఇవ్వదు. ఒకే దేశం, ఒకేసారి ఎన్నికలు, ఒకే పార్టీ, ఒకే నాయకుడు, ఒకే మతం, అది కూడా హిందూ మతం ఇలా అజెండాను అమలు చేయవచ్చన్నదని బీజేపీ భావన. ప్రస్తుతం అన్ని పార్టీల కంటే అది ఆర్థికంగా, ఇతరత్రా బలంగా ఉంది కనుక ఒకేసారి ఎన్నికలు జరిపితే మిగతా వాటి కంటే ముందుడవచ్చన్న ఆలోచన దానికుంది. ఏకకాల ఎన్నికల ప్రతిపాదనలన్నీ ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలను రద్దు చేసి గవర్నర్ పెత్తనాన్ని, కేంద్ర ప్రభుత్వ జోక్యాన్ని మరింత పెంచే విధంగా ఉన్నాయి.

ఇటీవలి ఎన్నికల్లో ధన బలం విచ్చల విడిగా పెరిగి పోయింది. ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఇవిఎం) విశ్వసనీయత ప్రశ్నార్థకంగా మారింది. భారత్‌లో రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తరువాత జరిగిన ఎన్నికల్లో కేంద్రంలోని ఏ ప్రభుత్వానికి పోలైన ఓట్లలో 50 శాతం లభించలేదు. అనేక దేశాల్లో జరుగుతున్న ఎన్నికల్లో, మొత్తం ఓట్లలో 50 శాతానికి మించి మద్దతు పొందిన రాజకీయ పార్టీలకే ప్రభుత్వం ఏర్పాటుకు అవకాశం లభిస్తుంది. ప్రజాస్వామ్యం అంటేనే అత్యధిక ప్రజల పాలనగా మనం నిర్వచిస్తాం. ఎన్నికల్లో ధన ప్రభావం, కుల మతాల ప్రభావం, అధికార దుర్వినియోగం, పార్టీ ఫిరాయింపులు వంటి అంశాలను అడ్డుకోవడానికి కఠినమైన చట్టాలు తీసుకురావల్సి ఉంది. మెజారిటీ ప్రజలు వ్యతిరేకిస్తున్న ప్రభుత్వాలు ఏర్పాటు అవుతున్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడకు పాక్షిక దామాషా ప్రాతినిధ్య విధానాన్ని ప్రవేశపెట్టడం గురించి తీవ్రంగా ఆలోచించాలి.

నరేంద్రమోడీ మొదటి దఫా అందుకున్న ఘనవిజయం ఒక కొత్త హయాంకు తెరలేసినప్పటికీ, ఆయనకు సర్వంసహా అధికారాన్ని ఇవ్వలేకపోయింది. రాజ్యసభలో మెజారిటీ లేదు. అనేక రాష్ట్రాల్లో ఇంకా ఇతరుల ఉనికి ఉన్నది. రెండోదఫా దేశవ్యాప్త జైత్రయాత్ర చాలా వరకు విజయం అందుకున్నా, ఇప్పటికీ మోడీ ప్రభుత్వానికి కొన్ని పగ్గాలు మిగిలే ఉన్నాయి. అనుకున్నట్లు చేయగలిగే అధికారం కావాలంటే పార్లమెంట్ ఉభయ సభల్లో మూడింట రెండొంతుల మెజారిటీ కావాలి. కేంద్రంలో, రాష్ట్రంలో ప్రతిపక్షం ఉండకూడదు. ఒకేదేశం ఒకే ప్రజ, ఒకే పన్ను, ఒకే విద్య, ఒకే సంస్కృతి అమలు చేయాలంటే తిరుగులేని అధికారం కావాలి. అప్పుడే పాసిస్టు విధానాలతో ప్రజలను ఉక్కుపాదంతో అణచివేయవచ్చునన్న దుర్మార్గపు ఆలోచన బిజెపి ప్రభుత్వం సంఘ్‌పరివార్ దర్శకత్వంలో చేస్తున్నది. ఈ క్రమం ఒకే దేశం ఒకే పార్టీ ఒకే ప్రభుత్వం అనే వరకు వెళ్లనుంది. అందుకోసం కేంద్రంలోను, రాష్ట్రాలలోనూ ఒకేసారి ఎన్నికలు జరపాలనే ప్రతిపాదన మీద జోరుగా ప్రయత్నం జరుగుతున్నది అటువంటి జమిలి ఎన్నికలు, ప్రజల దృష్టితో చూసినప్పుడు శ్రేయస్కరం ఎంత మాత్రం కాదు.

**రాజ్యాంగ సవరణలు అవసరం :**

దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు జరపాలంటే అయిదు రాజ్యాంగ సవరణలు చేయవలసి ఉంటుందని 2018లోనే ఎన్నికల సంఘం కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖకు తెలియ జేసింది. వీటితోపాటు 1951 నాటి ప్రజాప్రాతినిధ్య చట్టానికి సవరణలు చేయాలి. లోక్‌సభ, రాజ్యసభ, రాష్ట్రాల అసెంబ్లీల నిర్వహణా నిబంధనలను (బిజినెస్ రూల్స్) సవరించాలని కూడా పేర్కొంది. రాజ్యాంగానికి చేయవలసిన సవరణలు చేయాలి. లోక్‌సభ, రాజ్యసభ, రాష్ట్రాల అసెంబ్లీల నిర్వహణా నిబంధనలను (బిజినెస్ రూల్స్) సవరించాలని కూడా పేర్కొంది. రాజ్యాంగానికి అనివార్యంగా చేయవలసిన సవరణలు :1. ఉభయ సభల పదవీకాల పరిమితి కుదించడానికి సంబంధించిన 83వ అధికరణకు సవరణ. 2. లోక్‌సభను రాష్ట్రపతి రద్దు చేసేందుకు వీలు కల్పించే అధికరణ 85కు సవరణ. 3. అసెంబ్లీల కాలపరిమితిని కుదించేందుకు సంబంధించిన అధికరణ 172కు సవరణ. 4. అసెంబ్లీల రద్దుకు సంబంధించిన అధికరణ 356కు సవరణ. 5. రాష్ట్రపతి పాలన విధించేందుకు సంబంధించిన అధికరణ 356కు సవరణ.

రాజ్యాంగ సవరణలకు తోడు ఇతర మార్పులకు మరి కొన్ని చేపట్టవల్సి ఉంటుంది. 1. ప్రజా ప్రాతినిధ్య చట్టం 2వ సెక్షన్‌లో 'జమిలి ఎన్నికలు' అన్న పదాన్ని నిర్వచించడం. 2. అవిశ్వాస తీర్మానం (నో కాన్ఫిడెన్స్ మోషన్) అనే పదం తొలగించి కన్‌స్ట్రక్టివ్ వోట్ ఆఫ్ నో కాన్ఫిడెన్స్ అనే పదాన్ని చేర్చాలి. అందుకోసం లోక్‌సభ బిజినెస్ (సభా నిర్వహణ) నిబంధన 198ఎ ని సవరించాలి. శాసనసభ నిబంధనల్లో కూడా ఈ రకమైన సవరణ చేయాలి. 3. లోక్‌సభ లేదా అసెంబ్లీలో ఏ పార్టీకీ తగిన మెజారిటీ రాకుండా హంగ్ సభ ఏర్పడిన పరిస్థితిలో ప్రతిష్టంభన తలెత్తకుండా ఉండేందుకు పేరా 2 (1)(బి)ని తీసివేయాలి. ఈ రద్దును ప్రత్యేక చర్యగా జరపాలి. 4. రాజ్యాంగంలోని 83, 172 అధికరణాలకు సవరణలు, ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్లు 14, 15లకు సవరణలు చేయాలి. లోక్‌సభ లేదా అసెంబ్లీ అయిదేళ్ళ కాలపరిమితి పూర్తి చేసుకోకుండా మధ్యలో రద్దయితే తర్వాత ఏర్పడే కొత్త సభ మొదటి దానిలో మిగిలిన కాలపరిమితి దాకానే ఉండాలి తప్ప మొత్తం అయిదేళ్ళు ఉండకూడదు. అలా చేసేందుకు పై సవరణలు ఉపయోగిస్తాయి. 5. సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ జారీ పరిమితి సవరణ కోసం కూడా ప్రజా ప్రాతినిధ్య చట్టం సెక్షన్లు 14, 15లను సవరించాలి. 6. పై సవరణలన్నింటినీ సగం (50 శాతం) రాష్ట్రాలు ఆమోదించాల్సి ఉంటుంది. అప్పుడు ఈ అంశాలపై న్యాయపరమైన సవాళ్ళు, కేసులు తలెత్తకుండా ఉంటాయి. రాష్ట్రాలకు సంబంధించిన మార్పులను రాజ్యాంగంలోని అధికరణం 328 కింద నేరుగా పరిశీలించ వచ్చు. 7. ఒక నియోజకవర్గం నుంచి నుంచి ఎన్నికైన అభ్యర్థి వెంటనే గానీ, తక్కువ కాలంలోపు గానీ చనిపోతే అలాంటి సందర్భాల్లో గెలిచిన పార్టీయే ఆ వ్యక్తి స్థానంలో తమ పార్టీకి చెందిన విద్యావంతుడైన మరో అభ్యర్థిని సూచించడం లేదా మరణించిన నాయకుడి సమీప ప్రత్యర్థిని అక్కడ విజేతగా ప్రకటించడం అనే ప్రత్యామ్నాయాలను ప్రస్తుతం పరిశీలిస్తున్నారు.

**ముగింపు :**

ప్రపంచీకరణ నేపథ్యంలో కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలకు అనుగుణంగా, నామమాత్రంగా కొనసాగుతున్న రాజ్యాంగ సంస్థలను కూడా ఆటంకంగా భావించి వాటిని తొలగించే ప్రక్రియకు దళారీ పాలకులు పూనుకుంటున్నారు. కారణాలేవైనా 17వ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ప్రమాద ఘంటికలు మోగించాయి. కేంద్రంలో అస్థిర ప్రభుత్వాల శకం ముగిసి 2014 తర్వాత స్థిరమైన ప్రభుత్వం ఏర్పడింది. ప్రముఖ జర్నలిస్టు రాజదీప్ సర్దేశాయ్ పేర్కొన్నట్టు "బీజేపీ అధికారంలోకి రావడమంటే కేవలం ప్రభుత్వాలు మారడం కాదు, 'లౌకిక' భావనలను, ప్రజాస్వామిక విలువలను పక్కకు నెట్టి, దేశంలోని సాంస్కృతిక వైవిధ్యాన్ని తుంగలో తొక్కి కాషాయికరణ పొందిన రాజ్యవ్యవస్థకు దారితీసే ప్రభుత్వం ఏర్పడటం'', ఇది మనందరికీ ఆందోళన కలిగించే విషయమే. అందుకే పెరుగు తున్న హిందూత్వ ఫాసిస్టు విధానాలకు, రాజ్య కాషాయీకరణకు, కేంద్రీకృత అధికారానికి వ్యతిరేకంగా లౌకిక, ప్రజాస్వామిక, విప్లవ శక్తులు పోరాడవలసిందే. ప్రతిఘటించ వలసిందే. రాష్ట్రాల హక్కులూ, సమాఖ్య స్ఫూర్తికి భంగం కలిగే జమిలి ఎన్నికలను వ్యతిరేకించాల్సిందే. ఈ కీలకమైన ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ ప్రజా చైతన్యం పెంపొందించటం, ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ దిశగా ఉద్యమించటం ప్రజాతంత్ర శక్తుల కర్తవ్యం.

భారత్‌లో ఒకే దేశం... ఒకే ఎన్నికలు అనే సూత్రం ఆచరణలో సాధ్యం కాని అంశం. అంతేకాదు ఒకే దేశం, ఒకే ఎన్నికల నిర్వహణకు చట్టబద్ధంగా ఎన్నో సాంకేతిక అడ్డంకులు ఎదురవుతాయన్నది అక్షర సత్యం. ప్రధానంగా ఈ చర్య సమాఖ్య విధానానికి సంకటాలు తెస్తుంది. భారత రాజ్యాంగంలో నిర్వచించబడిన పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి విఘాతం కూడా. మనదేశ ప్రస్తుత ఎన్నికల విధానాన్ని పరిహసిస్తూ ప్రమాదకర అధ్యక్ష తరహా ప్రజాస్వామ్యం (ప్రెసిడెన్సియల్ డెమోక్రసీ) వైపు దేశాన్ని తీసుకెళ్ళేందుకు, తద్వారా దేశాన్ని బ్రాహ్మణీయ హిందూ రాజ్యంగా మార్చాలని మోడీ సర్కారు తీవ్రంగా యత్నిస్తోందని చెప్పకతప్పదు. ఇది ప్రస్తుత పార్లమెంటరీ ప్రాతినిధ్య ప్రజాస్వామ్యాన్ని, లౌకిక స్వభావాన్ని, దేశ సమైఖ్య స్వభావాన్ని మార్చేసేందుకు కేంద్రం పన్నిన కుట్రగా అభివర్ణించవచ్చు. బీజేపీ మాతృ సంస్థ అయిన రాష్ట్రీయ స్వయం సంఘ్ 1925లో ఏర్పాటైంది. 2025 నాటికి ఆ సంస్థకు వంద సంవత్సరాలు పూర్తవుతాయి. ఈ నేపథ్యంలో 2024లో రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో సాంస్కృతిక జాతీయవాద ఎజెండాతో ఎన్నికలు నిర్వహించి, అధికారాన్ని సాధించి, బీజేపీని, మోడీని తీర్చిదిద్దిన ఆర్ఎస్ఎస్‌కు కానుకగా ఇవ్వాలని బీజేపీ కార్యవర్గం నిర్ణయించింది. 2021 నాటికి బీజేపీకి రాజ్యసభలో మెజారిటీ వస్తుంది. అప్పుడు ప్రతిపక్షాల అభ్యంతరాలను తోసిరాదని రాజ్యాంగ సవరణలు చేయాలన్న సంకల్పంతో మోడీ ప్రభుత్వం పావులు కదుపుతుంది. బలహీనంగా ఉన్న ప్రత్యర్థి కాంగ్రెసును మట్టి కరిపించి మూడోసారి అత్యధిక మెజార్టీతో అధికారంలోకి రావాలని, అందుకు 2023 చివర్లో జరిగే జమిలి ఎన్నికల ద్వారా నవ (మనువాద) రాజకీయ భారతానికి నాంది పలుకాలని మోడీ సంకల్పంగా కనబడుతోంది.

T

# జెండా జెగడం

సమీర

'బొంగూ పేలాల్ మక్కజొన్నా పేలాల్, పుట్నాల్, డబల్ రొట్టె.... బొంగూ పేలా..'

'ఓ మియా, జెర నిలవాడు,ఇగో..ఇగో..'

పిలుపులో ఏదో తేడా, ఆదేశ పూర్వక స్వరం, కొనే వాళ్ళు పిలిచినట్లుగా లేదు. హ్యాండిల్‌కు, బ్యాక్ సీటుకూ రెండువైపులా బరువు తక్కు వైనా పేద్ద పరిమాణంల వేలాడుతున్న పాలిథీన్ సంచులతో నున్న సైకిల్‌ను బ్రేక్ వేసి ఆపి, తన బక్కగా ఉన్న, పొడువెక్కువ కాళ్ళను రెండువైపులా నేలకానించి నిలిపాడు. ఐదారుమంది యువకుల గుంపు ఓ పది అడుగుల దూరంలో, తమాషాగా తనవైపే చూస్తూ 'ఏం ఎన్కకు రావా?' అన్నట్లనిపించి కాళ్ళతోనే మెల్లగా వెనుకకు తన్నుతూ, గుంపుకాడికి ఒచ్చిండు.

'చెప్పుండ్రీ బేటా ఏంకావాలె' అన్నడు.

'ఏమొద్దుగానీ, గా సైకిల్ కు రెండు జండా లేంది?'

'అదేం! జవానీ పిలగా గట్లా కొత్తగడ్గుతాండ్రు, ఒకటి మన భారత్ తిరంగా జెండా, ఉంకోటీ మా ఆకూ పచ్చా ఇస్లాం జెండా.' చూపులను అదివరకే పరిచయమున్న సాకలోళ్ళ యువకుని వైపూ, కరుణాకర్ రెడ్డి మండల భాజాపా ప్రెసిడెంట్ కొడుకు వైపూ మిగిలిన నల్గురు కొత్త వాళ్ళందరి ముఖాలవైపు తిప్పుతూ అన్నాడు.

అందరితో పాటు చాకలోళ్ళ పిలగాని నుదురుకు కూడా మందపు, వెడల్పు సింధూర బొట్లో, నామాలో ఉన్నయ్.

'ఇగో కాకా ఇంతకాలం జరిగిందేందో జరిగింది, కానీ, ఇది హిందుస్థాన్, అంటే హిందూ దేశం. గీ ఝుండా మాత్రమే అంతటా, అందరూ పెట్కోవాలె. సమ్ ఝే.' ఆజ్ఞాపిస్తూ.

హాండిల్‌కు ముందున్న రెండు జెండాలను ఊడబీకి రోడ్డువారకు విసిరేసిండు స్థానికుడు కాని ఒక యువకుడు.

బిత్తరపోయిన కరీంసాబ్, 'అదేందీ జవాన్ బేటా, ఆ జండాలనూ అట్లా పారేస్తవ్. మీదీ జెండా పెట్కోనీకె నాకూ ఏం ఇన్‌కార్ లేదూ. గానీ మన భారత్ జండా మన అందర్కీ ఇజ్జతీ కీ సింబల్ తో హైనా. ఇంకోటి మాదీ జెండా. బస్ ఆ జెండా పెట్టుకున్నంకా నాదీ బేరం కలిసొచ్చింది జవాన్' అంటూ మెల్లగా, కుడి కాలును రోడ్‌కు సపోర్ట్‌గా ఉంచి, ఎడమకాలును ఎత్తి హాండిల్ మీదుగా కిందకు దిగి, వెనక స్టాండ్ వేసి, పారేసిన జెండాల వైపు నడిచిండు.

'ఏం చేస్తడో ముసలోడు చూద్దాం, ఎవ్వరేం మాట్లాడకండిరా భయ్యా. తోటివాళ్ళను ఆజ్ఞాపించి' తమాషా చూడవట్టిన్రు.

కరీంసాబ్ రోడ్డు వారనపడి ఉన్న జెండాలను దులిపి జాగ్రత్తగా వాటి కర్రలకు చుడుతూ వెనుకకు వచ్చి 'నౌ జవాన్ మీదీ మాటా తీసెయ్యను, కానీ ఈ దినంకూ మాత్రం ఎట్లా తెచ్చినానో గట్లే ఇజ్జత్‌గా ఇంటికీ తీస్కాపోత బేటా, జరా సబర్ కరో జవాన్' దీనంగా అడిగి, అనుమతి కోస్రం ఎదురు చూడకుండా, సైకిల్ హాండిల్ కు బిగించాడు.

'ఒస్తా జవాన్, రేపట్నుంచీ మీ ఒక్కటే జెండా పెట్టాకోని బేరం జేస్కుంటా. ఇదే ఇలాకా, ఈ ఊరి జవానీ పిల్లలు ఇద్దరు ఉన్నర్ గద, వాల్లా జూస్తర్ గద.' అంటూ తెలిసిన పిల్లల వైపు చూసిండు.

'అన్నా పోనీ రేపట్నుంచి ఏ జెండా లేకుండా మనదే పెట్కుంటనంటాండుగద!' తమ రాష్ట్ర స్థాయి నాయకుణ్ణి అనునయించిండు చాక లోల్ల అనిల్.

'బొంగూ పేలాల్..మక్కా జొన్నా... ...' కేక వేస్తూ ఊరి చివర కాలనీ వైపు నడుస్తుండగా వెనక ఇంతకు ముందున్న గుంపులోని స్థానిక విద్యార్థి సంఘ వింగ్ నాయకుడు, కరుణాకర్ రెడ్డి కొడుకు విష్ణువర్ధన్ రెడ్డి, 'ఈ మొండి కొడ్కులకు మస్తు త్యామాన ముంటది, సూసిన్రా ఆ ముసలోని స్టైల్' కరీంసాబ్ వైపు చూస్తూ పక్కవాళ్ళను రెచ్చ గొట్టిండు.

- - -

"బొంగూ పేలాల్... ..." ఊరి ఇండ్లన్నీ దాటినంక ఓ వంద, వందా యాభై అడుగుల దూరం ఖాళీ దారి, దారిలో కొన్ని పెంటకుప్పలు మనుషుల విసర్జనల మల కుప్పలు దాటి, తర్వాత నుండి, ప్రణాళికా బద్ధంగానే వేరు చేసినట్లు నిర్మించిన ఇందిరా ఆవాస్ యోజన–గోడలు, సిమెంట్ దర్వాజాలు కిటికీలు మాత్రం బిగించి మిగిలిన ఫినిషింగ్ పనులన్నీ వదిలి, అనధికారంగా అప్పగించినవి కొన్ని. పునాదుల కాన్నే కొన్ని, సిమెంట్ పిల్లర్స్ కప్పులేసి సగం గోడలు కట్టి వదిలేసినవి కొన్ని, పాత పూర్వ గుడిసెలూ, చిన్న పెంకుటిండ్లూ కొన్ని, ఉన్న కాలనీ లోనికి, దాదాపు సెంటర్ అనే స్థలంలోని అంబేద్కర్ విగ్రహం ముందు రోడ్డు వార, కాలనీ వాళ్ళు ఎప్పుడో కట్టుకున్న చిన్న హనుమాన్ గుడి పక్క రావి చెట్టు కాడ్కి చేరి సైకిల్ స్టాండువేసి, చెట్టు చుట్టూ ఉన్న గద్దెమీద కూలబడ్డడు.

భుజం మీది గళ్ళ కాటన్ షాల్ తో ముఖం తుడుచుకుంటూ, 'బొంగూ పేలాల్, మక్కా జొన్నా పేలాల్, డబల్ రొట్టే, పుట్నాల్...'ఏందోబరువు దిగిపోయినట్లు హాయిగా బిగ్గరగా రెండు సార్లు కేక వేసి, చుట్టూ చూసిండు.

హనుమాన్ గుడిమీద ఎప్పటి లాగే, ఎగురుతున్న హనుమాన్ బొమ్మకింద "జై శ్రీరామ్" సునేర్ రంగు రాతతో సాఫ్రాన్ జెండాను చూసి, తనసైకిల్ కు కొద్ది ముందే బిగించిన జెండా వైపు పరిశీలనగా చూసిండు. మళ్ళీ గుడిమీది జెండా వైపుచూసి, 'రొండూ జెండాలూ డిటో, సేమ్ టూ సేమ్' అనుకుంటూ,మళ్ళీ 'బొంగూపేలాల్... ...' రెండు అరచేతుల్నూ లౌడ్ స్పీకర్ ఆకారంలో చుట్టి అరిచిండు, కరీం సాబ్.

అంతలో నలుగురు కాలనీ యువకులు చేతుల్లో రెండు రకాల జెండా కర్రల కట్టలతో అరుగు వైపు వచ్చింద్రు. వారివెంబడే చిన్న పిల్లలు ఒక్కరొక్కరుగా తల్లులతోనో, అమ్మమ్మ తాతలతోనో వస్తూ కరీంసాబ్ సైకిల్ చుట్టూ గుంపవుతున్న వాళ్ళలో నుండి ఒకావిడ, 'ఏంది కరీంసాబూ ఇయ్యాల గుడిసెల కాడ్కి రాలే, ఈన్నే గూకోనమ్ముతవా ఏంది?'

'ఏంది పానం బాగలేదా ఏంది?ఎట్లనో ఉన్నవ్!'మరో పాత రెగ్యులర్ కస్టమర్.

'ఔ సెల్లా,ఇంట్లాకెల్లీ ఎల్లేటప్పూ బాగనే ఉన్నగనీ..'

'ఇంగో కరీం సాబూ,నాకో డబ్బ మక్క ప్యాలాలు, అద్దపావు పుట్నాలీ'

'ఉంగో నాకు రొండు డబల్ రొట్టెలు, చెటాకు పుట్నా..'

'జెరా ఓప్కే వట్టుంర్డీ అమ్మా, అందర్కీ ఇస్త'

అంతలో ఒగ కాలేజీ పిల్ల, 'ఏంది కరీం కాకా ఎప్పుడు రెండే జెండాలు వెట్కోనొచ్చెటోనివి, ఈయాల మూడు జెండాలతో ఒచ్చినవ్!'

'ఆ ఎపుడూ ఒచ్చీనవ్ మన్మారాల్ పిల్లా,

కాలేజీ తాతీలా? బాగా బక్కా పడినవ్ ఆస్టల్ల బోజ్నెం బాగా లేదూ ఏం?'

'అదెప్పుడు బాగున్నది తాతా, బాగుండాలంటే రెండు దినాలకూ, మూడు దినాలకూ కొట్లాటనే, అది సరే గనీ, నా సవాల్‌కూ జవాబు జెప్పాక పోత్వీ తాతా' యాస మార్చి పరాచికమాడింది రేణుక.

సైకిల్ హాండిల్‌కు కొత్తగా బిగించిన జెండాను పీకి చేతిలోనికి తీసుకుంటూ.

'ఆ ఆ ఆ... ఆ జెండాను మాత్రం తీయకు, రేపట్నుంచీ గా ఒక్కటే జెండా వెట్కోని బేరాన్కీ తిర్గాలె.'

'గదేం? ముందు వెట్కునే జెండలు బోర్ గొట్టినయా'

సంభాషణ జర్గుతుండగా మరో ముగ్గురు యువకులూ, ఒక ముస్లిం కాలేజీ ఈడు యువతీ ఒచ్చింద్రు.

కరీంసాబ్ విషయాన్ని దాటవేసే ప్రయత్నం చేసినా, ఫలించక తప్పని పరిస్థితుల్లో..

'ఇగో పెద్దా సద్వులూ సద్వుకుంటున్న జవానీ పిల్లలూ, ఇది హిందువులూ మెజారిటీగ ఉన్నా దేశం, ఏ దేశంలా ఎక్కడా ఐనా, బడితే ఉన్నోనిదే బర్రె. జెండాదీ ఏముంది, వాల్లదే ఔనూ అంటే సరిపాయె. పోనీ బిడ్డా, కస్టం జేసూకొనీ బతికేటోల్లం. లొల్లీ ఎందుకా జవానీ బచ్చే. నేనూ పోతా బిడ్డల్. సలాం. కాదూ కాదూ, నమస్తే నమస్తే.' కొనడాన్కి ఒచ్చినోల్లకు అందర్కీ, వాళ్ల వాళ్ల కోరినట్లు ఇచ్చి ,సైకిల్ స్టాండు తీసిండు పోవటానికి.

'ఔ నంతే, మీరంతా హిందువులు–ధర్మసింధు బిందువులు. హమ్ జో హిందూ నా హెూతే, యా నామాన్తే..' తలా కుడి చేయెత్తి గంభీరంగా నినాదమో ఆదేశమో అనిపించే

తీవ్ర గొంతుతో అంటున్న యువతి వైపు మిగిలిన యువతీ యువకులందరూ ఈమెకేమాయె అన్నట్లు ఆశ్చర్యంగా చూస్తుండగా,

'..ఫారెన్ యే దేశ్ సే బాహర్ భాగ్ నా వర్నా..'అంటూ రేణుకను జబ్బపట్టి దగ్గరకు లాక్కున్నది,'..యే ధరమ్ సింధు బిందువులు హమ్రే జైసే లోగోంకో బైటికి భగాయిస్తరు, కాదానె?!' ఎత్తిన తల దించి తోటి యూనివర్సిటీ యువకులందరి ముఖాల్లోన్కి కొంటెగా చూసింది నస్రీన్ సుల్తానా. తర్వాత నజీర్ వైపూ ఓరగా బనాయింపుగా చూసింది.

ఐదారు సెకన్లలో అందరూ తేరుకున్నరు.

'ఓసి నీ నాటకాలు. అంతలోనే ఎంత పరిషాన్ జేసినవే తుర్కదానా'

'నిజమే గదనే. మాదిగలు మీరు గుడ హిందువులే అంటరు గదే'

'అమ్మా తల్లులూ మీ పరాచికాలు హద్దులు దాటుతానయ్, పాండి పాండి క్యాంపెయిన్కు టైమైతాంది.'టీం లీడర్.

'వేరే గ్రామాలల్ల స్టార్టైంగ్రో!' అనుకుంటూ ఫోన్ తీసిండు.

'సారీనే'

'పరాచికానికి సారీ లుంటయానె, నేన్గుడ నిన్నన్న గాదె నేనూ సారీ జెప్పల్నా! అంతగా ఐతే, నేను మీ ఊరికొచ్చిన గన్క, రిపెంటెన్స్ లాగ నాకో మాంచి జీన్ ప్యాంటూ, ఒక ఫైన్ టీ షర్ట్ కొనీ. అంతేనా టీమ్ లీడర్.యామై కరెక్ట్!'

'క్వైట్ కరెక్టే రెహానా బెహెన్ విష్ యూ బికమ్ యాన్ డెసిఫరేట్ డిస్క్రిమినేటివ్ అసర్టివ్ జడ్జ్.'

'థ్యాంక్యూ బ్రదర్'

'అరే బోజనాన్కి ఎవరు యా యింటికో డిసైడయిందార తిర్పతీ' అడుగుతూ, నాకో ఐడియా ఒచ్చింది. పక్కగూడెంల ఉన్న మన ప్రసిడెంట్ అంజన్నతో మాట్లాడిన ఇప్పుడే. ఆందరు బువ్వవెట్కోని గిడికే రాంద్రి.' అనిచెప్పి అప్పుడే ఐదారడుగుల దూరం వెనుకకు తిరిగిన కరీంసాబ్ ను, 'ఓ కాక జెరాగు,నే రేపోస్తుండవ్ గద!' పిలిచిండు టీమ్ లీడర్.

'హా బేటా కహో!'

'కుఛ్ నై కల్ ఆప్, ఓ పురానీ దో జెండా, ఓయీ తిరంగా ఔర్ హరా, ఓ హిందూవాహినీ లోగోంకా సఫ్రాన్ జెండా, ఔర్ యే నయా దో, లాల్ ఔర్ నీల్ పూరా పాంఛ్ జెండా, ఐసా రఖ్ కే ఆ, ఔర్ బిజినెస్ కరో.'

'బేటా!'

'డర్ నే కా కోయీబాత్ నై, ఆప్ కే సాథ్ యే లడ్కీ రెహనా భీ పుకార్తా యా ఫిర్ తా'

'బేటా బేటా జరా సున్ లే..'

'సున్‌నేకా కోయీ నై అబ్. హమారా లీడర్ కహేనా, రేపు ఒక్కటే రోజు కాదు, మాలో ఎవ్వరమన్నా ఒకరం, హమేషా నీ ఎంబటే ఉంటం దాదా, ఎల్లండీ.

పక్కనే అజ్మత్ దర్గా కాడ మీ ఇల్లు నాకు తెల్సూ, రేప్పొద్దున్న ఈ అక్కను మీఇంటికాడ్కి తెచ్చి, నీకప్పజెప్త. ఠీక్‌హైనా.' సముదాయించి హామీ పడి పంపించిండు తిరుపతి.

టీమ్ లీడర్ చెప్పిన ప్రకారం అందరి భోజనాలూ, ఆయా ఇండ్లల్ల నుండి సత్తు, స్టీల్ పల్యాలల్లో గుడి అరుగు కాడ్కి ఒచ్చినయ్.

'ఇగ జెప్పన్నా రగుమన్నా, నీవేం ప్లాన్ వేసినవో మన రాష్ట్ర ప్రసిడెంట్‌తో మాట్లాడిందేందో మాకేం జెప్పకుండనే ఆ ముసలాయినకు హామీ ఇచ్చి పంపితివి!'

'థ్యాంక్స్ ఫ్రెండ్స్ మీ డిసిప్లిన్కు. నా మీద నమ్మకంతో ఎదురు మాట్లకుండా ఫాలో ఔతున్నందుకూ. బువ్వ కలపండి. తిన్కుంట జెప్త..' అంటూ తనూ పల్లెంలోని ఆహారం కల్పుతూ, హఠాత్తుగ ఆపి.

'అరే తిరుపతీ అంబేద్కర్, ఇదేందిరా కోడికూర లాగుంది?'

'ఔనన్నా తొల్త దిన మంటని మేమే రెండు నాటు కోళ్ళను కోసి ఒండిచ్చినమన్నా. అందర్కీ జెర్ర జెర్రే. మిగిలిందంతా ఏ ఇంట్లున్నది అదే వాల్లకున్నదే పెట్టింద్రు. సూడన్నా'

జెర భయపడుతూ చెప్పిండు తిరుపతి. లీడర్ ముఖ కవళికలు గమనించి, 'అన్నా తిరుపతీ ఇదేం బాగలేదబ్బా. మనం ఏమమనుకున్నం ఎట్లనుకొని ఈ పల్లెలకు బయల్దేరినమో గట్లే జర్గాలె.

ఇంకో సారిట్లైతే ఎవ్వరం దినం. యాదుంచు కోండంత. ఇపుడింక తిందం ఈ ఒక్కసారికి.'

తనే వకాల్తా తీసుకున్నది రెహనా. తింటూ ప్లాన్ అంతా చెప్పిండు టీమ్ లీడర్. సందేహాలూ నివృత్తులూ అన్నీ ఔతూనే పూర్తయే వరకు చాలా పొద్దుపోయింది.

– – –

మరుసటి రోజు కరీంసాబ్‌తో బేరానికి తోడుగా మామూలు పంజాబీ డ్రస్‌తోనే బయల్దేరింది రెహనా. ఊరంతా చివరికాలనీ దాన్కబేరం చేసుకునే వరకు క్రితం వాహిని బృందం యువకుల గుంపెవరూ ఎదురు పడలే. సాయం సుమారు మూడు గంటలకు తిరుగు ప్రయాణంలో ఊరి ఇటు చివర ఎదురయ్యింద్రు. గుంపులో ఒకరిద్దరు కొత్తవాళ్ళున్నరు.

'ఎదురైన గుంపులోని నిన్నటి యువ నాయకుడికి సైకిల్ కున్న ఐదుజెండాలు చూసి , కాసేపు తికమకైంది. కొత్తగా చేరిన రెండు జెండాలు తమ జెండాతో సహా మిగిలిన జెండాలనూ డామినేట్ చేస్తున్నట్లు గమనించిండు.

'ఏయ్ తుర్కముసలోడా ఏంది, ఒక్కటే జెండాతోనే తిరుగుతూ బేరం జేస్కుంట నంటివి. ఈయాల ఎక్స్ ట్రా గీ ఎర్రజండా, నీలి జెండాలతోనొచ్చి బేరంజేస్కోని పోతుండావ్! ఏం సవాల్జేస్తుండవా? నక్రాల్ జేస్తుండవా?'

అంటూ కాషాయ జెండా ఒక్కటుంచి మిగిలిన నాల్గింటినీ చించి కర్రలు విరగ్గొట్టి కాళ్ళకాడ వేసి కసిగా తొక్కవట్టిండు.

'భయ్యా భయ్యా జెరాగు....'రెహనా కల్పించుకుంది.

'నీ వెవ్వర్ నీకు ఈ బుడ్డామియాతో ఏం సంబంధం!'

'నేను ఇతనికి దూరం సుట్టం. మనుమరాలు రిలేషన్. బ్యారాన్కి తోడుగ రమ్మంటే ఒచ్చినా.'

'అట్లనా ఐతే ప్లాన్‌గనే ఒచ్చినవన్న మాట'

'అన్నా, తాత మీ జెండా ఒద్దనలేదూ గదా,

ఆయనిష్టం ప్రకారం ఆయ్నవీ మీదీ, ఇగో ఆ కాలనీకి పోతె ఈ లాల్, నీల్ జెండాలూ వెట్టిన్రు, గాడ యూత్. ఆయ్న ఎవ్వరి మాటా కాదనట్లేదన్నా. తన సెంటిమెంటుకూ గుడ రెస్పెక్ట్ ఈమంటున్నడు.'

'నీ వెవ్వతివే తుర్కా లం..' గుంపులో ఒకడు.

'ఏయేయ్ మాటల్ సరీగ రానీ. సద్వా కోలేదా, సంస్కారంతోనీ మాట్లాడు' హెచ్చరించింది కుడి చేతి చూపుడు వేలు ఎత్తి.

'ఇదేందిరో మన ఊరికొచ్చి మనకు సంస్కారం నేర్పు తాంది. ఈ తుర్కదాన్నో సూపు సూడాలెరా, మాంచి పట్టు మీదుంది' వాహిని టీం లీడర్ విష్ణువర్ధన్‌రెడ్డి అంటూ, ఊరివైపునుంచి ఒచ్చిన ఆరుగురి యూత్ ను అప్పుడే గమనించి, 'మీరెవ్వరు?'అనుమానిస్తూ అడిగిండు.

'మేం యూనివర్శిటీ అంబేద్కర్ విద్యార్థి సంఘం, ఆలిండియా స్టుడెంట్స్ ఫెడరేషన్, ఇంకొన్ని సంఘాలకు చెందిన ఒగరో ఇద్దరో చొప్పునున్నం. క్యాంపు కొచ్చినం. ఏంది లొల్లి అన్నా! ఆ పిల్లను ముసలాతన్నీ వట్టుకొనీ?'

'ఓహో అంతా మాల మాద్గిసంఘాలూ, కమ్యూనిస్ట్ అనుబంధ సంఘాల బాడ్కావ్‌లన్నమాట. ఇంతకూ నీవు ఈ క్యాంపెయిన్ టీం లీడర్‌వా నీపేరేందిరా?'

'అంతొద్దు భయ్యా. నాపేరు రఘుమారెడ్డి. కాని బాడ్కావ్‌ను గాదు, అసల్ బాడ్కావ్ అంటే ఎవ్వరో తెల్సా చెప్పన్నా.'

'... ... ...'

'ఏం తెల్వకుండనే అంటివార, మీ లాగ మీ స్వాములూ, అయ్యోర్లు లాగ అన్యాయంగ మాటల్జెప్పి వ్యాపారం జేసీ కష్టం జేసే జనంతోని వెట్టి జేయించుకోని, మట్టంటకుండా, సెమ్ట సుక్క కార్చకుండ తిని బల్పెక్కిన మీ లాంటోల్లు బాడ్కావ్‌లు.

'సమ్ ఝే.'

'ఇంగ సరిపోయిందా ఆ సెల్లెకు సారీ జెప్పి మీ దండి సాములోరి సప్తాహ వారోత్సవ శిబిరాన్కి వోండి. రేప్పొద్దుగాల వరకు మీ జై శ్రీరామ్ కాషాయజండాలతో పాటు మా లాల్, నీల్ జెండాలు గుడ ఈ మండలమంతా ఎగుర్తయ్ సూస్కోండ్రి.'

'మంచిది సూస్కుందం రేపు.'

'మీరేం జూస్కుంటరో సూస్కుందురు గాని, మొదాల ఆ సెల్లెకూ, కులం పేరుపెట్టి తిట్టినందుకు మాకూ సారీ జెప్పికదులుండి సావీ'

జారుకుంటున్న వాహిని గుంపుకడ్డంగా నిలబడ్డరు.

అంతే తిట్లూ, తోపులాటలూ, పిడిగుద్దులూ, తన్నులూ శురువైనయ్ హోరా హోరీగా.

రెహనా,రేణుకలు పోలీస్ స్టేషన్‌కు, జారుకున్న ఇద్దరు హిందూ వాహిని యువకులు శిబిరం వద్దకూ పరిగెత్తిన్రు.

T


పుస్తక పరిచయం

# విప్లవోద్యమ గమనం-అతడు

సామాజిక పరివర్తన కోసం నాటి నుండి నేటి వరకు జరుగుతున్న అనేక ఆలోచనలకు, దృక్పథాలకు సమాజంలో సరైన చర్చావేదికను కల్పించడానికి ఏర్పడ్డ ప్రచురణ సంస్థ పర్‌స్పెక్టివ్. ఇప్పుడు పర్‌స్పెక్టివ్స్ ప్రచురణ సంస్థ నుండి యాభై తొమ్మిదవ పుస్తకంగా అల్లం రాజయ్య "అతడు" కథా సంపుటి వెలువడింది. పర్‌స్పెక్టివ్స్ చేపట్టిన అల్లం రాజయ్యగారి సాహిత్య ప్రచురణ ప్రాజెక్ట్ 2008 జనవరిలో ప్రారంభమై జూన్ 2019కి 6వ సంపుటంగా తీసుకువచ్చింది. పర్‌స్పెక్టివ్స్ ప్రచురించిన తన ఆరు సంపుటాలలో ఇది మూడవ కథా సంపుటం. మిగతా మూడు నవలా సంకలనాలు. నవలలు మొత్తం ఐదు. కొలిమంటుకున్నది, ఊరు, అగ్నికణం ఒక సంపుటిగా, కొమురం భీం, వసంత గీతం విడివిడిగా వచ్చిన నవలలు. ఈ సంపుటిలో 1987- 2000 వరకు రాసిన కథలను ప్రచురించారు. ఇందులో మొత్తం ఇరవై ఐదు కథలు ఉన్నాయి.

సామాజిక, ఆర్థిక, రాజకీయాల నేపథ్యంలో వాస్తవ జీవితాలకు సృజనాత్మక రూపమే అల్లం రాజయ్య గారి ఈ కథలు. అల్లం రాజయ్య గారు విప్లవోద్యమం తయారు చేసిన రచయిత. అల్లం రాజయ్య గారి ముప్పై సంవత్సరాల రచనా వ్యాసంగాలకు ప్రత్యక్ష పరిశీలకుడుగా ఉన్న ప్రముఖ విప్లవ కవి, విమర్శకుడు వరవరరావు గారు ఈ ఆరు సంపుటాలకు సంపాదకత్వం వహించారు.

"తొవ పొడుగునా కన్నీళ్లుంటాయి, ఘర్షణలుంటాయి. వాటి స్పందనలే నా రచనలు" అని అల్లం రాజయ్య తన సాహిత్య వస్తువును తెలిపారు. చాలా స్పష్టమైన ప్రజా దృక్పథంతో రచనలు చేశారు. 2000 సంవత్సరం తర్వాత వచ్చిన అనేక పరిస్థితులు రాజయ్యను రాయనీయకుండా ఉండనీయలేదు. తర్వాత కూడా కొన్ని కథలు, 'టైగర్ జోన్' అనే ఒక నవల రాశారు. నిత్యం కథకులను తయారు చేస్తూ కథా కార్యశాలల రూపకర్తలుగా, నిర్వాహకులుగా పనిచేస్తున్నారు. నిత్య కార్యశీలిగా ప్రజా క్షేత్రంలోనే ఉన్నాడు. విప్లవ సాహిత్యమైనా, మార్పు సాహిత్యంగా భావించబడే సాహిత్యానికైనా మానవజాతి దోపిడీ, పీడనల నుంచి అసమానతల నుంచి విముక్తం చేసే స్వభావం




**"అతడు" కథలు**
రచయిత: **అల్లం రాజయ్య**
సంపాదకుడు: **వరవరరావు**
వెల.: 400/-
ప్రచురణలు : **పర్‌స్పెక్టివ్స్ ప్రచురణలు, 2019**
ప్రతులకు: నవోదయ బుక్ హౌస్, ఆర్య సమాజ్ ఎదురు వీధి, కాచిగూడా చౌరస్తా, హైదరాబాద్-500027

ఉంటుంది. అందులో ఒక స్వప్నం, ఒక దార్శనికత ఉంటుంది. సరిగ్గా ఈ ఆదర్శాలతోనే అల్లం రాజయ్య రచనలు చేశారు. ఈ సంపుటిలోని కథలన్ని విప్లవోద్యమంతో, విశాల విస్తృత అర్థంతో సంబంధం ఉన్న కథలే. ఇందులో పన్నెండిటిని ప్రత్యక్షంగా ఉద్యమ కథలుగా, ఆరింటిని జెండర్ ప్రధాన్యత స్పృహతో రాసినవిగా చెప్పవచ్చు. ఉత్పత్తి సంబంధాలు, మానవ సంబంధాల మీద కేంద్రీకరించినవి నాలుగు కథలు, కార్మిక రంగానికి సంబంధించినవి మూడు. రైతాంగం, కార్మిక వర్గ, ఆదివాసీ దృక్పథంతో ప్రజల రాజ్యం ఏర్పడితే పర్యావరణ


**(తరువాయి 50వ పేజీలో...)**

పుస్తక
పరిచయం

# రాయలసీమ సమాజం-సాహిత్యం

సామాజిక పరివర్తన కోసం నాటి నుండి నేటి వరకు జరుగుతున్న అనేక ఆలోచనలకు, దృక్పథాలకు సమాజంలో సరైన చర్చావేదికను కల్పించడానికి ఏర్పడ్డ ప్రచురణ సంస్థ పర్‌స్పెక్టివ్. ఇప్పుడు ఈ వేదిక నుండి 60వ పుస్తకంగా ''రాయలసీమ సమాజం-సాహిత్యం'' అనే పుస్తకం వెలువడుతుంది. పుస్తక రచయిత బండి నారాయణ స్వామి. ఈయన సృజనాత్మక రచయిత. కానీ ఈ సారి ఒక ప్రత్యేకమైన సందర్భంలో మన ముందుకి వస్తున్నాడు. నారాయణస్వామి గారు తన ముందుమాటలో ఈ విధంగా అంటాడు. "ముప్పై యేండ్లుగా రాసింది కాదు ఈ కొత్త సందర్భాన్ని చూడు. ఈ కొత్త సందర్భం గురించి రాయి అని మరీ శాసిస్తాయి". ఇంతకాలం ఇలా ఉందని రాశాము ఇలా ఎందుకుందో రాయాల్సిన అవసరం వచ్చిందని గ్రహించాడు. ఈ సందర్భం తన రచనలకు మాత్రమే రాలేదు. తన రాయలసీమ సమాజానికి వచ్చింది. సమాజం ఎప్పుడైనా మార్పు రావాలని కోరు కుంటుంది. అది ముందుగా రచయితల కలాల్లో జాలు వారుతుంది. రాయలసీమలో 1980 నుంచి కరువులకు వ్యతిరేకంగా, దోపిడికి వ్యతిరేకంగా అనేక పోరాటాలు వచ్చాయి. వాటిల్లో బండి నారాయణస్వామి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో వాటిల్లో భాగమయ్యారు. అందుకే ఈ పోరాటాల నేపథ్యం నుంచే రాయలసీమ సమాజం మార్పు కోసం మొదటిమెట్టుగా ఇలాంటి ఆలోచనలు పుట్టాయి. ఈ పుస్తకంలో నారాయణస్వామి తన వ్యాసాలను సమాజ వ్యాసాలు, సాహిత్య వ్యాసాలుగా రాశారు. రాయలసీమ సమాజ గత, వర్తమానాలను విశ్లేషిస్తూ భవిష్యత్తును కలగంటున్నాడు. ఉద్యమం ఒకేసారి రూపుదిద్దుకోదు. పరిమాణాత్మక మార్పు ద్వారానే గుణాత్మకమైన మార్పు సాధ్యమవుతుంది. ఆ భావనకు పరిణామాత్మకమైన ఆలోచన ధార ఉండాలి. ఆ కృషిని ప్రారంభించారు నారాయణ స్వామి.

రాయలసీమ పూర్వాపరాలు, 18వ శతాబ్దంలో రాయలసీమ, రాయలసీమ-భూస్వామ్య వ్యవస్థ వంటి వ్యాసాలు, రాయలసీమను పూర్వం నుంచి నేటి వర్తమాన స్థితిని బేరీజు వేసుకోవడానికి ఉపకరించే సాధనాలు. ప్రతి ఉద్యమానికి బలమైన ఇరుసులు రెండు ఉంటాయి. ఒకటి రాజకీయోద్యమం,




**రాయలసీమ సమాజం-సాహిత్యం**
**(వ్యాసాల సంపుటి)**
రచయిత: **బండి నారాయణ స్వామి.**
సంపాదకుడు: **ఎ. కె. ప్రభాకర్.**
వెల. 200/-
ప్రచురణ: పర్ స్పెక్టివ్స్ ప్రచురణలు, 2019.
ప్రతులకు: నవోదయ బుక్ హౌస్, ఆర్య సమాజ్ ఎదురు వీధి, కాచిగూడా చౌరస్తా, హైదరాబాద్-27

రెండవది సాహిత్యోద్యమం. ఈ రెండింటిని ఒకే పుస్తకంలో సాధించారు నారాయణస్వామిగారు. నేడు సీమ మేధావులు ఈ విధమైన కృషి చేయాల్సిన అవసరం ఉంది. తనకే ప్రత్యేకమైన ఒక భౌగోళిక, చారిత్రక, రాజకీయాల సందర్భంలో ప్రాంతీయ అస్తిత్వాలు ఏర్పడుతాయనే మౌలికాంశాన్ని గుర్తించారు. సీమ మేధావులు ఏం చేయాలి? అనే వ్యాసంలో మేధావుల ముందు నారాయణస్వామి కొన్ని ముఖ్య ప్రతిపాదనలు చేశారు. ఆంధ్రోద్యమం నుండి తెలంగాణ ఏర్పడేంత వరకు, శ్రీబాగ్

ఒడంబడిక అంశాల నుండి నేటికీ ప్రాసంగికత కలిగిన అనేకాంశాలను చర్చించారు.

ఉద్యమ నిర్మాణంలో చాలా సంక్లిష్టమైన విషయాలను కూడా చాలా స్పష్టంగా మాట్లాడిన వ్యక్తి బండి నారాయణ స్వామి. రెండు జిల్లాల అభివృద్ధికి, తమ తోడుగా మరో రెండు జిల్లాలు వ్యతిరేకమైన సందర్భాన్ని తెలియజేస్తూ సున్నితమైన సందర్భంగా విశ్లేషించారు. "భిన్న ఆలోచనల ప్రాతిపదికగా మేధావులు విడిపోవడం కంటే, రాయలసీమ ప్రయోజనాలు అనే మౌలికాంశం పట్ల తమ భిన్నమైన ఆలోచనల్లోనే కలిసి పనిచేయడం శ్రేయస్కరం. ఈ సందర్భంలోనే రాయలసీమ రచయితలూ, మేధావులు ఒక ప్రజాస్వామిక వేదిక ఐక్య సంఘటనగా మారవలసి ఉన్నది" అనే ప్రతిపాదన చేశారు.

సాహిత్య పరంగా చూసినప్పుడు తెలుగు సాహిత్యంలో ప్రాంతీయ సాహిత్యాలకు అన్యాయం జరిగి, వాటి అధ్యయనాల్లో ఉద్దేశ్య పూర్వక చర్యలు జరిగినప్పుడు ప్రాంతీయవాదం సాహిత్యంలో ప్రతిఫలిస్తుంది. నారాయణ స్వామి ప్రాంతీయ చరిత్ర, భౌగోళిక స్థితిగతులు కూడా సాహిత్య పరిణామానికి దోహదం చేస్తాయని నిరూపకాంశంగా మారుతాయని గుర్తించాడు.

ప్రాంతీయవాద లక్షణం, ఆకాంక్ష, ఆచరణ, చైతన్యం, సాహిత్యం ప్రతిఫలిస్తుంది. బండినారాయణ స్వామిగారు కథా సాహిత్య ప్రక్రియలో రాయలసీమ వాదాన్ని చూపినంత బలంగా నవలా, కవిత్వాలలో చూపలేదనిపిస్తుంది. వారు నవల, కవిత్వంపై రాసిన మూడు వ్యాసాలు భావి పరిశీలకులకు మార్గదర్శనం ఇవ్వగల సామర్థ్యం ఉన్న వ్యాసాలు. బండి నారాయణ స్వామి చేసిన ఈ కృషిని ప్రజాస్వామిక వాదులుగా అందరూ ముందుకి తీసుకుపోవాల్సిన చారిత్రక బాధ్యతను తెలియజేస్తూ ఈ పుస్తకాన్ని నడుస్తున్న తెలంగాణ పాఠకులకు పరిచయం చేస్తున్నాము.

**(48వ పేజీ తరువాయి)**

సమస్యలు మొదలు స్త్రీ పురుష సంబంధాలు, రాజకీయాలు, వ్యక్తిగత జీవితంలో కూడా మంచి మార్పు సాధ్యం అవుతుందనే ఆకాంక్ష, ఆచరణ ఈ కథల్లో చూపించారు.

"తండ్రి ఒక అయ్య చేతిలో పెట్టి మళ్ళీ వెనక్కి తీసుకొని మరో అయ్య చేతిలో పెట్టే ఒక శరీర వస్తువు స్త్రీ", "పురుషుని ఆగ్రహమంతా వ్యక్తమయ్యే దుర్మార్గ రూపం భార్యపై దాడి" వంటి ప్రతిపాదనలు ఎంతో సునిశిత పరిశీలన వల్ల మాత్రమే సాధ్యమవుతుంది. ఇలాంటి పరిశీలనలు ఈ కథలన్నింటిలో కనపడుతుంది. ప్రజలే నిజమైన గురువులు అని మావో చైనా నూతన ప్రజాస్వామిక విప్లవ పోరాట అనుభవం వంటి అనుభవాల్ని చొప్పించిన కథ గురువులు.

సింగరేణి కార్మిక సమాఖ్య నాయకుడు కట్ల మల్లేశ్ (రమాకాంత్, విజయ్)ల ఎన్‌కౌంటర్ నేపథ్యంలో 1995 ఏప్రిల్ 1న రాసిన కథ అతడు. అల్లం రాజయ్య కథల్లోగానీ, నవలల్లో గానీ, సాహిత్య సాంస్కృతిక దృక్పథంలో గానీ రాజ్యాంగ నైతికతను ప్రతిపాదిస్తున్నారా? అన్న అంశంపై వరవరరావు గారి విశ్లేషణ చాలా సమర్థవంతంగా జరిగింది. వాస్తవ సంఘటనలను ఉదాహరణలుగా చూపిస్తూ విశ్లేషణ చేశారు. సృష్టికర్తలు కథ మొదలుకొని నీల, కమల వరకు కూడా అర్థం చేసుకున్నది రైతాంగం, శ్రమ జీవులు, సృష్టికర్తలు. వాళ్ల పక్షం ఉండటమై విప్లవ నీతి అని, అదే అల్లం రాజయ్య రచనల్లో మొత్తం విప్లవ నీతియే ఉన్నదని నిర్ణయం చేశారు. శ్రామిక వర్గ నీతి, శ్రామిక వర్గం, ఉత్పత్తిలో పాల్గొనే ప్రజలు పాటించే నీతి. ఈ నీతినే అల్లం రాజయ్య తన రచనల్లో నిక్షిప్తం చేశారు. విప్లవ పోరాటాల సృజనాత్మక వ్యాఖ్యాత అయిన అల్లం రాజయ్య గారి మూడవ కథల సంపుటాన్ని, పూర్తిగా ఆరవ సంపుటాన్ని నడుస్తున్న తెలంగాణ పాఠకులకు పరిచయం చేస్తున్నాము.

**✶ పరిచయకర్త: ఇమ్మిడి మహేందర్,**

**పరిశోధక విద్యార్థి**

**నడుస్తున్న తెలంగాణ ఆన్‌లైన్ వర్షన్ కోసం కింది పేజీలను సంప్రదించవచ్చు**

**ఫేస్‌బుక్ పేజీ: www.facebook.com/pages/Nadustunna-Telangana**

RNI Number : APTEL /2011/37247

ISSN 2349 - 2376
Publishing Date : 14 - 08 -2019



# ARTICLE 370
# WHAT NEXT?

## కాషాయ కబంధ హస్తాల్లో కశ్మీర్ నేల

ఈ పత్రికను చదివాక మీ అభిప్రాయాలు రాయడం మర్చిపోవద్దు. మీ సూచనలే మా తొవ్వకు వెలుగు.

**To**

Printed Matter **BOOK-POST**

*From :*

ఎడిటర్, నడుస్తున్న తెలంగాణ

క్వార్టర్ నెం. ఆర్-9, ఉస్మానియా క్వార్టర్స్, ఓయూ,

హైదరాబాద్- 500 007, ఫోన్ నెం. 9290745490

చందాదారులుగా చేరండి - చేర్పించండి

సంవత్సర చందా200/-రూ.

నడుస్తున్న తెలంగాణ అకౌంట్ నెంబర్:
62254225854, ఎస్‌బీహెచ్,
రాంకోఠి బ్రాంచ్ (20350), హైదరాబాద్

**Printed, Published and Owned by** M.SNEHA LATHA Printed at: TELANGANA PUBLICATIONS, H.No.1-1-305, P.No.17, Road No. 6, Balaji Colony, Mohan Nagar, Kothapet, Saroornagar(M), Ranga Reddy-500035., Published at : TELANGANA PUBLICATIONS, H.No.1-1-305, P.No.17, Road No.6, Balaji Colony, Mohan Nagar, Kothapet, Saroornagar(M), Ranga Reddy-500035., Editor :Dr.C.KASEEM. RNI No. APTEL/2011/37247

# మహారాష్ట్ర గవర్నర్‌కి రాజకీయ ఖైదీల లేఖ



*మహారాష్ట్ర రాష్ట్ర గవర్నర్ గారికి,*

మేము సంవత్సర కాలంగా పుణెలోని యరవాడ సెంట్రల్ జైలులో జుడిషియల్ కస్టడీలో నిర్బంధించబడి ఉన్నాము. మాలో ఐదుగురిని పుణెలోని శనివార్ వాడలో జరిగిన ఎల్గార్ పరిషద్ సభ సందర్భపు నేరారోపణపై 2018 జూన్ 6న అరెస్టు చేశారు. మరొక నలుగురిని 2018 ఆగస్ట్ 28న అరెస్టు చేశారు. మామీద 2018 జనవరి 1న భీమాకోరేగాంలో జరిగిన హింసాకాండకు రెచ్చగొట్టే నేరపూరిత కుట్ర చేశామనే ఆరోపణలు, రెండు వర్గాల మధ్య ద్వేషాన్నీ శత్రుత్వాన్నీ రెచ్చగొట్టామనే ఆరోపణలు, రాజద్రోహం, దేశవ్యతిరేకత వగైరా అనేక నేరాలు ఆరోపించారు. ఈ ఆరోపణలన్నీ పచ్చి అబద్ధాలు.

దేశమంటే ప్రజలు అనే అర్థం చెప్పుకునేట్టయితే ఒక దేశపు ప్రజలు తాము ఎన్నుకున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడడం, తమలాగే ఆలోచించడానికి ఇతరులను ప్రభావితం చేయడం దేశ వ్యతిరేక చర్య ఎలా అవుతుంది? ఎల్గార్ పరిషద్ సభలో ఉపన్యాసాలతో, ప్రేరణ కలిగించే పాటలతో, నాటకాలతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా హింసకు పూనుకొమ్మని శ్రోతలను రెచ్చగొట్టామనడం నిజం కాదు. అందుకు భిన్నంగా, రాజ్యాంగాన్నీ, ప్రజాస్వామ్యాన్నీ, దేశాన్నీ పరిరక్షించడంలో భాగంగా దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా సమష్టిగా పోరాడమని ప్రజలకు విజ్ఞప్తి చేయడం జరిగింది. రాజ్యాంగానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్న భారతీయ జనతా పార్టీ ప్రభుత్వానికి వోటు వేయవద్దని విజ్ఞప్తి చేయడం జరిగింది. ఈ పని చేసినందువల్లనే మాపై ఇప్పుడు కల్పిత నేరాలు ఆపాదిస్తున్నారు. అంటే మాకు వ్యతిరేకంగా తీవ్రమైన అన్యాయం జరుగుతున్నది.

బెయిలే సాధారణమనీ, జైలు కాదనీ సుప్రీం కోర్టు స్పష్టమైన మార్గదర్శక సూత్రాలు ఉన్నప్పటికీ మా బెయిల్ దరఖాస్తుల వ్యవహారాన్ని ప్రాసిక్యూషన్ అంతులేకుండా సాగదీస్తున్నది. పబ్లిక్ ప్రాసిక్యూటర్, దర్యాప్తు అధికారి ఈ మొత్తం కేసును బహిరంగ పత్రికా విచారణలా జరిపినట్టుగానే, మా బెయిల్ విచారణ కూడ ఒక చిన్నపాటి పత్రికా విచారణలా మార్చబడింది. మావోయిస్టులతో సాగాయని ఆరోపించబడుతున్న ఇమెయిల్లను ప్రాసిక్యూషన్ స్వేచ్ఛగా పత్రికల్లో ప్రచురిస్తున్నది. కాని అందుకు సంబంధించిన ఎలక్ట్రానిక్ డాక్యుమెంట్లను నిందితులకు ఇవ్వడానికి మాత్రం ఏడాదిగా తాత్సారం చేస్తున్నారు. ఈ వాస్తవమే ప్రాసిక్యూషన్ ఉద్దేశాల పట్ల మాలో అనుమానాలు రేకెత్తిస్తున్నది. ఈ రకంగా రాజకీయ ఖైదీలను జైళ్లలో ఏళ్ల తరబడి మగ్గిపోయేలా చేస్తున్నారు. "అందరికీ న్యాయం" "తగిన సమయంలో న్యాయం" అనే మౌలిక సూత్రాలను సూటిగా ఉల్లంఘిస్తున్నారు.

కొత్త ప్రభుత్వం 'సబ్ కా సాథ్ సబ్ కా వికాస్' తన నినాదంగా ప్రకటించింది. కాని గత ప్రభుత్వాల పనితీరును చూస్తేనే ఈ నినాదం వాస్తవంగా అమలు లోకి వస్తుందా అని అనుమానించడానికి ఆస్కారం ఉంది. ప్రభుత్వం గనుక అన్ని వర్గాల ప్రజల విశ్వాసాన్ని చూరగొనదలచుకుంటే, అది మొట్టమొదట రాజ్యాంగం పట్ల తన విధేయతను నిరూపించుకోవాలి. ఆ రాజ్యాంగం మీదనే ఆధారపడి పనిచేయాలి. అది జరగాలంటే అది అందరికీ సమన్యాయం అందించాలి. భిన్నాభిప్రాయాలనూ, ప్రభుత్వ వ్యతిరేక అభిప్రాయాలనూ, విమర్శనాత్మక భావాలనూ అన్నిటినీ తొక్కివేయడం, ప్రత్యర్థులందరినీ దేశద్రోహులుగా, దేశ వ్యతిరేకులుగా చిత్రించి అరెస్టు చేయడం కచ్చితంగా భావప్రకటనా స్వేచ్ఛ మీద దాడి మాత్రమే. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందో లేదో, దేశవ్యాప్తంగా ఆవు పేరు మీద మనుషులను కొట్టి చంపడం ప్రారంభమైంది. ఇటువంటి హింస పట్ల ప్రభుత్వం మౌనంగా ఉండడం మాత్రమే కాదు, నాథూరామ్ గాడ్సేను బహిరంగంగా సంస్మరిస్తూ ద్వేషాన్ని, శత్రుత్వాన్ని రెచ్చగొడుతున్న మతోన్మాద శక్తులను అరికట్టడానికి ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదు. అందువల్ల సబ్ కా వికాస్ అనేది స్పష్టంగా బూటకపు నినాదంగా మిగిలిపోతున్నది.

ప్రజాస్వామ్యమంటే రాజ్యాంగ బద్ధతే అయితే దేశంలోని ప్రతి ఒక్కరికీ న్యాయం సమానంగా ఎందుకు దక్కడం లేదు? కొందరు జైలులో నిర్బంధాలు అనుభవిస్తుండగా మరి కొందరు స్వేచ్ఛగా బైట ఎలా తిరగ గలుగుతున్నారు? భారతదేశంలో రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పదలచుకుంటే, రాజకీయ ఖైదీలందరినీ తక్షణమే, బేషరతుగా విడుదల చేయడమే మొదటి షరతుగా మేం డిమాండ్ చేస్తున్నాం.

ఇట్లు

సుధీర్ ధావ్లే, సురేంద్ర గాడ్లింగ్, మహేశ్ రౌత్, రోనా విల్సన్

అరుణ్ ఫరేరా, వర్నన్ గోంజాల్వెస్, వరవరరావు, సుధా భరద్వాజ్